ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



13-2-'52

4 అణాలు

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



'యౌవనం'

—చిత్రకారుడు శ్రీ ఆర్. వెంకట్రావుగారు
(స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఎండ్ క్రాఫ్ట్స్ విద్యార్థి)
(వీరిదే మరొకచిత్రం వెనుక కవరు లోవైపున చూడండి.)

సంవత్సరచందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము

ప్రకటింపబడును

Founder: K. NAGESWARA RAO

సంపుటము **44**
సంచిక **23**
13-2-52

ఖర సంవత్సర మాఘ బహుళ విదియ బుధవారము

విషయానుక్రమణిక

1952 ఫిబ్రవరి 13

గమనిక

'స్వప్నలోకంలో ఆలిస్' అనే బొమ్మల కథ ఈ వారం నుండి ప్రచురింపబడుతుందని లోగడ ప్రకటించాము. అనివార్యమైన కారణాలవల్ల ఈ కథ ప్రస్తుతానికి ఆపివేయవలసి వచ్చిందని పాఠకులకు మనవి.

—సంపాదకుడు.

★ మద్రాస్ డైరీ ★

మద్రాసు నగరం ఆంధ్రుల దంటే మహా నామ్యప్రదంగా భావించే వారిలో నేనొకణ్ణి. ఇందుకుగల అనేక కారణాలలో ఒక టేమిటంటే, ఈ వూళ్లో తెలుసువాళ్లు ఏదైనా సభలాంటి దేర్పాటు చేస్తే, కూర్చోడానికుద్దేశింపబడినస్థలంలో సగానికి పైగా ఖాళీగా ఉండిపోతుంది. అనేక సభలు, ముఖ్యంగా సాహితీ సభలు ప్రేక్షకులు తగినంతమంది రాని కారణం చేత ప్రారంభం కాకుండానే ముగిసిపోవటం కద్దు. అధ్యక్షుడు, కార్యదర్శి, ఉపన్యాసకులు తప్ప మరెవరూ హాజరుకాని సభలుకూడా నే నెరుగుదును. ఈ వూళ్ళో తమిళుల ఆధ్వర్యంకింద నాటకమో, పాట కచ్చేరీయో, సాహితీ సమావేశమో ఏదో ఒక కార్యక్రమం జరగని రోజంటూ వుండదు. ప్రతి కార్యక్రమానికి తగినంత మంది ప్రేక్షకులు రావటం, కార్యక్రమం జయప్రదంగా జరగటం పరిపాటి. ఈ వూళ్ళో ఆంధ్రుల కార్యక్రమాలు సరిగా జరక్కపోవటానికి ఆంధ్రుల్లో వున్న ప్రత్యేక వ్యక్తిత్వమే (*Individualism*) కారణమంటే నేను నమ్మను.

* * * *

ఈ నెల 6 వ తేదీన ఇలాంటిదే జరిగింది. పాలకొల్లు ఆదర్శ నాట్యమండలి వారు మైలాపూరు రసికరంజనీ సభ మందిరంలో "పల్లెపడుచు" అనే నాటకం ప్రదర్శించారు. అంతదూరంనుండి ఉత్సాహంతో వచ్చి నాటకం ప్రదర్శించినందుకు వారికి ఖర్చుపెటిన దానిలో సగోవంతు కూడా టిక్కెట్లద్వారా వసూలు కాలేదు. ఆంధ్రులు నాదని చెప్పుకునే మద్రాసులో ఇలాంటి సంఘటన జరగటం ఎంత శోచనీయం?

"పల్లెపడుచు" నాటకం చూశాక మన నాటక కళ కాలానుగుణంగా అభివృద్ధి అవుతున్న దనిపించింది. జమీందారీ వర్గానికి, రైతువర్గానికి మధ్య సంఘర్షణ ఇందులో కథావస్తువు. నాటక రచయిత శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి. నాటకంలో వీరు ప్రధాన రైతు పాత్ర ధరించారు. సంభాషణలు సజీవంగా, హృదయాలను కదిలించేవిగా ఉన్నాయి. రైతువద్ద పనిచేసే పాలేరు గంగులు పాత్ర ధరించిన శ్రీ పామర్తి సుబ్బారావు నటన అమోఘంగా ఉన్నది. "అకలంటే కడుపులో కాలేవాళ్లకే తెలుస్తుంది," అని ఆయన అన్న మాటలు ప్రేక్షకుల కళ్లు చెమ్మగిల్లేట్టు చేశాయంటే అతిశయోక్తి కాదు. నాటకంలో కరుణ, హాస్య రసాలు రెండూ మోతాదు మించకుండా సమంగా ఉన్నందున నాటకం చాలా రక్తి కట్టింది.

నాటకాలలో వాస్తవికతను రూపొందించటానికి కావలసిన రంగస్థలపు హంగులు మనకు లేకపోవటం పెద్ద కొరత. ఆ హంగులు ఉన్నాయి కనుకనే సినిమాకళ నాటకకళను అవలీలగా ఓడించకలిగింది. నటనా కౌశలం మనకు కావలసినంతవున్నది. కాని అదొక్కటే ఉన్నంత మాత్రాన చాలదు. నటన వాస్తవికమైనదిగా ప్రేక్షకులకు కనిపించాలంటే అధునాతనమైన రంగస్థలం, భోగెశు పరికరాలు అవసరం. ఈ అవసరం తీరటానికి ప్రభుత్వమో, నాటక కళపై అభిమానమున్న పెట్టుబడిదారులో ముందుకు రావాలి తప్ప వేరే మార్గం లేదు.

* * *

ఇండియాలో జరుగుతున్న ప్రపంచ చలనచిత్రోత్సవాలు మద్రాసుకుబట్వాడా అయ్యాయి. ఇలాంటి ఉత్సవాలు ఏర్పాటు చెయ్యటంలో భారత ప్రభుత్వానికి అట్టే అనుభవం లేదని ఋజువవుతోంది. ప్రోగ్రాములు రోజురోజుకూ మారటం, సరియైన థియేటర్లను ఎన్నుకోనకపోవటం మొదలైన వాటివల్ల ముందునుంచీ ఆయత్తం అవుతున్న ప్రేక్షకులకు కొంత ఇబ్బంది కలిగింది. అయినప్పటికి బ్రిటిష్ అమెరికన్ చిత్రాలు తప్ప ఇతర దేశాల చిత్రాలు చూడటానికి అవకాశం లేని మనకు ఈ అవకాశం కలిగించినందుకు భారతప్రభుత్వాన్ని అభినందించ వలసివుంది.

రష్యన్ వర్ణ చిత్రాలకీ, అమెరికన్ వర్ణ చిత్రాలకీ గల తేడా "ఫాల్ ఆఫ్ బెర్లిన్" అనే రష్యన్ చిత్రం చూస్తే బాగా అవగత మవుతుంది. అమెరికన్ చిత్రాలలో ముదురు రంగులు వాడబడతాయి. రష్యన్ చిత్రాలలో రంగులు సహజత్వానికి సాధ్యమైనంత దగ్గరగా వుంటాయి. "ఫాల్ ఆఫ్ బెర్లిన్" గొప్ప చిత్రం. రెండో ప్రపంచ యుద్ధంలో రష్యన్లు ప్రదర్శించిన ధైర్య సాహసాలు, త్యాగం ఇతివృత్తంగా తీసుకుని నిర్మించారు. "కళలకు సాంఘిక ప్రయోజనం తప్ప మరే ప్రయోజనమూ లేదు. ఆ ప్రయోజనాన్ని కళాయుతంగా సాధించటం, సాధించలేకపోవటం కళా నిర్మాత ప్రతిభపై ఆధారపడి వుంటుంది," అనే రష్యన్ సిద్ధాంతానికి అనుగుణంగానే వుంది ఈ చిత్రం.

* * *

మధ్యతరగతి వాళ్లే మన స్వతంత్ర్యానికి, జీవన పరిస్థితులకు మధ్య చిత్రమైన వైరుధ్యం కనిపిస్తుంది. మొన్న ఒక మధ్యతరగతి విద్యావంతుడు, ఉద్యోగస్తుడు, తమిళీకరింపబడిన ఆంధ్రుడు అయిన ఒక పెద్దమనిషి నాకు తటస్థపడ్డాడు. ఆంధ్రదేశానికి నన్ను ప్రతినిధిగా ఎందుకు భావించాడో ఏమో గాని, ఆంధ్రులు మొన్నటి ఎన్నికల్లో కమ్యూనిస్టులను గెలిపించినందుకు నన్ను నానా చివాట్లు పెట్టాడు. "కాంగ్రెసంటే ఎంత ఇష్టం లేకపోతేమటుకు మాన్తా చూస్తూ దురాగ్రహులు, దౌర్జన్యపరులు అయిన కమ్యూనిస్టులకు వోటు చేస్తారా ఎక్కడైనా" అని మందలించాడు. "వారికే అనుభవిస్తారులే," అన్నాడు. వెళ్లిపోతూ "అధికారం సామాన్య ప్రజల దంటారుగదా, సామాన్య ప్రజల కేం తెలుసు? వాళ్ళకి ప్రభుత్వం అప్పగిస్తే వాళ్లకేం చాతవునని పాలించ గలరు. శరీరాన్ని శాసించవలసింద అడుగున వున్న కాళ్లా, పైన వున్న మెదడా!" అని నా సమాధానంకోసం ఆగకుండానే వెళ్ళిపోయాడు.

—సవ్యసాచి

1వ కథోత్తరిక

ఏదో బట్టలు విప్పుతూ, కాఫీ గ్లాసు బల్ల మీద పెడుతూ, రాముడు ముసి ముసిగా నవ్వుకున్నాడు. నేను జీతా లివ్వగానే తీర్చవలసిన అప్పులన్నీ లెక్క వేసుకుంటున్నాను; బదులుగా నవ్వలేదు. రాముడు అయిదు నిముషాలు ఊపిరి బిగబట్టుకొని నిలబడ్డాడు; నేను తలకాయ వంచుకుని వ్రాసుకుంటూనే ఉన్నాను.

"కాఫీ చల్లారిపోతుంది; తాగండి" అన్నాడు, కాసేపటికి. నేను వ్రాసుకుంటూనే ఉన్నాను.

"ఏమిటా వ్రాయడం అంత [illegible]" అన్నాడు, హెచ్చరిస్తూ. అప్పటికి ఎనిమిదిగంటలైంది. ఎనిమిదన్నరకల్లా నా క్లాసు తీసుకోవాలనే తొందర్లో ఉన్నాను. గొంతుకనే కాఫీ తాగేసి, మళ్ళీ కూడటం మొదలు పెట్టాను. నాదగ్గర రూపాయి మూడణాలన్నా ఉండాలంటుంది, ఆర్థిక పుస్తకం - ముగిస్తే అయిదణాలన్న లెక్క. ఎవరైనా తీశారనుకోవానికైనా, ఎవరికి కావాలి? అయినా రాముణ్ణడిగాను.

"ఆఁ—తీశాను" అని, కాఫీకప్పు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది, మూతి ముడుచుకుని. ఎంత ఆలోచించినా తెగ లేదు; విసుగెత్తి కాలేజీకి బైలుదేరాను.

పెట్టెలోంచి ఉత్తరీయం తీసిస్తూ, "ఇవ్వాళ మీకు జీతాలిస్తారుగా?" అన్నది రాముడు, నవ్వులు కులుకుతూ. ఆ రోజు నేను 'ఇస్తారు' అన్నాను. ఈ నెలంతా అప్పులు చెయ్యవలసిందే. నేను మాట్లాడకుండా ఉత్తరీయం తీసుకుని బయలుదేరాను. వీధికి వెళ్తుంటే, "ఇవ్వాళ కాస్త తొందరగా—" అన్నది; ఏదో మాట్లాడిందనుకున్నాను, ఆ రోజుకి.

జీతం రాగానే రాముడి దగ్గిరికి వెళ్ళినా, అది కావాలనో, ఇది కావాలనో, వచ్చిన జీతమంతా అయిపోయిందాకా ఊరుకోదు. అందుకని లేని అప్పుల్ని సృష్టించి, మూడువంతులు బ్యాంకులో వేసి, మిగిలిందే పట్టుకొస్తా నింటికి.

"ఒక్క మంచిచీరైనా లేకపోతే, ఎల్లా పోతారండీ, ఇంకోళ్ళింటికి?" అంటుంది, మూతి ముడుచుకుని.

దాని కన్ని చీరెలున్నా, ఒక్కటీ మంచిదుండదు.

"నేనెల్లా పోతున్నాను, కాలేజీకి?" అంటాను, సముదాయించటానికి.

"మీకేం—మీరు మగవాళ్ళు; ఎల్లాపోతే అడిగే దెవరు?" అంటుంది; మగవాళ్ళైం తర్వాత సుఖం లేకుండా తిరిగినా ఫరవాలేదని దాని నమ్మకం.

"మరేం చేస్తాం—ఎప్పటికప్పుడు అప్పులకే సరిపోతుం దెను?" అంటాను, కా[illegible] దీనంగా; దాని మనస్సైనా మార్చుతుం దేమోనని నా ఆశ!

"ఏం అప్పులండీ, పిచ్చి అప్పులు—ఎక్కడి డబ్బూ మీ సిగరెట్లకే చాలకపోయెను" అంటుంది; తప్పంతా నాదేనని దానికి గట్టి నమ్మకం.

నేనేం మాట్లాడేది?

"ఆ సిగరెట్లు మానేస్తే, నాకో మంచి చీర రాదూ?" అంటుంది ఉపాయం చెబుతూ. నేను ఏం మానేసినా దానికి కావలసిన మంచిచీర రాదు; తృప్తి ఉంటేగా?

కాలేజీనుంచి తిరిగి వచ్చేసరికి [illegible] కూర్చున్నాను. [illegible] కుంటున్నది.

భోజనం చేస్తున్నంతసేపూ తలుపు కొసను నిలబడ్డది; ముసిముసిగా నవ్వుతుంటున్నది. నేను గమనించనట్లూరుకున్నాను. నేనూరుకున్నకొద్దీ నవ్వు అణగించాలని ఇంకా ముసిముసిగా నవ్వుతూనే ఉంది. [illegible]

నేను ఏదీ పలకకుండా భోజనం కానిచ్చి సావిట్లోకి వచ్చేశాను. నా వెనకే వచ్చి [illegible] తెచ్చిస్తుంది నా సిగరెట్టు [illegible] ఏమైందో నా కర్థంగాలేదు. [illegible] మాట్లాడకుండా సిగరెట్టు వెలిగించుకుని వరండాలో కూర్చున్నాను. పాపం, ఆశాభంగం పొందినట్లు మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

భోజనం కాగానే, ఇంట్లో పని ముగించుకుని, నాకు దగ్గిరగా కుర్చీలో కూర్చున్నది, గడపమీద చేత్తో రాస్తూ. నేను నా బడ్జెట్ వేసుకుంటున్నాను.

"ఏం ఉన్నారేం?" అన్నది, కానీ [illegible]; ఇది ఉపోద్ఘాతం.

"ఏం?" అన్నాను, [illegible] కుని.

"ఇవ్వాళ జీతాలిస్తారుగా?" అన్నది, మళ్ళీ. నాకు తెలుసు, ఇక మొదలు పెడుతుంది. రాముడు కాసేపు మాట్లాడ్లేదు. నాకు కాస్త కంగారు వేసింది.

"[illegible]?" అన్నది, [illegible]

"నడింపల్లి"

"పొద్దున పాలమనిషొచ్చింది." అన్నది, ఇంకాసేపటికి.

"ఏంతైంది" అన్నాను, రాముడి వేపు చూస్తూ; నన్ను చూసి కళ్లు దించేసుకున్నది.

"ఏమో—లెక్క కట్టండి" అన్నది, క్రీగంటచూసి.

నాకిప్పుడదేపని? నేను మెదలకుండా ఊరుకున్నాను, సిగిరెట్టంటించుకుని.

రాముడు బద్ధకంగా ఆవలించి, గడప మీద తలకాయపెట్టుకుని పడుకున్నది. నేను కుర్చీలో పడుకుని సిగిరెట్టు కాలుస్తున్నాను. నాకు రాముడిమీద జాలి వేసింది; లోపలికి వెళ్లి బ్యాంకు పుస్తకం చూసుకున్నాను. తిరిగి ఇవతలికివస్తూ, రాముడివేపు చూశాను; నేలవేపు చూస్తూ, అరచేత్తో రాస్తున్నది.

"చాపవేసుకుని పడుకోరాదూ?" అన్నాను. ఎక్కడ పడితే అక్కడ దొర్లితే నాకు ఒళ్లుమంట! రాముడు నా మాట వినలేదు; అట్లాగే పడుకొని ముసిముసిగా నవ్వుకుంటున్నది.

"మళ్లీ కాలేజీ ఎన్నింటికి?" అన్నది, కాసేపుండి.

తొందరగా వెళ్ళి ఆ నాలుగురాళ్లూ తెస్తానో, లేదో అని దాని ఆత్రం.

వెళ్లి డబ్బులు తీసుకోటంతప్ప, కాలేజీలో ఆ రోజుకు నాకిక పనిలేదు.

రాముడి ప్రశ్నకి నేను విననట్టూరుకున్నాను.

"కాఫీ పెట్టేదా?" అన్నది, మళ్ళీ.

నేను సమాధానంగా మూలిగాను, కుర్చీలో కూర్చుని చదివేసిన న్యూస్ పేపరు

(48-వ పేజీ చూడండి)

ఒకటో తాఖురీని జీతం రాగానే భార్య చీర కొనమంటుందనుకున్నాడు. కాని ఆమె మాట వినగానే బజారుకు పరుగుతీశాడు.



మాన్‌సూన్‌స్పీడ్

"పుంతలో ముసలమ్మ" అంటే సర్వసాధారణంగా అందరికీ అర్థమైపోతుంది మైలురాయి అని "మాన్‌సూన్‌స్పీడ్" అంటే ఎంతమందికి అర్థమైందో? "ఋతుపవనవేగం" అని దాని అర్థం. దానినే "పాడు పుకథల" భాషలో గుర్తించాలీఅంటే ఏమనాలో నాకు తెలియకుండావుంది ఈ వ్యాసం ముగించేలోగా ఏదైనా కొత్త సంగతి తట్టగలదేమో చూతాం!

"ఆవారం అంతా నాలో స్పీడ్ కాంగ్రెసుస్పీడ్" అని వెనక ఒక వ్యాసం ముగించాను. అప్పుడు చూచిన మహానగరం కలకత్తా! ఆలాంటివారమే నేను గడపిన మరొక వారమూ, నేను చూచిన మరొక మహానగరమూ కలవు ఆవారము 19-10-1945 మొదలు 25-10-1945 వఱకు గల ఆరునొక్క పూరారోజుల వారమూను ఆనగరము మదరాసు - దక్షిణ - మహారాష్ట్ర) ఇనుపదారికి. ఆదిమూలమైన మదరాసునగరము. నగరవర్ణనంకంటె నగర ప్రవేశవర్ణనం ఇప్పట్లో ఇతివృత్తమునకు సత్తువ ఇచ్చేని ఆంధ్రుడైనవాడు మదరాసునగరం అంటే చెవి కోసుకుంటాడు. నేను ప్రవేశించిన ఆరాత్రి మదరాసు పట్నంమీద ఆకాశాన్ని అతి నిర్మలంగా చూడగలుగుతూ పట్నంయొక్క పొడి పాశి తారోడ్డంట టకటకా జట్కామీద పోగలిగానూ అన్న సంగతి తలుచుకుంటే ఇప్పటికికూడా వింత వినోదం ముప్పిరిగొనిపోతూవుంటాయి. ఆ రాత్రి 'పెయిరీ' ప్రకారంచూస్తే కనవచ్చేది 18-10-1945 రాత్రి 10 గంటలు. ఆకాశాన్ని చూస్తే చుక్కలూ చూడచక్కనైన శరత్కాల ప్రప్రథమ ద్వాదశీ తరుణ చంద్రబింబమూను!

కాని 17-10-1945 సాయంకాలం రాజమహేంద్రవరంలో ఇంటివద్ద నేను మంచి చేసుకు, మెయిలు అందుకుందామనే దృష్టిని రిక్షాలో కూర్చున్నప్పటి సంగతి! చలిగాలి ప్రారంభించింది. అప్పటికప్పుడే చినుకులు పడుతున్నాయి ఆకాశంఅంతా మహాట్టహాసంగా మేఘావృతమై వలాహకాదులు విచ్చలవిడి విహరిస్తూ వున్నంత విహ్వలత్వం వెల్లడిగావినూవుంది. "వెళ్ళనా మానా?" అని ఒక లిప్త ఊగిసలాడి, రిక్షావాణ్ణి "నిలు నిలు లాగకు" అని ఆపి, మళ్ళీ "లాగు" అని ముదలయిచ్చి బయలుదేఱాను. "ఉత్తరాలు తడియకుండా తీసుకుపోయే మెయిలుబండి మీద మనం మాత్రం తడియకుండా పోలేమా?" అని పెద్ద నిబ్బరము తోచింది.—ఇంతకూ మదరాసుకు రాజమండ్రీకి దూరం 361 మైలు మాత్రమే! "ఒక్క రాత్రి కన్నుమూసుకుంటే తెల్లారేసరికి మదరాసు!" అనిపించింది. మఱెన్ని "రాజమండ్రీకి—మదరాసుకు మధ్యను తెల్లాఱని రాత్రి అంటూ వుంటుందా?" అని అనిపించింది.

చెమ్మగానున్న రోడ్డంట రిక్షా లాగబడుతూన్నకొద్దీ, తరపచిత్తడి అయినకొద్దీ, నా మనస్సులో అదేమిటో "పెసిమిసమ్"కు బదులు "ఆప్టిమిసమ్" రేకెత్తసాగింది. "గర్జలా ఉఱుముతోంది బాబూ" అని రిక్షావాడంటే "ఊఱుమనివ్వరా!" అంటూ ఊఱకవేసినట్టు సాగించాను రిక్షాను రాజమహేంద్రవరం పెద్ద స్టేషనుదాకాను పకాలానికి, అనగా మెయిలు వేళకు అన్నమాట.

దారిలో ఏ విఘ్నమైన విలయ వైపరీత్యము గాని, అకాలమృత్యువు గాని రాలేదు! కాని స్టేషన్ భవనంలో దిగి ఇటూ అటూ తిలకించేలో కూలీవాడు "బాబూ! మెయిలుకా?" అన్నాడు. "ఏం?" అన్నాను. "ఇంకా ప్యాసెంజరే రాంది, మెయిలూసు ఏం చెప్పను బాబూ! కూకుంటే వెయిటింగు రూములో కూకోండి!" అన్నాడు. గడియారం వంక చూచాను. మెయిలు రావలసిన 'టయి'మయింది... ఆకాశం పిడుగడ్డట్టు మెఱిసింది. కూలివాని వంక నేను గ్రుడ్లుఱిమాను. వాడు తిన్నగా సామాను వెయిటింగ్ రూములో జాగ్రత్త పెట్టి "తమరు ఇక్కడ దయసేయండి! నే కనుక్కొస్తాను. తమ రొక్కరే నేటి ప్రయాణీకులు ఈ స్టేషనునుండి వెళ్లేవారు. బాబులకు వానా వఱదా ఆటంకాలు లేవులాగుంది" అన్నాడు. కూలీవాండ్లలో కొందఱు కొందఱు అతి వాగుడుగాండ్లుంటారు. ఆలాంటివాళ్ళల్లో వీడొకడు అని అనుకొని వాణ్ణి సామాను చూస్తూవుండమని నేనే తిన్నగా స్టేషనుమాస్టరుగారి దగ్గఱకు వెళ్లిపోయాను

స్టేషన్‌మాస్టరు, దీపాల నాగమ్మను "వెలిగించరా హరికేన్ లాంతరు. కరెంటు పోయినట్టుంది" అని అంటున్నాడు. టెలిఫోను కొమ్ము ఎత్తి "హల్లో" అని ద్వారపూడి పిలుస్తున్నాడు. అటునుంచి జవాబు లేదు. "మెయిలు ముందా! ప్యాసెంజరు ముందా?" అని అన్నాను, నిరాశాపూరితుడై అతగాడుంటే. "ఆ సంగతే కనుక్కుందామని పిలిస్తే పలకడం లేదు ఓక స్టేషనూ. వాల్తేరునుంచి కడియందాకా ఒకే రొద ఒకే గాలీ విసురుతూన్నట్టుంది" అన్నాడు. అంటే "తూర్పు గాలా?" అన్నాను. "ఏ దిక్కూ కనబడ్డం లేదు నాకిప్పుడు" అన్నాడు అతగాడు. మఱి వొంగి వొంగి, ఇద్దఱం కలిసి సన్న చిరుకుగుండా లైనమ్మటి చూచేం! లైను బాగానే వుంది బొమ్మూరు మెట్టదాకా! "బహుశా ప్యాసెంజరే ముందొచ్చేటట్టుంది" అని అంటూ తన గదిలో గణ గణ శబ్దమైతే స్టేషనుమాస్టరు పరుగెత్తేడు. మరినాలో విత

శ్రీ కవికొండల వెంకటరావు

క్కుంటు, "ప్యాసెంజరు రైలైనా పోతేనో!" అని "ఎక్స్‌ప్రెస్ బండిలో ఎక్కి కూర్చుంటేనే మేలు. ఎంత వాన కురిసినా ఎంత గాలి వేసినా, ఇంటికంటె సురక్షితం అన్నట్లు సేఫ్‌గా రైలే మేలనుకున్నాను. కిటికీ తెరిస్తే ఎల్లుండికైనా మద్రాసు చేరకపోతామా? అని తలపోశాను. ప్యాసెంజరు అయినప్పటికీ, ఎంత గాలి వేసినా ఎగరవేయదు అని నా ధీమా!

ఎప్పుడు రెక్క వాలిందో, ఎప్పుడు ప్యాసెంజరు వచ్చిందో, ఎప్పుడు టిక్కెట్టు నేను కొన్నానో, అంతా ఒక్క అరగంటలో జరిగింది. ప్యాసెంజరు ఎక్కగలిగాను, అది ఆగినవెంటనే అట్టే తడియకుండా, పెన్నపెట్టె తీసుకుంటూ మెల్లగా మెత్తగా ఒక కంపార్టుమెంటు కలిపిస్తే "ఇదిగో! పరుపుల పెట్టె" అని కూలీని కేకేస్తూ.—కూలీని పొమ్మన్నాను డబ్బు లిచ్చేసి. చీకట్లో ఒక్కణ్ణీ కూర్చున్నాను. తూర్పువైపు ఆ అరకు తలుపులు వేసేసి ఉన్నాయి. జల్లు, జడి, చలి, అప్పటిమట్టుకు అనిపించలేదు. కాని "మెయిలు దిన్ని తొక్కేయ్యదా?" అనే సమస్య కాళ్ళా వేళ్ళా సంకలవేసి, మనస్సును కొంత సలాడించింది కొంతసేపు.—అంతలో ఎంజిను కూసింది. గంట మోగింది. పచ్చ లాంతరు గార్డు చూపాడు. కూర్చున్న బండీ కుదుపిచ్చింది. "అనాగ్యంగా రాదా అసలు! దాన్నెక్కడమే మంచిపని చేశాను" అని అనిపించింది. కునుకుకోసం బిచాణా విప్పాను, మరి చేసే పని లేక! కిటికీలన్నీ తలుపులన్నీ మూసేశాను.

అయితే కడసారి పీడొక్కలు అదే కొంచమైనా నేమో అని అనుకుంటూ, రాజమహేంద్రవరం కేసి ఒకసారి మాడామని పడమటింపు కిటికీ ఓక్క ఓక్క ఎత్తేను. రయమని పడమటిగాలి తిరిగి అదే జల్లు! అదే జల్లు! రైలు గోదావరి స్టేషనులో నిలిచిపోయింది. నేను తలుపులన్నీ తిరగ వేసుక బండిలో కూర్చున్నాను "వంతెన మీద బండి నడువదేమో? నడిస్తే ఆ గాలికి పడిపోతుందేమో? కింద గోదావరి ఎంత లోతుందో?" ఇవీ నాలో నేను వేసికొన్న ప్రశ్నలు అపొద్దు! వేసికొన్ని పక్క మీద పొడిజాగా చూసుకుని, ఒక్కణ్ణీ క్రిక్కిఱిసి కూర్చున్నట్టు ముణిచి పెట్టుకు, ముక్కున కొనయూపిరి పెట్టుకున్నవాడిలా కిక్కురు మనకుండా కూర్చున్నాను. తపస్సు దేన్నిగురించి చేదామన్నా నాకు ఏమీ కనిపించలేదు. దేవుడే లేడనిపించింది. వంతెన ఎక్కేముందు తగిలే 'ఆర్చి' మీద వుంది ఇంజన్. ఆర్చి క్రింద రోడ్డు 'జి.టి. ఆర్' అనగా గ్రాండుట్రంకురోడ్డు. తెనుగులో చెప్పాలిసి వస్తే రామేశ్వరంనుండి కలకత్తా మీదుగా కాశీ తీసుకుపోయే మహారస్తా. గ్రాండ్‌ట్రంకు ఎక్స్‌ప్రెస్ పొయ్యే రైలుపట్టాల దారి దగ్గర గాని దక్షిణాదికీ ఉత్తరాదికీ గ్రాండ్‌ట్రంకురోడ్డు ఎలాచూచినా చుట్టే. అది హిందూదేశం మీద మధ్యగా పోదు. కోస్తా అమ్మకేపోయి, కలకత్తాదగ్గర పడమటకు మళ్లు

తుంది. బహుశా ఆపోవడం పోవడం అది "అటకం" దాకా పోతుందనుకుంటాను. అగ్నేయ తూర్పువైపు మళ్ళితే బహుశా "చిటకం" దాకా పోవచ్చు. వంగదేశంలో చిటకం, పాంచాలంలో "అటకం", మరి కటకం అసలు విస్తామీదే వుంది బరంపురానికి-కలకత్తాకు మధ్య మహానదిమీద. ఇదంతా నీ మక్కెదరా అంటే "ఆసావా దిత్యాబ్రహ్మ" అని చూపిన తీరే అని అనుకోకండి పాఠకులు. ఒంటరిగా కూర్చున్న నాయందు ఆకాశాను ... యాసిన్న పద్యాలును భువనాలయొక్క రహదారీ మార్గాలు కనిపించినప్పుడు భారత వర్షంలోని ఈ మహారస్తాను ఎలా విస్మరింపగలను?— ఉన్న దున్నట్టు మీ ముందుంచాను. కాని రైలుమాత్రం ఒక అంగుళం కదలలేదు. గంట కొట్టినా ఈల వేసినా, పచ్చ రెండా చూపినా, ఎదర రెక్క వాల్చినా ఎన్ని చేసినా తుదకు ఇంజన్ ఎంత గింజుకున్నా ఎదరగాలి తీవ్రతకు అలా నిలుచుండి పోయింది. తలుపు తీసినా తలుపు వేసినా ఒక్కలాగుంది చీకటి!

అంతకంటె ఎక్కడి మేఘం అక్కడ అక్కడికి ఓక్కడై తలితలి తోశిపడ్డట్టు ఒడిగా వర్షింప దొడగింది. నా గుండెల్లో రాయిపడింది. రాయిపడింది అంటే ఉత్తరాయి కాదు. అంకెలతో వున్న రాయి. ఆ అంక ఏమనుకున్నారు! 361 మైలురాయిపై అంకె ఒకటి. అది గ్రాండ్‌ట్రంకు రోడ్డుపై అక్కడ పాతిన మైలురాయి. మద్రాసు అక్కడకు అన్ని మైళ్లుందని చూపిస్తుంది ఆరాయివచ్చి నా గుండెల్లో అమాంతం పడినట్టయింది. ఎలా లేచివచ్చి పడింది అని అడక్కండి పాఠకులు. గంటకు 100, 150 మైళ్ళ వేగాన్ని విసరి ముంచుకు ఎదలేచి వచ్చి ఎక్కడపడును?

మర్నాడు రాత్రి పదిగంటలకు మదరాసులో నేను దిగిన అనంతరం కూడా నా మనస్సులో నిలిచి "ఆ రాయి ఇంకా అక్కడ రోడ్డు మీద వుంటూ మైళ్లు సూచిస్తుందా? లేక అనంతాకాశంలో లీనమైపోతూ మదరాసు రాజమహేంద్రవరం మధ్యనున్న దూరాన్ని హరించివేసి వుంటుందా?" అనే విచింతనమే! నమ్మండి! ఋతుపవనానికి అంత వేగం వుంది అదే నేను ఈ వ్యాసంకు మకుటంగా పేరు పెట్టిన "మాన్‌సూన్ స్పీడ్" అన్నా! 361 మదరాసు అని సూచించే గ్రాండ్ ట్రంక్ రోడ్డు మైలురాయి గాలికెగిరి నా గుండెల్లో పడడమే "మాన్‌సూన్ స్పీడ్!"

పైని వ్రాసిన నా అనుభవం అంతా ప్రత్యక్ష కృత్యం! సత్యం! నిత్యం! కాని

కాలస్నానం తిరుగుతూనే వుంది. దాని గుండెల్లో ఏ రాయీ పడ్డట్టు లేదు. తెల్లారి 7 గంటలకు నేను తలుపులు తెఱచి చూస్తేంలో చిన గంజాం స్టేషన్ కనిపించింది. బతుకు జీవుడా! ఈ గాకా కొట్టు కొచ్చామూ అన్నాను గట్టిగా ఒక్కసారి.

ఆ దాకా నన్నెఱుగని ప్రక్క అరలోని తోడి ప్రయాణీకుడు తటాల్న లేచి "ఎం దాకా వచ్చాం?" అన్నాడు. "చిన్న గంజాం దాకాను" అన్నాను. అతడి మణికట్టు గడియారంలో ఉదయం ఏడైనా ఆకాశం ఇంకా బూడిద రంగుగానే వుండి సద్యః సూర్యోదయం అవుతూ వున్నట్టు అనిపించింది. గాలి చినుకు ఇంకా గడబిడగానే వుంది. జీలుగు తోకొకటి స్టేషన్ అవల ఆరుబయట ఊగిసలాడుతూ వుంది శివ మెత్తినదానిలా! కనిపించే ఒక కట్టడము యొక్క గోడ వొకటి నాని నాని అప్పుడే కూలిపోయింది. అయినప్పటికీ ఎంజిన కదిలింది ఏలాగైనా మదరాసు చేరి తీరాలని! మెయిలెక్కడో మా ప్యాసెంజర్ను తప్పుకు వెళ్లి పోయిందన్నారు. మెయిలు ముందు వెళ్లడం మంచిదే పైలట్ బండిలా పని చేస్తుంది అన్నాను దాని తరువాత ఇది వెళ్లడమే సేఫ్ అన్నాను. తెల్లారాక కబుర్లైన్నా చెప్పొచ్చు మాడండి బిట్రగుంట ఆ ప్రాంతానికి వెళ్లేసరికి మేఘాలు వట్టిపోయి పరుగెడుతూన్నట్టు కాపడింది. పరుగెడుతూన్నవి మేఘాలా సూర్యుడా? అనే సందేహం కూడా వేసింది—మఱి మధ్యాహ్నానికి కావోలు గూడూరు చేరాం—అక్కడితో ఆ తుపానుభీభత్సం అంతమైనట్టుంది. బండికి కొంచెం వేగం పట్టింది. క్రమక్రమంగా బేసిన్ బ్రిడ్జి చేరే సరికి అసలు వానే కురిసినట్టు లేదు సంధ్యారాగం గడచి చక్కని చుక్కలు పొడగట్టసాగాయి; మదరాసు చేరేలో శరత్కాల ప్రప్రథమ ద్వాదశి తరుణచంద్రుడూ నేనూను! 18-10-1945 రాత్రి పది గంటలైంది. ఆ సంగతి తొలుత నే పాఠకుల చెవిలో ఊదేశానుగా.

మఱింకా అనుకున్నాను. "అమ్మయ్యా! తెనుగుజిల్లాల నే శనిగ్రహం వదలిపోయింది. మదరాసులో పడ్డానురా!" అని, అనుకుంటూ సువిశాల శుభ్రమైన ఆకాశాన్ని మదరాసుమీద చూచేను. మౌంట్ రోడ్డు మాంచి మదమెక్కిన ఏనుగులా కనిపించింది. దానిమీద టకటకా మా జట్కా గుర్రం పోతూవుంటే ఎలావుంది? "విస్కీ వైట్ హార్స్"లాగుంది.

కాని మర్నాడు తెలుసుకుంటే మేము వచ్చిన రైలే నాటి ఆఖరురైలనీ, మఱి ఎక్కడిరైళ్లు అక్కడే బంద్ అయిపోయాయని పుకారు. ఇంకా లోతుగా పూడిస్తే తేలింది—"ఎమ్. ఎస్. ఎమ్. ఆర్ వాల్తేరు నుంచి గూడూరుదాకా అన్నీ గండ్లేనని—మనుష్యులు తిరుగపోయేందుకు వీల్లేదని—" ఇంకా వింటే వెల్లడికొచ్చిన సంగతి—"తుపాను చెలరేగిన పొడుగుతా చెట్లు అన్నీ కూలిపోయాయి అని—పక్షులెన్నో చచ్చిపోయాయి అని; పశువులన్నీ విహతమైనాయి అని,—పంటలన్నీ వినాశనమైనాయి అని—

ఇఖ పుంతలో ముసలమ్మలను గురించిన వృత్తాంతం అడిగేదేమిటి అని అనుకున్నాను. రోడ్లకురోడ్లు గండిపడిపోయాక రోడ్డు పొడుగుమాపే మైలు రాళ్లుంటాయా అని అనిపించింది అయితే ఎంతసేపూ, మనస్సులో మదరాసుకు—రాజమండ్రికి మధ్యను వున్న మైలురాళ్ళే జ్ఞాపకం వచ్చేవి. అవి ఎన్నీ అని అనుకొన్నప్పుడల్లా నెల ముప్పై రోజులు లెక్కస్తే 12 నెలల ఏడాదికీ సరిపోయే 360 రాళ్లుగా తోచి పైనొకటి మిగుల్తూ వచ్చేది ఆ ఒక్కరాయి 17-10-1945 రేయి నా గుండెల్లో పడ్డ 361 నెంబరును మైలురాయిగా వచ్చేది.

అది ముసిలమ్మల్లో ముసిలమ్మల్లా తోచేది. 'మాక్ నూక్ స్పీడ్"కు ఎగిరివచ్చి నా గుండెల్లో నిలిచివుండే ఈ మదరాసు దాకా నన్ను వెంటాడించిఅని అనిపించేది. తెనుగుజిల్లాల-పు-పురాతనపు రాయిగా-పునాది రాయిగా తట్టేది ఆ ముసిలమ్మ కాలంచేసినా అనగా దాన్ని మనం ఎఱచిపోయి నట్టాయినా రాజమండ్రీకి మదరాసుకు మధ్య దూరమే లేదు. కాలమే లేదు. ఆ రెండూ లేనప్పుడు మదరాసే రాజమండ్రీ రాజమండ్రీ నే మదరాసు.

ఈ దృష్ట్యా ఒక వారం వారం మదరాసె రాజమండ్రి అన్నట్టు తిరిగేశాను. 19-10-45 తేదీని రేడియోస్టేషనులో నాటికలు ప్రసారం చేశాను. 20-10-45 న అడ్యార్ ఆవలకంటూలాటిస్ బ్రిడ్జిరోడ్డే వెళ్లా 21-10-45 న మైలపూర్‌లో కొత్త రకం బస్సు ఎక్కాను. 22-10-45 జార్జిటౌన్ హడావిడిని తిరిగాను. 23-10-45 న రాయపేటలో నిలిచాను 24-10-45 న విజ్ఞాన సమితి వీక్షించాను. 25-10-45 న పరసువాకం చేరాను. అక్కడనుంచి ఆ రాత్రికి సెంట్రల్. మర్నాడుదయం రాజమండ్రి. మొత్తం రు 35/లు ఖర్చించాను. ఆ రు 35/లులోను రు 24/లు రాను పోను ఇంటర్ టిక్కెట్టు ఛార్జికే.

రాజమండ్రీలో టిక్కెట్టు ఇస్తూ అంకె చూస్తినిగదా! దూరం 361 మైళ్లు. పుంతలో ముసిలమ్మమీద అంకె 361. తుపాను చెలరేగినా చెరనిదీ అంకె వొక్కటే అని అనుకొన్నాను. కాని మదరాసులో ఆవారం నన్ను విసుగులేని త్రిప్పట త్రిప్పింది ఏఅంకె? ఏరాయి? అంకెలేని మగరాయి! దానికోసమే నేనాదాకా తఱుముకొచ్చిన "మాక్ నూక్ స్పీడ్" అని అనిపించింది. ★

నాటిక:

పెళ్లిచూపులు

మంగమ్మ: ఆఁ తరువాత యేం జరిగిందండీ?

శివయ్య: జరగటానికేముందీ తాంగున పన్నెండు గంటలు కొట్టేసరికల్లా ఆ వూళ్లో దిగాము.

మంగమ్మ: అప్పటిదాకా యేం చేస్తున్నారండీ? మీరు వెళ్లంగానే రైలు అందలేదా యేమిటి? అప్పటికీ తెల్లవారుఝామునఠంగా లేచి, వొంచిన నడుం ఎత్తకుండా...

సత్యం: ఇందులో నువ్వు చేసిన ఆలస్యమేమీ లేదమ్మా సగం దూరం వెళ్లేసరికి ఇంజను చెడిపోయింది. అందుకని...

శివయ్య: పన్నెండు గంట లయింది... మనం ఫలానా రోజున బయలుదేరుతున్నామని వ్రాసిన కార్డు చేరింది గావును. చక్కగా బండి గట్టుకొని స్టేషనుదగ్గిర కొచ్చాడు ఆయన.

సత్యం: బండంటే యేం బండి అనుకొన్నావమ్మా ఎడ్లబండి రెండెద్దుల బండి..

శివయ్య: ముయ్యరా నోరూ. ఏం అయితే? ఒక పొక్కుగుర్రాన్ని కట్టి లోపల కాస్తంత మెత్తగా నాలుగు గడ్డిపరకలు గూడా వెయ్యక చెవులు గింగిర్లెత్తే చెడవ మోత జటకాకంటే హీనమా యేమిటి?

మంగమ్మ: ఎందుకండీ వాణ్ని అట్లా కసురుకొంటారు? ఎన్నడన్నా వాడు ఎద్దుబండి ఎక్కినవాడా పెట్టినవాడా? అవునూ! స్కూలు ఫైనలు చదువుతున్నవాడాయెనూ పంట్లామూ బూడ్సులూ వేసుకుని ఎడ్లబండిలో కూచోవటానికి నా బుజ్జివాయనకు చిన్నతనంకాదా యేమిటి? ఒరేవ్ సత్యం! రేపు అలకపానుపు మీద మీ మామగారిని కారు కొని పెట్టమని అడగరా...

శివయ్య: మనకేదో కారు అంటే ఘనంగా వున్నది గానీ ఆయన కది ట్రంకు పెట్టెలాగు కనిపిస్తుంది. ఆయన యింట్లో ఒక మూల గింజలు పోసు చేసుకొంటే అట్లాంటి కార్లు లక్షా తొంభై కొనవచ్చు.

మంగమ్మ: మరీ మీదంతా విడ్డూరం ఇదిగో తోక అంటే అదుగో పులి అంటారు తినా కుడవా ఇంత వున్నవాడయి తేముట్టుకు మరీ...

శివయ్య: నామాటలు నీకు అబ్బురంగా వుంటాయిగానీ, రేపు నువ్వెళ్లి చూస్తే, అసలు మూర్ఛపోతావు. అంకంత డాబా.. అదిగాక ఇంకా సోలంకివారి వీధిలోనూ సోగంటివారి వీధిలోనూ రెండు పెంకుటిళ్లున్నాయి. ఒకటి గొడ్ల కొట్టానికీ, ధాన్యం పాతర్లకూ ఉపయోగిస్తున్నారు. రెండోది వూరికేనే వుంటున్నది.

మంగమ్మ: అయ్యో నాముఖం మండి పోనూ వూరికేనే వుండడం యెందుకండీ! అద్దెకిస్తే నిక్షేపంగా నెలొచ్చేసరికి దేనిలో ఒకదానికి అక్కరకు రావూ?

సత్యం: అట్లాంటి కూచిబుద్ధులు మనకుంటై. ఆయనగారికే మమ్మా లక్షాధికారి.. ముష్టి అద్దెడబ్బులు మూడు వొచ్చి ఆయన్ను ఉద్ధరించుతయ్యా యేమిటి? వారి యింట్లో ముష్టి క్రింద పొయ్యే గింజల ఖరీదు చెయ్యం మనమూ మన ఆస్తిగూడా...

మంగమ్మ: అబ్బా! అప్పుడే మామగారిమీద మాట జారనివ్వటం లేదు. ఏదో సామెత చెబుతారు చూశారూ అడ్డాల నాడు బిడ్డలుగానీ గడ్డాలనాడు బిడ్డలు కారని—

శివయ్య: ఇస్ అబ్బబ్బ అపవే నీసొద ...కానీ ఏం మర్యాద! ఎటువంటి వినయం! ఎంత అణకువ! చెబితే నువ్వు నమ్మవు గానీ, ఈ రెండు రోజులూ మమ్మల్ని దేవతలను చూసినట్టు చూశారనుకో. వాకిట్లో బండి ఆగింది. వంటమనిషి కాళ్లకు దాహానికి నీళ్ళిచ్చింది. మరొక జీతగాడు మంచాలు వాల్చాడు. ఇంకొకడు పక్కలు వేశాడు మరొకడు దిండ్లు వేశాడు. ఇద్దరు మనుషులు విసనకర్రలు తీసుకొని..

సత్యం: భోజనం ఎటువంటిది అనుకొన్నావమ్మా! మనం రెండు బంగాళాదుంపల ముక్కలు, అరగిద్దెడు చారు వొండుకొంటే ఘనం-అయిదారు కూరలు చేశారు ఆ నెయ్యి వాసన పీలుస్తూ ఆ గడ్డ పెరుగువేపు అట్లా చూస్తుంటే ఇంకా ఆకలి అవుతుందంటే నేను నమ్మను.

శివయ్య: ఇన్నిటికీ సత్యం అదృష్టవంతుడు. ఇంక మనకీ దరిద్రం వొదిలిపోతుంది. ఇంత కాలంనుండీ సత్యం కాలేజీ చదువెట్లా గట్టెక్కుతుంది భగవంతుడా అని, పీనుక్కు చస్తున్నాను. ఆయన ఆమాట అన్న తరువాత గుండెలమీద బరువు దించినట్లుంది.



ఫిబ్రవరి 6 వ తేదీని దివంగతుడైన ఇంగ్లండ్ రాజు ఆరవజార్జి. వీరి పరిపాలనా కాలంలో ఇంగ్లండ్ పరిపాలకులకు భారత దేశ చక్రవర్తి బిరుదంపోయి కామన్వెల్త్ దేశాల అధిపతి అనే కొత్తబిరుదు వచ్చింది.

మంగమ్మ: అబ్బాయికి మిటిక్లేషన్ దాకా చెప్పిస్తానన్నాడా యేమిటండీ? ఒట్టి చదువేనా ఏమన్నా కట్నం గూడా యిస్తాడా? కట్నంలేని పెళ్లి కాకుల పెళ్లి లాగా వుంటుంది. వెయ్యిన్నూట పదహార్లు కట్నం లేనిది నా కొడుకు చేత పుస్తె ముట్టుకోనివ్వను.

శివయ్య: ఇంకా నీకీ సంగతి చెప్ప లేదల్లే వున్నది. ఆమాకు ముశ్లా పడ్డప్పట్నుంచీ అల్లుణ్ణి తన దగ్గిరే వుంచుకొంటామట. అతను ఎంతవరకు చదవాలనుకొంటే అంతవరకూ అయ్యే సర్వఖర్చులూ భరిస్తానన్నాడు. ఆయనకు మాత్రం ఎవ

తున్నారు? ఆ పిల్ల, పన్నెండేళ్ళ కొడుకొకడూనూ, కొడుకుతోబాటు కూతురుకు గూడా ఆస్తి పంచియిస్తానన్నాడు. ఇంత కంటే ఎక్కువ కట్నం ఏం కావాలి?

మంగమ్మ: ఇదుగో అడగడం మరిచిపోయాను. పిల్ల పేరేమిటండీ? ఏరా సత్యం...పిల్లను చూశావుట్రా నువ్వు?

సత్యం: ఆఁ.

మంగమ్మ: ఎట్లా వుంటుంది? ఎరుపా? నలుపురంగా? సన్నగా వుంటుందా? బొద్దుపారుమనిషా?

శివయ్య: పిల్ల పేరు ఏమిటో చెప్పాడే?...నోట్లో ఆడుతూ వున్నది... ఏమిటే సు—సు—

మంగమ్మ: సుశీల—

శివయ్య: కాదు. సు—ఏమిటో తమాషాగా వున్నది. కొత్తరకం పేరు. మొత్తం మీద 'సు' వొస్తుంది. దీని దుంప తెగా సునీతి గూడా కాదు...ఏమిట్రా సత్యం?

సత్యం: సునీథ!

శివయ్య: ఆఁ ఆఁ సునీథ. పేరుకు తగ్గ పిల్ల. ఎంత బాగుంటుందనీ! మన సత్యం కంటే రెండు చాయలు ఎక్కువగానే వుంటుంది. కోలముఖం. తెల్లటి కళ్ళు. పట్టుకుచ్చులాంటి నల్లటి వెంట్రుకలు. చంద్రుడనిప్పులాంటి పట్టుపరికిణీ కట్టుకొని, ఆకుపచ్చ వోక్కా తొడుక్కొని దానిమీద జరీవోణీ వేసుకొని ఆ పిల్ల అట్లా తివాచీమీద కూచుంటే మహాలక్ష్మి అవతరించినట్లు వున్నది గానీ మరొకటి మరొకటీనా?

మంగమ్మ: ఏమన్నా పాడించి చూశారుటండీ...

శివయ్య: నీదంతా వొట్టి అడవిమేళం. అటువంటి ఫాయిదాలో వున్న వాళ్ళు పిల్లకు సంగీతం చెప్పించకుండా వుంటారూ? అయినా, సంసారం చేసుకునేదానికి సంగీతమూ చట్టుబండలూ ఎందుకే, నాకు తెలియక అడుగుతాను? అప్పటికీ మన సత్యం అపెగనే అడిగాడు, "మీ అమ్మాయికి సంగీతం వొచ్చా?" అని.

సత్యం: ఆమాట అడగడం తప్పు అని నాకు తెలియదమ్మా లేకపోతే అడెగకనే పొయ్యేవాణ్ణి. పాపం వాళ్ళు మనస్సు నెంత కష్టపెట్టుకొన్నారో యేమో?

మంగమ్మ: ఏమయిందిరా నాయనా..?

శివయ్య: ఏమయినా అవుతుంది. వాళ్ళీ మాట వినంగానే కొయ్యబారిపోయ్యారు. ముఖాలు వెలా తెలాపోయినయ్.



బ్రిటన్ కొత్త పరిపాలకురాలు రెండవ ఎలిజబత్, ఆమె కుమారుడు ప్రిన్స్‌ఫిలిప్

వాళ్ళుగుట్టుగా బ్రతికేవాళ్ళుగానీ రచ్చకెక్కి రాగాలు తీసే రకం గాదు. పోరంబోకు వాళ్ళను అడిగినట్లు అడిగితే ఏమనకొంటారో అనే జ్ఞానం మనకుండాలి ఛీ ఛీ.

మంగమ్మ: తరవాత రుంజుకొందురు గాని లెండి. ముందు ఏం జరిగిందో చెప్పండి. ఆయనగారేమన్నా..???

శివయ్య: ఏమీ అనలేదనుకో. అసలు కన్ను పోయేటంత కోటు కెందుకని? ఈ కాలపు వాళ్ళ రుమలు తెలిసినవాడు గనక సరిపోయింది. లేకపోతే వళ్ళోకొచ్చి పడ్డయింత ఆస్తిగూడా రెక్కలొచ్చినట్లు ఎగిరిపొయ్యేదిగదా? వీడికా మనం చదువు చెప్పించలేముగదా.. చచ్చి చెడి ఆయనకు ఎంతో చెప్పిన తరవాతగానీ వ్యవహారం కుదుటపళ్ళేదు. కుర్రవాడు. ఆటకాయితనం; తెలిసీ తెలియక ఏదో నోరు జారి అన్నాడు. అట్టే మనసులో వుంచుకోకండి బావగారూ అని పక్కకు గంటన్నరసేపు వాగాను. కాలు మీద కాలు వేసుకొని తినటానికి ఇంత లప్ప దొరుకుతున్నదే, ఏం నాయనా భార్యకు సంగీతం రాకపోతే?

సీతయ్య: ఏమిటి శివయ్య బావా భార్యలూ సంగీతాలూ అంటున్నావ్?

మంగమ్మ: రా సీతయ్యన్నయ్యా ఇటు కూర్చో అబ్బబ్బబ్బ ఈ మంచం మీద కూర్చో అన్నయ్యా ఫర్వాలేదు. ఆఁ. మా సత్యం మొన్నెదో తెలిసీ తెలియక ఏదో అంటేనూ వాళ్ళ నాన్నగారు కూకలేస్తున్నారు.

సీతయ్య: సత్యం ఎక్కువ తక్కువగా మాట్లాడే వాడు గాదే? ఏం సత్యం? ఏమన్నావేమిటి?

సత్యం: ఆ అమ్మాయితో — కాదు కాదు— ఆ అమ్మాయి తండ్రితో మీ పిల్ల పాడుతుం

(35-పేజీచూడండి)

అనుమానం

1

రామంచెప్పిన కథ విన్నప్పటినుంచీ గోపికి తానో డిటెక్టివ్ అయిపోవాలని చెడ్డకోరికే కలిగింది. తన కెంతో పేరు ప్రతిష్ఠలొస్తాయి. మొన్న నాన్నగారి జేబులో పదిరూపాయల కాగితం పోయిందట. పాపం రామంఅన్నయ్యపై పడ్డది. ఎన్ని దెబ్బలేశాడు నాన్న! అన్నయ్య ఎలా ఓర్చుకొని వున్నాడో? తానయితేనా? హుఁ.. అప్పుడే దొంగ ఎవరో చప్పున కనిపెట్టి!

"హాచ్! హాచ్"

గోపి విసుక్కున్నాడు "పాపిష్ఠి అక్కయ్య ఒకత్తి! ప్రతిపనికీ ముందు తుమ్ముతుంది. ఛీ..." అని క్రాపు కేపుకొన్నాడు కోపంగా.

"హాఁ!...హాచ్!...ఓరిస్... అబ్బ... హాఁ! ఏం తుమ్ములమ్మ...ఏమండీ డిటెక్టివ్ గారూ! పిలుస్తున్నారు" అంటూ ముక్కు నలుపుకొని వచ్చింది జానకి.

"ఏం లేదు అక్కయ్యగారూ! చోరీ జరిగిందటగా, నా కిప్పుడే తెలిసింది. అదే ఆలోచిస్తున్నా" అన్నాడు డిటెక్టివులా గంభీరంగా.

"అంతా తెలిసి దొంగగారు దెబ్బలు కూడా తిన్నారు" తలాడిస్తూ పరిహాసంగా చెప్పింది జానకి.

గోపిముఖంలో జాలి కనపడ్డది "ఎవరు దొంగ? పాపం...అన్నయ్యేనా? చాలా మంచివాడే...నాన్న......"

సగంలో జానకి, గోపీనోరు మూసి "వూరుకో...లోపల నాన్న వున్నారు. విన్నాడా వీపు చితకబాదేస్తాడు. అమ్మ.. బాబో...జానకి లోపలికి ఒక్కదౌడు తీసింది. గోపి వులిక్కిపడ్డాడు.

ఇంతలో రానేవచ్చారు గోపీ నాన్నగారు. "మేజస్ట్రేట్!"

"ఏరా గోపి! ఏం చేస్తున్నావ్?" అన్నాడు నరసింహం.

"అన్నయ్యని ఎందుకు కొట్టారు నాన్నారూ?" అని అడిగేశాడు ఒకవిధంగా ధైర్యంతోనూ భయంతోనూ.

నాన్నగారు నొసలు బిగించి "అరే! ఎందుకా? దొంగతనం చేశాడు. ఆ పని నువ్వుచేస్తే నీకూ అంతే..." అన్నాడు గట్టిగా.

గోపీ అధైర్యపడలేదు. పెద్ద తరహాగానే (డిటెక్టివ్ అనుకోండి) "అది కాదండి నాన్నారూ! విషయం తెలుసుకోకుండా తంతే?" అన్నాడు.

"నాన్నగారి కండ్లు ఎఱ్ఱపడ్డాయ్. "వెధవాయ్! పోయి చదువుకో, రామం చిన్నప్పుడు ఇలాగే వుండి ఇలా ఏడ్చాడిప్పుడు. మేజస్ట్రేటు కొడుకుల్ని దొరలనరిక..ఖచ్చితంగా దొంగలంటారు. హుఁ..." నాన్నగారు అవతలి కెళ్ళారు కోపంగా.

గోపి కండ్లనిండా నీరువచ్చింది. ఎంత మాటన్నాడు నాన్న. రేపు నేను ఇంతేనా? ఆ దొంగ ప్రకాశం తమ్ము వెక్కిరించరూ ఇక.

"ఏంరా గోపీ?" నవ్వుతూ వచ్చాడు రామం.

గోపికి ఆశ్చర్యంతోపాటు కోపం వచ్చింది; దొంగా అనిపించుకొని దెబ్బలు తిని పైపెచ్చు నవ్వుతున్నాడా? ఛీ. ఛీ.

"ఏరా అన్నయ్యా! డబ్బు తీశావా?" అని అడిగాడు గోపి.

"ఏమో?"

"ఏమో అంటే? నువ్వు తీయలేదా."

"వుహుఁ...అసలు నోటు ఎలాంటిదో నేను చూడనేలేదు."

"మరి దొంగఅని ఎందుకు తన్నారు?"

"అన్నవాళ్లు దొంగలు. నేను తీసివుంటేనా? ఆఫీసురూముకి ఎందరు వస్తారో? ఎందరు పోతారో? ధర్మానికి టేబిల్ పైన పెడితే ఎవ రెత్తుకొన్నారో? నాకేం తెలుసు?

"మరి నువే తీశావని దెబ్బలువేస్తుంటే ఎందు కూరుకున్నావప్పుడు?"

రామం నవ్వాడు "ఏమో నాకేం తెలుసు, నీ కెందు కిన్ని సందేహాలు? నేను దొంగిలించలేదని నాకు తెలుసు. అంతే..."

"నీ మొహం. దొంగ అనిపించుకొని దెబ్బలుతిని నవ్వుతూ పైగా నన్ను దబాయిస్తావేమిటి? నీ క్కావలసిందే" గోపీ చిన్నబుచ్చుకొన్నాడు.

"వినరా...రేపు నిజం తెలిస్తే దొంగవి కావని తేలిపోతుందికదా?"

"అందాకా? ఏది పోయినా నువే తీశావని అనుకొంటారు."

"అనుకోనీ..." రామం ఆలోచిస్తున్నాడు గోపీ తెలివికి.

గోపీకి అన్నయ్యని చూస్తుంటే జాలివేసింది. ఒకవిధంగా వాడి జవాబులు వింటుంటే అసహ్యం వేసింది. రామానికి గోపీ నసనసిక అవగాహన కాలేదు. వాడు మెల్లిగా జారుకొన్నాడు.

"తిండికి రావట్రా. దొరగారికి ఓసారా?" అంటూ వచ్చింది అమ్మ.

"వస్తాగానీ...అమ్మా...నోటు ఎలా పోయింది?"

"రామంగాడు తీశాడుట..."

"కాదు...తీస్తున్నపుడు ఎవరు చూశారు? నువా?"

అమ్మకి కొద్దిగా కోపం వచ్చినట్లుంది "నీ కెందుకు? తిండి తిని వూరుకో. నాన్నగారి చెవిదాకా పోయిందంటే నీమాటలు వీపుకి శుభ్రంగా పూజాపునస్కారాలవుతాయి."

గోపీకి సందేహం తీరలేదు. గొప్పవారి బిడ్డలు దొంగతనం చేస్తారా? చేస్తే ఎంత అగౌరవం. ప్రకాశంముందు తాము ఎందుకూ పనికిరానివా రవుతారు.

"కాదమ్మా. అన్నయ్య తియ్యలేదు నోటు."

"నిన్ను చొప్పదంటు ప్రశ్నలు వెయ్యమన్నారా? నీకూ రెండు తగిలితేకానీ వూరుకోవు." లోనికి వెళ్లిపోయింది అమ్మ. ఆమెకు రామంగాడిని వాళ్లనాన్నగారు కొట్టినప్పటినుంచీ మనసేం బాగాలేదు.

"అన్నానికి రావురా" కిటికీనుంచీ చూస్తోఅడిగాడు రామం. గోపీ లేచాడు. రామం పరుగెత్తాడు లోనికి. జేబులో డబ్బు గలగలలాడింది. గోపీ ఒక్క

(36-వ పేజీ చూడండి)

శ్రీమతి యస్. రాజేశ్వరీరాణి

వెంకయ్యవెలి

వెంకయ్య సంసారంమీద పిడుగు పడింది. అనుకోనిచోట్ల పడే అలవాటు కల పిడుగుకి వెంకయ్య సంసారం మీదే పడడం అంత కొత్త విషయమేమీ కాదు. కాని వెంకయ్య సంసారం మాత్రం ఆ పిడుగు తాకిడికి తట్టుకోలేకపోయింది.

తామరవ్యాధి ముదిరినాసా బాధపడుతూ వైద్యానికై తన వద్దకు వచ్చిన వెంకయ్యని పరీక్షించి, అతడికి పెద్ద జబ్బు వచ్చిందని జోస్యపు ఆచార్యులుగారు చెప్పారు. ఆచార్యులుగారికి జ్యోతిశ్శాస్త్రంలో పాండిత్యంతో పాటు కాస్త మాత్ర నలిపి ఇవ్వడంలో కూడా ప్రావీణ్యం ఉంది. ధన్వంతరి మరణించడం తాము అవతరించడానికేనని ఆచార్యులుగారికి శల్యాల్లో బాగా జీర్ణించిన సత్యం. అదృష్టవశాత్తూ మన కథకు ఆయన జీర్ణ సత్యాలతో నిమిత్తమేమీ లేదు.

వెంకయ్య కుటుంబానికి అంటే వెంకయ్య భార్య మంగమ్మకు ఆచార్యులుగారి జోస్యం మీద వీసమెత్తు నమ్మకం కూడా లేదు. ఎనకో పాలి మంగమ్మ తమ్ముడు సూరిగాడికి పదహారో ఏటే పెళ్ళవుతుందని ఆచార్యులుగారు జోస్యం చెప్పారు. ఆడికి ముప్పై ఏళ్ళు ముడ్డి క్రిందకి వచ్చినా పెళ్ళి మాత్రం ఇంకా ఇంకా దూరం అవుతూ ఉంది. కాని, ఆయన వైద్యంలో మాత్రం చచ్చేంత గురి ఉంది మంగమ్మగారికి. వంకయ్య కుటుంబంలోనివారికి ఏ మందు ఇచ్చినా ఆయన చిల్లి డబ్బు అయినా పుచ్చుకోరు. షావుకారు వెంకయ్య దుకాణంలో ఆయనకు బోలెడంత పరపతి ఉండడానికి కూడా ఇదే కారణమయింది. అదే విధంగా సంవత్సరాల తరబడి దుకాణం మీద వాడుకున్న సరకులకుగాను ఆయన వంకయ్యకు చిల్లి డబ్బు అయినా ఏ నాడు ముట్ట చెప్పిన పాపాన పోలేదు. ఈ సంగతి మంగమ్మకి తెలియదు. తెలిస్తే ఆచార్యులుగారి వైద్యం మీద ఆవిడ కంతకాలం నమ్మకం ఉండక పోనేమో కూడా.

ఆచార్యులు రోగులను ముట్టుకోనకుండానే, అల్లంత దూరాన చూచి, వచ్చిన జబ్బేమిటో తెలుసుకుని, తన్నివారణకు రామబాణంలాంటి మందు ప్రయోగించగలరు (ఆయన అలాంటి రామబాణాలతో ఆ గ్రామంలో చాలా మంది వాలి రావణ మారీచాది రాక్షసులను హతమార్చినట్లు ప్రతీతి కూడా ఉంది) ముట్టుకోడానికైతే ఆచార్యులుగారికి అభ్యంతరం లేదు. కాని, ముట్టుకోకుండానే సంక్రమించి, నానా బాధలూ పెట్టే వెంకయ్య కుటుంబపు తామర ముట్టుకుంటే ఏ విధంగా పరిణమిస్తుందోనని ఆయన భయం. అసలా తామరే వెంకయ్య విషయంలో కుష్టుగా మారిందని ఆయన సెలవిచ్చారు.

అంటే ఆమరుక్షణమే మంగమ్మ తన భర్త అయినటువంటి వెంకయ్యను వెలివేసింది. తన భార్య ఎంతో మంచిదని వెంకయ్య అనుకునేవాడు. కాని ఆచార్యులుగారి రోగనిదాన ఫలితంగా ఆ మంచి అంతా చెడుగా మారిందని వెంకయ్య భయపడవలసిన అవసరం వచ్చేసింది.

పెద్ద జబ్బు వచ్చిన వెంకయ్యని చూచి మొదట చాలా ఏడ్చింది మంగమ్మ. కన్నీళ్ళు కారడం మానివేసిన తరువాత ఊరికే ఏడుస్తున్నట్లు మూలిగింది. ఆ మూలుగు కాలంలోనే వెంకయ్యమీద ఒక రకం అసహ్యం బయలుదేరింది. స్వభావతః మంచిది కావడంవల్ల ఆ అసహ్యం చంపుకుని, జాలిపడింది. అయ్యో, నా రాత ఇంత అయిందా అనే ఏడుపు ఎక్కువ అయ్యేసరికి ఆ జాలి కూడా నశించి, భర్తను సరిగా కంటితో చూడడం కూడా మానేసింది. కంటితో అని చెప్పడానికి ప్రత్యేక కారణం ఉంది. ఆమెకు ఒక్క కన్నే. రెండో కన్ను చిన్నతనంలో తమ్ముడు వీర్రాజు గాడి గోటీబిళ్ళకి బలి అయింది.

అయితే మంగమ్మ వెంకయ్యని వెలి వేయడానికి అసలు కారణం వేరు. "సరే. వచ్చిన జబ్బు ఎలాగూ వచ్చింది. ఇక పొమ్మన్నా పోదని ఆచార్యులుగారు కూడా చెప్పారాయె. కాని, తన కడుపున పుట్టిన కూతురు, తన చీము నెత్తురు తామర పంచుకుని జన్మించిన ముద్దుల కుమార్తె పుల్లమ్మకు ఆ జబ్బు అంటుకుంటే ఏమిటి చేయడం" అని ఆమెకు భయం కలిగింది.

పుల్లమ్మ పేరుకొక చరిత్ర ఉంది. పుల్లమ్మకు కీర్తిశేషుడు తాతగారైన పుల్లయ్య (ఆయన గడించి మిగిల్చినది అది ఒక్కటే) పేరు పెట్టారు. ముద్దుకి పుల్లి అనే వారు. కొందరు కిట్టని వాళ్ళు పులి అనడం కద్దు. తామర బగ్గీలు పులి చారలని వారు భ్రమపడిఉండవచ్చు.

ఏదైనా వెంకయ్యని వెలివేసిన మంగమ్మని ఏమనడానికి వీలులేదు. అగ్నిసాక్షిగా వివాహమాడినందుకు ఒక ఏడుపు ఏడిచేసింది. అంతే కాని వెంకయ్యకోసం తన జీవితం కాని, తన కుమార్తె జీవితం కానిపాడుచేసుకొని, వెంకయ్యనిఇంట్లోనే ఉంచుకోవడం ఆమె ఒంటికంటి దృష్టిలో అంత సబబైన విషయంగా గోచరించలేదు.

వెంకయ్య అయినా మంగమ్మకోసం ప్రాణత్యాగం చేసేటంతి ప్రేమ కలిగిన వాడు కాదు. అసలు మంగమ్మతో సే

"తూలికాభూషణ్"

వెంకయ్యకు తామరా సిరీ అబ్బాయి. మంగమ్మ గడపదాటి కుడి కాలు లోపల పెట్టడం, ఆ కుటుంబంలో తామర ప్రవేశించడము ఒక్కసారే జరిగాయి. సిరికల తామరవద్దనే వారు లేరు. అందులోనూ నాలుగు తరాలుగా జంగిడ బుజంమీద పెట్టుకుని చేగోడీలు అమ్ముకున్న వెంకయ్య కుటుంబానికి సిరి విలువ తెలుసు. పైగా మంగమ్మకు సిరి ఉన్న విషయమే కాని, తామర ఉన్న విషయం ఆ నాటికి వెంకయ్య కుటుంబంలోనివారికి తెలియదు. అప్పట్లో అది నిక్షిప్త ధనంగా ఉండేది.

తండ్రి డబ్బుతో భర్త సంసారానికి ఏకు మేకై కూర్చుంది మంగమ్మ. మంగమ్మ అధికారం కాదనగలిగే ధీమాయే ఉంటే



వెంకయ్యకు ఆదిలోనే తామర బాధ తప్పను. అయినా అదేమి వ్యాధో కాని ఎన్ని మందులు వాడినా అది మళ్ళీ మళ్ళీ అందరికీ అంకురిస్తూనే ఉండేది. వెంకయ్యకి మాత్రం క్రమంగా ఆ తామర మీద ఒక విశ్వాసం ఏర్పడింది. దానితోటే సిరి రావడం, తిరిగి దానితో పాటే సిరి కూడా వృద్ధి చెందడం అతని విశ్వాసం బలపడడానికి కారణమయ్యాయి. క్రమేణా అతనికి దాని మీద ఒక రకమైన భక్తి కూడా ఏర్పడింది. అప్పటినుంచి ఆ ఇంటిలో తామరమందుకు స్థానం లేకుండా పోయింది. వెంకయ్య దుకాణంలో తామర మందు విక్రయమూ లేదు.

కాని, అనుకోకుండా ఆ భాగ్యదేవత కరుణాకటాక్ష వీక్షణం ఇలా పరిణమించింది. మరొకవంక విచారంతోపాటు భర్తపై మంగమ్మ అధికారంకూడా ఇనుమడించింది. భర్తపై తనకున్న అధికారం ఎలాంటిదో మంగమ్మకు తెలుసు. అందుచేత కేవలం అధికారమదంవల్లనే భర్తను వెలివేసినదని చెప్పడానికి అవకాశమేమీ లేదు. అసలు కారణం పుల్లమ్మ పెళ్ళే కాని అన్యం కాదు. కేవలం తామరవంటి సిరికల జబ్బు మాత్రమే ఉంటే బాధపడని వారు చాలామంది ఉండవచ్చు కాని ఇది వేరే విషయం.

మంగమ్మ వెలివేయడంతో వెంకయ్య సంవత్సరాల తరబడి నిర్మించుకున్న ఊహా సౌధాలు కూలిపోయి, అతని జీవితం ధ్వసం కావలసిందే. అతని కలలు కల్లలుగా మారవలసిందే సమాజంలోని ఎందరో అభాగ్యుల జీవితాలకు చిహ్నంగా వెంకయ్య వెలిగురించి సమాజాత్మ తత్వ జిజ్ఞాస కలిగిన ఒక మహాకవి ఒక మహాకావ్యం విరచించి, కన్నీరు కార్చవలసిందే. ఆంధ్రదేశ దురదృష్టంవల్ల అలాంటి పరేంగిత జ్ఞానం కలిగిన మహాకవి ఎవరూ ఇంత వరకు జన్మించలేదు. అలాంటి మహాకావ్యరచన కూడా జరిగింది కాదు.

భార్య వేసిన వెలికారణంగా వెంకయ్య మొదట కొంచెం బాధపడిన మాట నిజం. క్రమేపీ ఈ వ్యాధి అతనికి తలవని తలంపుగా ఒక మహా ఉపకారం చేసిపోయింది. పూర్వం రోజుకు ఒక్క పుగాకు ముక్కకన్న ఎక్కువ ఉపయోగించడానికి అతనికి అనుమతి ఉండేది కాదు. ఒక్క పుగాకు ముక్కని ఎన్ని చుట్టలుగా రూపొందించ వచ్చునో వెంకయ్యకు తెలిసినంత బాగా మరెవరికీ తెలియదు. (ప్రస్తుతం వెంకయ్య ఈ విషయమై ఒక థీసిస్ వ్రాసి, డాక్టరేట్ కోసం ఫ్రాన్సులో ఉన్న సార్‌బోన్ యూనివర్సిటీకి పంపనున్నారని ఒక హంగ్రీ జర్నలిస్టు కథనం) ఒకొక్కప్పుడు వెంకయ్య ఆ పుగాకుముక్కలోనే తను కాల్చుకోగా మిగిలిన చుట్టను ఏ పాలేరుకైనా దానం చేస్తూ ఉండే వాడు. వెంకయ్య నిర్యాణానంతరం అతని స్మారక చిహ్నంగా ఒక చిన్న బుల్లి చలువరాతి గోరీ కట్టించడానికి విరాళాలు సేకరించే వారు అతని పుగాకు దానం సంగతి విధిగా జ్ఞాపకం ఉంచుకోవాలి. అంతే గాక వెంకయ్య స్మృతి అజరామరంగా ఉండేటట్లు చేయడానికి ప్రజలందరు అతని దానబుద్ధిని అలవర్చుకోవాలంటూ ఉద్బోధించాలి.

రోజంతా ఎద్దులా గంగిరెద్దులా గాడిదలా చాకిరీ చేసి, బస్తాలుమోసి, పద్దులు కూడా వ్రాస్తే కాని ఆ పుగాకుముక్క అయినా లభించేది కాదు వెంకయ్యకి. ఇప్పుడంతా వేరు. వారానికి ఏబులం పుగాకు అడగ్గానే మంజూరు అయింది. ఒక్క పుగాకు ముక్కతో కాలం గడిపిన కారణంచేత ఏబులం పేరు తల పెట్టగానే ముందు వెంకయ్యకే గుండె బేజారయింది. అడిగినంతా ఇవ్వకపోతే వెంకయ్య ఇంట్లో ప్రవేశించి, తనే స్వయంగా తీసుకుంటాడేమోనని మంగమ్మ భయపడింది.

అన్నపానాదుల విషయంలో కూడా అంతే. అదివరదాకా పథ్యపుసరకుల మీదే బ్రతుకుతూవచ్చాడు వెంకయ్య నేతిలో, వేయించిన మిరియాల పొడి. సొంతి పొడి, మిరియాల చారు, చింతకాయ పచ్చడి, నిమ్మకాయ ఊరగాయ నిత్యనైవేద్యాలయ్యాయి. పప్పు పదార్థాలు మాత్రం అడపా తడపా తగిలేవి. కొంచెం తగు మాత్రంగా ఉప్పు, పులుపు ఉండి జిహ్వకు రుచించే సరకులు కరవైనప్పుడు పిండి వంటల మాట చెప్పడానికి ఏముంటుంది? మంగమ్మని పెళ్ళాడడానికి ముందు డబ్బు లేకా, ఆమె కాపరానికి వచ్చిన తరువాత ఆమెకు సరిపడని కారణంచేతా వెంకయ్య జిహ్వ కట్టేసుకోవలసి వచ్చింది. క్రమేపీ అతని జిహ్వ ఎండి ఇగిరి చచ్చిపోయింది. అలాంటిది మంగమ్మ వేసిన వెలితో వెంకయ్య తన సరదాలన్నీ తీర్చుకోవడం మొదలు పెట్టాడు. అతని జిహ్వ కూడా తిరిగి లేచి వచ్చింది. (మన దేశంలో ఏ టాల్‌స్టాయ్ వంటివాడో కనుక పుట్టి ఉన్నట్లయితే 'రిసరెక్షన్ ఆఫ్ వెంకయ్యాస్ పాలెట్' అనే పేరుతో ఒక మహాగ్రంథం రచించి పారేసును.)

వెంకయ్య ఎత్తుబడులన్నీ మంగమ్మ

గమనించకపోలేదు. పిసాశం సెత్తికంటింది. ముట్టుకుంటే మహా ప్రమాదమని ఆచార్యులు గారు చెప్పారు. కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఈ విధంగా డబ్బంతా తన అబ్బ సొమ్ములా వాడుతూ ఉన్నందుకు ఏనాడో దేహశుద్ధి చేసిఉండేది. ఏ చీపురైనా ఉపయోగిస్తే—ఆ జబ్బు కాస్తా చీపుర్ని అంటి పెట్టుకువచ్చి తనకు సంక్రమిస్తుందేమో అని కూడా ఆమె భయపడింది. ఆమె తన దేహశుద్ధి చేయడానికి క్షణమైనా ఆలస్యం చేసి ఉండేది కాదన్న సంగతి వెంకయ్యకు అనుభవంవల్ల బాగా తెలిసినదే. పూర్వం బాగా ఉన్న రోజుల్లో, తన కేమైనా అంతగా కావలసివస్తే, ఏ గ్రామమునసబు గారివంటి ఘరానా మనిషో దుకాణానికి వచ్చినప్పుడు వారి ఎదుట వారికి తెలిసేటట్లు భార్యకి కబురు చేసి తన పరదా తీర్చుకునేవాడు. అయినా దేహశుద్ధిమాత్రం తప్పేదికాదు.

ఇప్పుడు వెంకయ్య పురమాయింపులు, ఆజ్ఞలు ఎక్కువ కావడంతో మంగమ్మ ఒక నిర్ణయానికి వచ్చింది. "పుల్లమ్మ పెళ్లంటూ కానియ్యి ముసలాడా, నీ సంగతి చెబుతాను" అని బెదరించింది. ఈ బెదరింపు వినగానే వెంకయ్య రహస్యంగా ఊళ్లో అమ్మవారిగుడికి పోయి "పోలేరమ్మ తల్లీ, ఆ పుల్లి ముండకి ఇప్పట్లో పెళ్లి కాకుండా చెయ్యమ్మా. నీకో కానీ అరటిపళ్లు ఇచ్చుకుంటాను" అని మహాభక్తితో మొక్కుకున్నాడు. వెంకయ్య మొక్కుబడి ఫలితమో, లేకపోతే మంగమ్మ బెదరింపుల ఫలితమో తెలియదు కాని మరి కొలదిరోజులలోనే పుల్లమ్మ పెళ్లికి సంబంధం నిశ్చయమయింది.

తన తండ్రి ఆస్తి, తను భర్తచేత నానా చాకిరీ చేయించి రెట్టింపు పదిరెట్లు కూడా చేసిన ఆస్తి ఏ పరాయివాడి భుక్తమో కాకుండా తన కుటుంబంలోనే ఉండాలని మంగమ్మ అనుకుంది. ఇప్పుడు భర్త జబ్బుతో కుమార్తె పెళ్లి వెంటనే చేయవలసిన అగత్యం కూడా ఏర్పడింది. అల్లుడంటూ ఒకడు ఉంటే తన భర్త స్థానం (దుకాణంలో మాత్రమే) ఆక్రమించుకుని, నా భాండో అని ఆస్తి మరింత పెంచడం కోసం పని చేస్తాడు. వెంకయ్య వెలితో వ్యాపారం కొంచెం తగ్గింది కూడా. అందుకని తన దగ్గరే తన ఇంట్లోనే ఉన్న తన బడుద్ధాయి తమ్ముడికే తన కూతుర్నిచ్చి కట్టబెట్టడానికి నిశ్చయించుకుంది మంగమ్మ. ఆ వెంటనే తండ్రి ఊరికి పోయి తాంబూలాలు పుచ్చుకుని, ముహూర్తం పెట్టించి, చక్కా వచ్చింది.

మంగమ్మ తమ్ముడిసంగతి పెద్దభారతం అంతవుంది. ఎంతో 'డబ్బున్నా వాడి ముఖంచూచిన వాళ్లెవరూ వాడికి పిల్లనిచ్చి పెళ్ళిచేయడానికి అంగీకరించలేదు. వాడి మొఖం ఎవరికంటా పడకుండా చేయడానికి, ఆ విషయం తేలియకుండా డబ్బు చూచే వారిని మభ్యపెట్టడానికి వాణ్ణి అక్క

(మంగమ్మ)గారింట్లోనే చాలకాలంగా ఉంచారు తలిదండ్రులు. కాని, ఆ ప్రయత్నాలు కూడా సంపూర్ణంగా వ్యర్థమయ్యాయి. అప్పటికే వాడి ముఖసౌందర్యం గురించి దేశంలో కథలుగా గాథలుగా చెప్పుకుంటూ ఉండడంచేత ఆతలి దండ్రుల మనోరథం ఈడేరిందికాదు. ఇక పిల్లవాడికి పెళ్ళిచేయకుండానే, లోకానికి దిక్కు లేకుండా చేసి పోవలసి వస్తుందేమోనని ఉదారస్వభావులైన ఆ తలిదండ్రులు విచారిస్తూఉండగా మంగమ్మ తన కూతుర్ని చేసుకోమని అడగడానికి వచ్చింది.

మరొకప్పుడయితే, అంటే సౌందర్యఖని అయిన తమ సుపుత్రుని కీర్తిచంద్రికలు లోకంలో వ్యాపించకముందు వారు ఏమైనా వెనుదీయడమో, బెట్టుచేయడమో సాగించేవారేమోకాని ఇప్పుడు తీరా విరక్తితో సన్యాసం స్వీకరించినసమయంలో తమ అగ్ర తనూజ ఈ విధంగా కోరడంతో వారు వెంటనే అంగీకరించి, అల్లుడు రాకపోయినా కూతురితోనే తాంబూలాలు తీసుకున్నారు.

ఇది వెంకయ్యకు అశనిపాతంలా తోచింది. షావుకారుగా పుట్టాడుకనుక సరిపోయింది కాని లేకపోతే ఆత్మహత్య చేసుకునే వాడేమోకూడా. అదే కారణంచేత అంతటి దుర్వార్తలోకూడా అతనికి సంతోషించదగిన విషయం ఒకటి గోచరించింది. పుల్లి అంటే వెంకయ్యకు ఏనాడూ మక్కువ ఏమీ లేదు. పుల్లిగుణాలు, రూపురేఖావిలాసాలు మూడుమూర్తులా మంగమ్మవే. మాటలువచ్చి నడవడం మొదలుపెట్టిన రోజునుంచి తల్లిలాగే తండ్రిమీద అధికారం చెలాయించేది పుల్లమ్మ. ఎప్పుడైనా ఏరవంత చింతపండయినా, బెల్లంముక్కఅయినా చిరుదిండి తినడంకోసం తనదగ్గరికి వచ్చి తనతో మాట్లాడేది. కాని ఇతరసమయాలలో తనపొడఅయినా కిట్టేదికాదు పుల్లమ్మకి. భార్యామణి చూడకుండా మరోపుగాకు ముక్క తుంపి రొండిని పెట్టుకుంటే ఆవార్త కాస్తా తల్లికిచేరవేసి శాపనార్థాలు పెట్టించేది కూడా. అలాంటి సుగుణఖనిఅయిన కుమార్తె ఈ విధంగా తిరిగి భార్యకుటుంబంలో చేరిపోవడం, అన్నిటినీమించి మన్మథుడులాంటి బావమరదిని పెళ్ళిచేసుకోబోవడం ఎందుచేతనో తగిన శాస్తిలా తోచి వెంకయ్య మనస్సుకి రవంత శాంతి చేకూరింది. అంతలోనే ఈ పెళ్ళి కాస్తా అయిపోతే తనగతి ఏంకాను, ముందున్న ముసళ్ళ పండగ స్వరూపం ఎలా ఉంటుంది అనే భయం వెంకయ్యకి ఒక్కొక్కనాడు నిద్రకూడ పట్టకుండా చేసేది. తామర పుష్కలంగా శరీరమంతా వ్యాపించిన తదాది వెంకయ్యకు నిద్రపోయేఅలవాటు ఏనాడోతప్పిపోయింది. పగలు, రాత్రికూడా పనిలేనప్పుడల్లా, అలా చుట్ట నోటిలో పెట్టుకొని, మాగన్నుగా ఉండి, సమాధిలో ఉన్నట్లుగా కనపడుతూ తపస్సుచేస్తూ ఉండేవాడు వెంకయ్య. అందుకే అతనికి నిజంగా నిద్రపట్టిందోలేదో తెలుసుకోవడం బ్రహ్మకైనా తరంకాకపోవడంచేతనే వెంకయ్యదుకాణంలో ఏనాడూ దొంగతనాలు జరుగలేదు.

తలవని తలంపుగా ఈ పెళ్ళివార్త ఒక్కరికిమాత్రం మహా సంతోషం చేకూర్చిందని చెప్పకతప్పదు. అది పుల్లమ్మకే. అదేమో కాని, పుల్లమ్మకి చిన్నప్పటినుంచి ఆ మామ సాంగత్యం రుచించినట్లు మరెవరి పొడా కిట్టేదికాదు. సర్వకాల సర్వావస్థల్లో ఆ మామ సాన్నిధ్యంలోనే కనపడేది. ఇక పెళ్ళయితే మామని ఎప్పటికీ విడిచిపెట్టక్కర్లేదుకదా అనేసంతోషం ఎక్కువై పుల్లమ్మ ఇంట్లో అందరిమీదా మహా అధికారం చలాయించడం మొదలుపెట్టింది. ఇక ఈ కథని ఇలా ఆనందంగా పొడిగించడం అర్థంలేని విషయం. అందుచేత నాలుగు మాటల్లో ముగించి వేస్తాను.

ఒక శుభముహూర్తాన సకల సద్గుణ సమన్విత రూపవతి అయిన పుల్లమ్మ వివాహం అంతా ఓహో అనేటంత వైభవంగా జరిగింది. ఒకరకంగా మంగమ్మ కోరిక అప్రయత్నంగా నెరవేరింది. వెంకయ్య గుండె మాత్రం బ్రద్దలయింది. ఎన్నోడక్కాముక్కాలు తిని ఓర్చిన వెంకయ్య గుండె సామాన్యమైన దేమీ కాదు. కంచువజ్ర సన్నిభమైనది. అలాంటిది ఆకస్మికంగా బ్రద్దలు కావడానికి తగినంతటి విశేషమైన కారణం ఒకటి ఉండాలి కదా !

పుల్లమ్మ పెళ్లికివచ్చిన బంధువుల్లో ఇంగ్లీషు వైద్యం చదువుకున్న ఆసామీ ఒకరున్నారు. ఆయనగారు తనకేమీ అవసరంలేకపోయినా, ఎవరూ కోరకపోయినా తన పాండిత్యం వెలగబెట్టుకుందుకు, వెంకయ్య వెలిసంగతి తెలుసు కొన్నటువంటి వాడై, వెంకయ్యని పరీక్షచేసి, వెంకయ్యకి తామరతప్ప మరేవ్యాధి కానలేదని శాస్త్రీయంగా ఋజువు చేశాడు. మంగమ్మకి ఇంగ్లీషుచదువులాంటి పిచ్చి పిచ్చి వాట్లల్లో నమ్మకమేమీ లేదు.

అయినా పదిమంది జుట్టు పట్టుకొని లాంగదీసి తనుమాట వినేవరకు విడిచిపెట్టకపోవడంచేత విధిగా ఆ ఇంగ్లీషువైద్యుడి రోగనిదాన ఫలితం అంగీకరించక తప్పలేదు. దీనికి మరొకకారణంకూడా ఉంది. చర్మవ్యాధి బాధితులు ఎవరయినా పదే పదే వస్తే అది పెద్దజబ్బని చెప్పి, వారిపీడ వదుల్చుకోవడం ఆచార్యులుగారికి పరిపాటనికూడ తరువాత తెలిసింది.

వెంకయ్య తన స్వాతంత్ర్య సౌఖ్య సౌభాగ్యాలు కోల్పోయినవాడై తిరిగి మంగమ్మ చెరసాలలో ప్రవేశించాడు. ఆ రోజునే తన వెలికాలంలో పెట్టిన దుబారా ఖర్చులకు ప్రతిఫలంగా దేహంకూడ శుద్ధి చేయించుకొని పరిపూర్ణుడయ్యాడు. అదే వెంకయ్య గుండె బ్రద్దలు కావడానికి గల కారణం. పుల్లమ్మ, భర్తమాత్రం సుఖంగా పుత్ర పౌత్రాభి వృద్ధిగా జీవిస్తున్నారు. ★

దగాచేసిన దేవత

"ఉన్న డబ్బంతా దొంగలకీ, కోర్టులకీ అప్పచెప్పి, ఇల్లు అమ్ముకుని, పొలాలు వదులుకుని, జమీందారుగా ఉండవలసిన నేను గుమాస్తాగా మారుతూంటే, వేలకొద్దీ రూపాయిలు ఇయ్యలేని రక్షణ ఈ నూరు రూపాయిలూ ఇస్తాయా? ఇన్ని వేల నష్టమూ కలిగాక ఇది లెఖ్ఖా?'

'కాని, అన్నీ పోయాక ఈ నూరూ కూడా వదులుకుంటే లాభం ఏమిటి? ఉన్న దానితో సర్దుకోవాలి కాని వేలు పోయాయని వందలుకూడా వదులుకుంటామా?'

'ఎప్పుడూ నమ్మవు పార్వతీ. ఈ పజిల్‌లో నాకు తప్పకుండా ప్రైజ్ వస్తుంది.... మూడు, అయిదు, తొమ్మిది - మూడూ సరియైన అంకెలే. అందుకే వెంకటేశం ఈ శాస్త్రంలో అందెవేసిన చెయ్యి.. .. నా అదృష్టం ఇందులో నిర్ధారణ కావాలంటున్నాడు'

'మంచి వెర్రి! అదృష్టం ఉంటే ఎన్ని విధాల రాకూడదండీ! చేతిలో ఉన్నది ముందు వెళ్ళాక ఈ మాటలు కనిపించవు. ఎన్ని పజిల్సు కట్టారు కాదు! ఎన్ని లాటరీలు కొన్నారు....ఒక్క దానిలో వది రూపాయిలు వచ్చాయా? ఇవ్వవలసిన విధంలో దేముడు ఇస్తాడు. ఈ పజిల్‌కి నూరు రూపాయిలు పాడు చెయ్యకండి'

'ఈ అదృష్ట వాదనతో నా ప్రాణం కొరికి వస్తోంది పార్వతీ! నలభై వేలూ పైకి వేలూ వచ్చే వాళ్ళంతా అదృష్టం మీద నమ్మకం ఉంచి కట్టడం మానేస్తే ఏమవుతుంది? ఆ అదృష్టం ఇలాగే వస్తుందనుకోకూడదూ?

'కనిపించని అదృష్టంకోసం కనిపించే ఈ రకంతా వదలగలమా?'

'సాహసం ఉండాలి పార్వతీ.. ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు. వెంకట్రావు చూడు...ఆ లాగ్గా ఇరవై వేలు కొట్టాడు.'

'డబ్బున్న వాళ్ళకి అన్ని విధాలా వస్తుంది. మనకి రోజులు బాగులేనప్పుడు ఊరుకోవడం మంచిది కాదుటండీ? ఈ సమయంలో ఏది కలిసివస్తోంది గనక? ఆఫీసరుతో పోట్లాట అలాగే ఉంది... దావా పోనేపోయింది. ఆరు వేలు వచ్చే భూములు ఆరు వందలకి తెగాయి. కని నెత్తిమీద తంతోంటే ఏమిటి లాభిస్తుంది?'

'ఈ దేవత ఎంతదూరం పరిగెట్టించ గలదో చూస్తాను పార్వతీ ఉదయం కొన్ని పెందరాళే లేపు ..పోస్టాఫీసులో డబ్బు కట్టేసి, రిజిష్టరీ చేసేసి మరీ వెళ్తాను ఆఫీసుకి'

'పోనీ...కొంచెం తక్కువ కట్టకూడదుటండీ పదో, ఇరవయ్యో...'

'నీకు తెలీదు పార్వతీ......ప్రస్తుతం తొంభై ఏడు నాకు అదృష్ట సంఖ్య అదీ కాక, ఈ సాల్యూషన్‌తో సరిపోక దానికి ఆ మాత్రం వెయ్యకపోతే ఎలాగ? అక్కడికీ సగం మాత్రమే వేస్తున్నాను డబ్బు లేక...'

'ఏమో...మీ ఇష్టం చెప్పాను- ఇకేం చేస్తాను?'

'మంచిదానివిగా...ఈ ఒక్క సారీ...'

శర్మ అక్కడితో వాదన ఆగినందుకు సంతోషించాడు. ఏమనుకుందో, పార్వతి పడుకుంది ఇంక మాట లాడకుండా

మర్నాడు ఉదయం మంచినీళ్ళు తాగి, క్రాస్‌వర్డ్ ప్రక్కకి తీసి ముక్కని, శర్మ ఆలోచనలో పడ్డాడు నిన్నం తక్కువగా కాస్తోంది క్రాస్‌వర్డ్ వరస్నం పరిమళం పెడుతోంది

గుమాస్తాగా పని చేస్తున్న శర్మ ఒకనాడు పెద్ద జమీందారు కొడుకు. మేడలలోనూ, మిద్దెలలోనూ హాయిగా నివసించి, సుఖాలకి అలవాటు పడ్డాడు

కాని, కాలం అతనికి చెయ్యని నేరానికి శిక్ష విధించింది. తండ్రిమరణంతోటే పెద్ద అప్పులు బయటపడ్డాయి. తరువాత ఇంట్లో దొంగలు పడ్డారు. మాస్తూండగా ఆస్తంతా ఎగిరిపోయింది. ఇంటర్ మీడియేట్ ప్యాసయినఅదృష్టంతో శర్మ గుమాస్తాగా ఉద్యోగం సంపాదించాడు

మొదటినించీ శర్మకి పజిల్స్‌లో చాలా సరదా. ఉద్యోగం మొదలుపెట్టిన దగ్గర నించీ అతను తన దుర్గతికి చాలావిచారించేవాడు పూర్వస్థితి ఏదన్నా జ్ఞప్తికి తెస్తే అతనికి గాయాన్ని రేపినట్లుండేది. విచారమైన హృదయంతో అతను కొన్నిగంటలు గడిపేవాడు.

కాని, ఆ నిరాశలలో అతనికి హఠాత్తుగా రాగల అదృష్టమే కొత్త ఆశని ఇచ్చేది. ఎంత ఆశ్చర్యకరంగా ఆస్తి పోయిందో అంత ఆశ్చర్యకరంగా ఆస్తి వస్తుందని అతను నమ్మేవాడు. ఆ ఆశతోనే అతను జీవితం సాగిస్తున్నాడు.

అతనెన్నో పజిల్సు కట్టాడు. వాటిలో లాభం లేకపోయినా అతనికి కొంతకొంతగా పనికివచ్చాయి. ఇంతలో 'లక్ పజిల్స్' అరవై వేలరూపాయిలు ఆఫర్ చేశాయి. వాటిలో తప్పకుండా కొత్త లాభిస్తుందని అతని నమ్మకం. వెంకటేశం అనే న్యూమరాలజిస్టు కూడా చాలా ఆశ్వాసనిస్తున్నాడు.

పార్వతికి ఇంత డబ్బు పజిల్స్‌లో పెట్టడం ఏమీ బాగా కనిపించలేదు. చేతిలో ఉన్న డబ్బు వదులుకుని, దైవం మీద భారం వెయ్యడం ఏమిటని ఆమె వాదన.

ఇదంతా ఆలోచించుకుని శర్మ ఆ

శ్రీ ఇచ్ఛాపురపు జగన్నాధరావు

తప్పుకట్టడానికి నిశ్చయించుకుని, వెళ్ళి పడుకున్నాడు.

* • *

ఉదయం శర్మచాలా ఉత్సాహంగా లేచాడు. ఏడున్నర అయేసరికి కాఫీ, స్నానం ముగించి, శుభ్రంగా బట్టలువేసుకుని బయలుదేరాడు. తొంభై ఏడు కాపన్లూ జాగ్రత్తగా కవర్లోపెట్టి, పార్వతినిపిల్చాడు.

'...డబ్బు ఇస్తావా?'

పార్వతి అతనివంక అదోవిధంగా చూసింది.

'పెట్లో కవర్లో ఉన్నాయి. సరిగ్గా నూరే ఉన్నాయికూడా. తీసుకోండి'

శర్మపెట్లో ఉన్న కవరుతీసి, లాల్చీ ప్రక్కజేబులోవేసుకుని, బయటికి దారి తీశాడు.

అసలు తిన్నగా పోస్టాఫీసుకి పోవడమే శర్మ ఉద్దేశం. కాని దారిలో నాగేశ్వరం కనిపించి "కాఫీత్రాగుదాం, రా"మ్మన్నాడు.

ప్రాణమిత్రుడు కనక నాగేశ్వరంమాట తీసిలేక శర్మ బయలుదేరాడు. కాఫీ త్రాగి, వేరే ఇంకొక జేబులో ఉన్న చిల్లర తీసి బిల్లుచెల్లించి ఇద్దరూ బయటికి నడిచారు.

అక్కడనించి శర్మ పోస్టాఫీసుకి వెళ్దామనుకున్నాడు. కాని ఇంతలోతహసీల్దారు కనిపించాడు. అతనితో కొంత దూరం నడవటం తప్పలేదు. అక్కడనించి తప్పించుకుని వచ్చేసరికి శర్మకి తలప్రాణంతోకకి వచ్చింది. హుషారుగా పోస్టాఫీసుకి వచ్చాడు. జనం చాలా సమ్మర్దంగా ఉన్నారక్కడ. వాళ్లందరినీ తప్పించుకుని, అతి కష్టంతో కౌంటర్ దగ్గరకివెళ్ళి ఒక మనియార్డర్ ఫారమ్ తీసుకున్నాడు శర్మ.


కాలమ్స్ అన్నీ నింపి డబ్బుతీద్దామని చొక్కాజేబులో చెయ్యిపెట్టేసరికి ఆ చెయ్యి అడ్డూ ఆపూ లేకుండా వెళ్లి ధోవతితో సంబంధం కలుగజేసుకుంది. తృళ్లిపడి, మనియార్డర్ ఫారమ్ అలాగే వదిలి, శర్మరెండు చేతులూ రెండు జేబులలోనూ వెదికాడు; కాని, ఏమీ ఫలితం కనిపించలేదు. దేవతలూ రాక్షసులూ పట్టుపట్టి తన అదృష్టాలని ఆపుతున్నారా అని ప్రశ్నార్థకంగా చూచాడు శర్మ ఆకాశం వేపు...అక్కడ అతని కెవ్వరూ కనిపించక తన చుట్టూ చూచుకున్నాడు; అక్కడ అందరూ కనిపించినా ఎవ్వరూ అతనికి జవాబు ఇవ్వలేదు. పైగా,

'ఏమిపోయిందండీ?' అన్నారొకరు...


'జేబు కొట్టేశారు కాబోలు' అన్నారింకొకరు...ఆయన అలాగ అనగానే చుట్టూ ఉన్నవారంతా తమ జేబులు గుండెలని బాగా తడిమిచూసుకుని అవీ, వాటిలోనివీ భద్రంగాఉన్న విషయం ధృవపరచుకున్నారు...ఈలోగా కొంత మందికి గుండె ఆగినంత పనిఅయి, ఆ విషయం ధృవపడడం జరిగాక మళ్లా కొట్టుకోసాగింది.

అంతా శర్మచుట్టూ మూగారు; అందరూ అతనిని ఏమిటిపోయినదీ, ఎంతపోయినదీ అడుగుతున్నారు. కాని అతను జవాబు చెప్పే స్థితిలో లేడని తెలుసుకొని ఎవరి మట్టుకువారే ఏదో సర్దుకొంటున్నారు. సర్వమూ పోయాక మనిషి ఎలాగ ఉండాలో శర్మ ఆ క్షణంలో అలాగ ఉన్నాడు. 'ప్రపంచం గురించి నీ ఉద్దేశం ఏమిటి?' అని ఎవరేనా అతని నప్పుడు ప్రశ్నించి, ఆ ప్రశ్న అతనికి వినిపించి, అతను జవాబిస్తే, బహుశా... 'ప్రపంచం అంటే జేబు దొంగలతోనూ, రాక్షసులతోనూ కూడిన నరకం' అని ప్రత్యుత్తరం ఇచ్చేవాడు!

ఏమైనా, శర్మ ఆ నిముషంలో పూర్తిగా వేదాంతి అయిపోయాడు.



"నూరురూపాయలు నాజీవితంలో ఏమాత్రం విలువంటావు?"



అదృష్టం, యోగం అనేవి వింతో మహిమ కలవని అతను అంగీకరించాడు. పార్వతి మాటలు జ్ఞాపకం వచ్చి తలతడుముకుని, ఇంటిత్రోవ పట్టాడు...తేలికైన జేబుతో; బరువెక్కిన గుండెలతో అడుగడుగునా అతను ఏదో నేరం చేసినట్లూ, పార్వతియెదుట తలఎత్తలేనట్లూ బాధపడుతున్నాడు.

మెట్లెక్కుతూంటె శర్మకి ఒక ఆలోచన తట్టింది...తనకి ఆ నూరుగూపాయీలూ అనుభవించే యోగం ఉంటే, ఆ మొత్తం పోక పోను. కాని ఎలాగా పోయింది కనుక దానిని పజిల్సు ఎడిటర్ తినడంకంటె ఈ సామాన్యుడు తినడం చాలా మంచిది! ఈ ఉద్దేశం తట్టగానే అతను చిన్నగా నవ్వాడు; చక్కటి కథ! మంచి చేతగానితనం!

సిగ్గుపడుతో శర్మ తలుపుకొట్టాడు. కొంచెం సేపట్లో పార్వతి వచ్చి తలుపు తియ్యగానే తలవంచుకుని అతను లోపలికి నడిచాడు...ఆమె మాటే వినిఉంటే...!

'అలా ఉన్నారేం?......డబ్బుపంపే శారా?'

ఏదో బట్ట మడతపెడుతూ పార్వతి అడిగింది...అతను తనని ఆ ప్రశ్న వేసుకొన్నాడు. కొంచెం ఆగి...

'ఎవరికి?' అడిగాడు.

అర్థంకానట్టు నవ్వింది పార్వతి...... అతన్ని చూడడంమాని, మళ్ళా విడమరచి అడిగింది...

'డబ్బు-పజిలుకి పంపలేదూ?'

'పంపాను-డబ్బు పంపాను...'

'మరి ఎంట్రీలు?'

అతను చేతిలోని ప్యాకెట్ క్రింద పడేశాడు. అది ఎంట్రీలు ఉన్న కవరు... పార్వతి ఆశ్చర్యంగా చూసింది.

'కేపటితో గడువుసరి కాబోలు?'

'సరే......'

'మరి డబ్బు పంపి ఇవి ఎందుకు పంపలేదు?'

'డబ్బువాళ్ళకి పంపలేదు...'

'మరి?...మరి!'

కత్తిరించిన జేబులోంచి చెయ్యి పైకి పెట్టి చూపాడు శర్మ...పార్వతికి అర్థమై త్రుళ్ళిపడింది.

'పోయిందా?'

'ఔను...'

'రోజులు!!'

'అవును...కష్టపడి నా ఫలందక్కని... రోజులు!'

అతను భోజనంచేసి ఆఫీసుకి బయలుదేరాడు. అక్కడ అందరికీ 'ఆ విషయం' తెల్సిపోయింది.

'పోలీస్ రిపోర్టు ఇయ్యి' అన్నాడొక మిత్రుడు.

'ప్రశ్న చెప్పించు. పల్లెలో మంచి జ్యోతిష్కులు ఉంటారు' అన్నాడింకొక మిత్రుడు.

అన్నిటికీ శర్మ చిరునవ్వు సమాధానంగా ఇచ్చి కలం తీశాడు.

* * *

పార్వతికి కళ్ళనీళ్లు తిరిగాయి.

డబ్బు పోయిందని కాదు; శర్మ అంత బాధ పడవలసివచ్చినందుకు. ఆ నూరూ పజిల్లో పోతే ఆ బాధ లేదు...కాని...

తను శర్మని వివాహం చేసుకొనేసరికి ఈ పరిస్థితి లేదు......నాలుగేళ్ళ క్రిందట అతనికి ఇంకా ఎక్కువ ఆస్తి ఉండేది.

ఆలోచిస్తూ, పార్వతి చాకలి తెచ్చిన బట్టలు సర్దడానికి పెట్టె సర్దుతూంది. పరధ్యానంగా పెళ్లినాటి ఫోటోకోసం వెతుకుతూ బట్టలన్నీ ఈవల పడేసింది.

అడుగున ఉన్న కవరు తీసింది. అందులోనే ఆ ఫోటో, రెండేళ్ళ క్రిందట పుట్టి నెలదు చనిపోయిన పాపఫోటో ఉండాలి. ఆ పటాలు రెండూ గతానివే! ఇప్పుడు విప్పకూడదనుకుంది... కాని విప్పింది...

నూరు రూపాయీల నోటు!!

తన కళ్ళని తానే నమ్మలేక పార్వతి మరోసారి చూసింది. అచ్చంగా నూరు రూపాయీల నోటు!

అయితే—!......పార్వతి ఆలోచించింది...ఆ ఫోటోలున్న కవరు శర్మ జేబులో పెట్టుకున్నాడు కాబోలు!... ఆ ఫోటోలు...అయ్యో!

పార్వతి పెద్దకళ్లనిండా నీరు నిండింది. తన ప్రాణప్రదంగా గడించిన బంగారు రోజులకి జ్ఞాపకచిహ్నంగా చూసుకొంటోన్న ఆ ఫోటోలు పోయాయా?

కాని, పార్వతి వెంటనే తేరుకుంది. ఇప్పు డేమిటి చెయ్యాలి?

ఈ నూరురూపాయిలూ ఇచ్చేస్తే శర్మ తప్పక పజిల్సుకి పంపేస్తాడు. పజిల్సులో డబ్బురావడానికి అవి రోజులు కావు. జరిగే విషయాలన్నీ అందుకు సాక్ష్యమే.

కనుక, ఈ రెండురోజులూ ఊరుకుని ఆ తరవాత అతనికా డబ్బు ఇచ్చేస్తే సరిపోతుంది. 880 వ నంబరువస్తే ఆరు దురదృష్టసంఖ్య కనక అతను ఆ పని పజిల్సుకి కట్టడు. తరవాత చూసుకోవచ్చు.

కాని, ఈ ఎంట్రీలలో ఆల్ కరెక్ట్ ఉంటే?

పార్వతి ఒక్కసారి కంపించింది... నిజంగా ఉంటే?

కాని మరుక్షణం దేవతలూ, కర్మ, రోజులూ ఆమెని అలాటి విషయమేమీ జరుగబోదని నప్పించినై...కాని... ఏమో?

ఆ కవరు మళ్లా మామూలుగా పెట్టె అడుగున పెట్టి పూర్తిచేసిఉన్న ఎంట్రీలు కూడా బట్టలఅడుగున దాచి పార్వతి పెట్టె సర్దడం పూర్తి చేసింది.

ఆ పని పూర్తిచేసి మంచంమీద పడుకోబోయేసరికి ఆమెకి జరిగినదంతా ఒకసారి జ్ఞప్తికివచ్చింది...ఆనాటి స్థితి పాప...

పార్వతికి కళ్లనీళ్ళు తిరిగాయి.

*　　*　　*

రాత్రి శర్మ భోంచేస్తూంటే అతను పార్వతి ఎందుకో చాలా బాధపడుతూందని గ్రహించాడు...అతను ఆఫీసు పనిలో చాలావరకు తన విచారాన్ని తగ్గించుకున్నాడు. కాని, పార్వతి ముఖంలోని దుఃఖం అతనికి మళ్లా బాధకలిగించింది.

ఎలాగో భోజనాలు ముగించి, పార్వతి వచ్చింది.

తమలపాకులు పుచ్చుకుంటూ, ఆమె కళ్ళల్లోకి చూస్తూ శర్మ సానునయంగా అన్నాడు...

'కష్టాలు కలకాలం కాపురం ఉంటాయా పార్వతీ?'

పార్వతి మాటలాడలేదు. జరిగిన సంగతి చెప్పడమా మానడమా అని ఆమె రభసపడుతోంది...అడుగడుగునా అలాగ చెయ్యడంలోని లాభనష్టాలు ఆమె కళ్లకి కనిపిస్తున్నాయ్. అందుచేత పరధ్యానంగా... 'మన అదృష్టం' అని అన్నది.

'నూరురూపాయిలు నాజీవితంలో ఏమాత్రం విలువ ఉన్నవంటావు?... నువ్వు వాటికోసం కంటతినీరు పెట్టడం.'

పార్వతి తలఎత్తి చూచింది విషాదంగా.

'అదృష్టం ఉంటే అదే వస్తుందని నువ్వే చెప్పావుగా! నువ్వే దాన్ని కాదంటే ఎలాగ?...'

'నేను డబ్బుకోసం విచారించడం లేదు' గాద్గదికంగానే అంది పార్వతి. 'మనదురదృష్టాన్నిగురించే విచారిస్తున్నాను. అదృష్టం దానంతట అదివస్తుందని...మీరు అంటారా?'

హటాత్తుగా వచ్చిన ఈ ప్రశ్నలోని గాంభీర్యానికి కొంచెం ఆశ్చర్యపడ్డాడు శర్మ. కొంచెంసేపు ఆలోచించి...

'అదృష్టమూ, దురదృష్టమూ వాటంతట అవే వస్తాయని నిశ్చయంగా అంటాను' అన్నాడు.

'సరే...అయితే మరేమయినా మంచి విషయంగూర్చి మాటలాడండి...'

తెల్లబోయాడు శర్మ, పార్వతికి పిచ్చి ఎత్తిందా? తీక్ష్ణంగా ఆమె కళ్లలోకి చూచాడు...పార్వతికి మతి చలించిందా?

'సినీమాకి పోదామా?'

'పద'

ఆరాత్రి గడిచిపోయింది. మరునాడు సాయంత్రం ఆఫీసునించి వచ్చేసరికి శర్మ చాలా సంతోషంగా ఉన్నాడు. పార్వతి అతని ఉత్సాహం చూసి తెల్లబోయింది.

జేబులోంచి ఒక కవరు తీసి పైన పడేస్తూ, 'అది చదువుపార్వతీ' అన్నాడు.

పార్వతి చదివింది...

శ్రీ శర్మగారికి...

మీరు కాఫీహొటల్ నుంచి వస్తూంటే నేను జేబు కత్తిరించాను...డబ్బు చాలా అవసరమై. కాని, నాకు దొరికిన కవర్ లో డబ్బు లేదు...ఈ ఫోటోలు దొరికాయి.

గతించిన దినాలని వీటిలో జాగ్రత చేసికొన్న మీ ఆనందం పాడు చెయ్యను. అందుకే వీటిని తిరిగి పంపిస్తున్నాను.

భవదీయుడు

— ! —

పార్వతి కళ్ళల్లో ఆనందం చిందులాడింది...

'ఆ ఫోటో లేవీ?' అంది ఆతృతగా... శర్మ ఇచ్చాడు. తీసుకుంది. ఒక్కసారి గుండెలు మండినట్లు అనిపించింది పాప ఫోటో చూడగానే.

శర్మ పార్వతిని సముదాయిస్తూ...'అలా విచారిస్తే ఎలాగ పార్వతీ?...నువ్వే చెప్పావుగా అదృష్టమూ దురదృష్టమూ వాటంతట అవే వస్తాయని! ఏమీ చెయ్యలేనిదానికి..'

పార్వతి తల వంచుకుంది. కళ్ళని తుడుచుకుంది. జాగ్రత్తగా మళ్లా పెట్టెలో పెట్టింది.

కొంచెంసేపు నిశ్శబ్దంగా గడిచిపోయేక శర్మ......'కాఫీ ఇస్తావా పార్వతీ?' అన్నాడు.

తృళ్ళిపడి, పార్వతి తొందరగా ఫ్లాస్కులో ఉంచిన కాఫీ కప్పులో పోసి ఇచ్చింది

కొంచెం కాఫీ తాగి పార్వతి కళ్ళల్లోకి చూస్తూ......'ఆ కూపన్లు ఏం చేశావు?' అన్నాడు.

పార్వతి తెల్లబోయింది......ఏమిటి చెప్పడమో ఆమెకి బోధపడలేదు. ఏదో చెప్పడానికి నిశ్చయించేసరికి ఆలశ్యం అవడంవల్ల నిశ్శబ్దంగా ఊరుకుంది. అంతరంగంలో రేగుతున్న దుఃఖమూ, ఈ సందిగ్ధతా ఆ కింకర్తవ్యతా మూఢురాలిని నేరస్థురాలిలాగా చూపుతున్నాయి.

'—కొంపతీసి కాల్చి లేదు కదా?'

శర్మగొంతుకలో ఆతృత అంతా కనిపిస్తోంది. ఆ ప్రశ్నే పార్వతికి సమాధానాన్ని వప్ప చెప్పింది. నిశ్శబ్దం కొనసాగించింది పార్వతి.

ఆశలు అడుగంటినట్లు పార్వతిని చూస్తూ..."నేననుకున్నాను...శని వెంట తరుముతూంది' అని, సగం తాగిన కాఫీ కిందపెట్టి తొందరగా బయటికి నడిచాడు శర్మ.

* * *

రాత్రి విసురుగా ఇంటికి వచ్చాడు శర్మ ఊరంతా తిరిగి, ఎక్కడా ఖాళీ కూపన్లు దొరకక అతను చిరాకుగా ఇంటికి వచ్చాడు. వస్తూ వెళ్లి తన గదిలో కూర్చున్నాడు.

కాలం జరుగుతూంది; గడియారం తిరుగుతూంది. పది కొట్టింది.

'భోజనానికి లేవరూ?' అంది పార్వతి భయపడుతూనే అతనిగది గుమ్మందగ్గరకి వెళ్లి.

శర్మ గిరుక్కున లేచి, 'తిండి ఒక్కటే తక్కువైంది!...ఆ నూరురూపాయిలూ కూడా ఎందుకు పొయ్యిలో పెట్టలేదు?... నువ్వుపోయి భోజనం చెయ్యి. నాకాకలి కావడం లేదు' అన్నాడు.

'వాటిని చూస్తే మీరు చికాకుపడతారనే కాల్చేశాను. నేనేమి చేసేది?' అంది పార్వతి.

'హుఁ. నువ్వేమి చేస్తావు! నాకు తెల్సును ఈ పజిల్‌లో ప్రైజ్ రాకతప్పదని...బంగారం తాకట్టుపెట్టైనా పజిల్‌కి కట్టితీరుదామనుకున్నాను...నువ్వు రాక్షసిలాగ—వెధవ వందకోసం...'

శర్మ కోపం ఆగలేదు. తొందరగా పెట్టి తీసి రెండు కవర్లూ తీశాడు—అందులో ఫోటోలున్న కవరుని పెట్టిలో పడేసి, రెండకవరుని తీసికెళ్లి బెడ్‌లాంపులో అంటించాడు...

'వెధవ వందరూపాయిలు! మీ నాన్న దగ్గర ఎన్ని వేలిలాటివి? నా వంద మాత్రమే నీకు కావాలా?...నాకు మిగుల పెడతావు! ఇంటర్‌మీడియెట్ ప్యాసయ్యావు. ఆ మాత్రం బుద్ధి లేదూ?'

కవర్ కాలింది...మంట ఒక్కసారి వచ్చి, పార్వతి కళ్లలో ప్రతిఫలించి, వాటిలోని ఆర్ద్రతని వ్యక్తంచేసింది. కవరంతా కాలేక ఆనుసిని చేతిలో వేసుకున్నాడు శర్మ.

'నీ అన్నలూ, తండ్రీ ధనవంతులు... నేను బీదవాడిని. ఇది మాకు భేదం—అంతేకదూ?'

పార్వతికి కొంచెం కోపం వచ్చింది. తను చెయ్యని నేరాలకి తనని ఎన్నివిధాలుగా శిక్షిస్తున్నాడు!

'నేనలాగ ఏమీ అనలేదు.'

'ఔను...నువ్వనలేదు...కాని నీ ఉద్దేశం అదే. వెధవ నూరురూపాయిలు తగలపెడతానని కూపనులు కాల్చేశావు... ఇప్పుడు డబ్బు మిగిలిందా?'

'నేనెందుకు కాల్చలేదు. డబ్బు పోలేదని తెలియకముందే ఆ పనిచేశాను... మీరే గంటకొకమాట ఆడి, ఊరికే బాధపడి నన్ను బాధపెడుతున్నారు.'

'ఔనౌను. బాధేగా ఉన్నమాటంటే, నేను చెప్పకముందే నీకు తెలుసును డబ్బు పోలేదని...ఇంక మాయచెయ్యకు అనవసరంగామాటలు మీరావంటే—'

'ఏమిటి చేస్తారు—?'

'నాకు తెల్సును నువ్వా మాట అంటా

వని.. ముండే. నీ ఆస్తికి జడిసి నీకు లొంగుతాననుకుంటున్నావు కాబోలు...అంత పౌరుషం ఉందేం? 'ఏం చేస్తా' నని అడుగుతున్నావా?'

పార్వతి దుఃఖాన్ని ఆపుకుంటూంది... ఒక వేపున తన పరిస్థితికి ఆమెకి అసహ్యం వేస్తూంది. క్రమంగా కోపం ఎక్కువ అవుతూంది. గాద్గదికంగానే.. 'నా కేమీ దాసీ పని కాదిక్కడ. నిన్నను అంతా అదృష్టంమీద ఉంటుందని మీరే అన్నారు. ఇవేళ నేనేదో చేశానని ఊరికే తిడుతున్నారు. మీ ఇష్టం వచ్చినట్లు నన్నూ మా వాళ్ళనీ తిడుతున్నారు. సంవత్సరం అయింది అన్నయ్యా మీరూ మాటలు అనుకుని. ఊరిలో ఉన్నా ఒక్కసారి వెళ్ళకుండా మీ ఇష్టం చెల్లిస్తే ఇది శాస్తి...'

ఆమెకి ఉద్రేకం ఎక్కువౌతూంది అతని అహంకారం చూసేకొలది. అతనికి ఉడుకుమోతుతనమూ ఎక్కువైంది—డబ్బూ పోయింది—భార్యచేత మాటలూ పడుతున్నాడు!

'నోర్ముయ్' అన్నాడు కోపం అంతా చూపిస్తూ.

'మూసుకుంటాను...తప్పు తమదీ, శిక్ష నాదీను...ఏమైనా అంటే—'

శర్మ ధడాలున చెంపమీద కొట్టాడు పార్వతిని—బలంగా వస్తూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ ఆమె తన గదిలోకి పోయి మంచంమీద పడుకుంది. రాత్రి గడుస్తూంది.

* * *

ఉదయం అయేసరికి లేచి శర్మ ముఖం కడుక్కుని వీధిలోకి నడిచాడు. గదిలో గోడలకి కాగితంమని కనిపించింది...అతని గుండె ఝల్లుమంది. తొందరగా బయటికి వచ్చాడు అవతల పనిచేస్తున్న పార్వతి కంటపడకుండా.

హోటల్లో కొంచెం టిఫిన్ తిని, కాఫీ త్రాగి ఆఫీసుకి వెళ్లి కూర్చున్నాడు. బంట్రోతు తప్ప ఇంకెవరూ రాలేదు. కుర్చీలో జేరబడి రాత్రి జరిగినదంతా ఆలోచిస్తున్నాడు. ఆలోచించిన కొద్దీ అతనికి స్వీయప్రవర్తనలోని నైచ్యం వ్యక్తం అవుతూంది పార్వతి తాను చికాకు పడకుండా ఉండాలని ఆ కూపన్ను తగలపెట్టి ఉంటుంది. తాను ఆమెకి అతీతమైన పరిస్థితుల్లో జరిగినవాటికి ఆమెని బాధ్యురాలిగా చేసి తిట్టి కొట్టాడు ఆమెని—

అతను చాలా సిగ్గుపడ్డాడు జరిగిన దానికి. పార్వతికి క్షమాపణ చెప్పడానికి అంతరంగం తొందర పెట్టసాగింది.

లేచాడు, రెండడుగులు వేశాడు.

భార్యకి క్షమాపణ చెప్పడమా? భర్త చెయ్యి చికాకుల్లో మునిగి ఉంటే అతను అన్న ప్రతీమాటకీ ఎదిరించి జవాబు చెప్పడమా? సిగ్గు ఉండక్కర్లా?

వెనకదిరిగి మళ్ళా కుర్చీలో కూర్చున్నాడు. ఏమిటి చెయ్యడం అని అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. విధీ, పౌరుషమూ మధ్యయుద్ధం జరుగుతోంది.

విధి గెలిచింది. పార్వతికి క్షమాపణ చెప్పడానికి నిశ్చయించి తొందరగా ఇంటికి బయలుదేరాడు శర్మ 'పాపం, రాత్రికూడా ఆమె భోజనం చేసిఉండదు... ఉదయం కాఫీ త్రాగిందో లేదో' అని ఆలోచిస్తూ వేగంగా ఇల్లు చేరుకున్నాడు.

తలుపు తాళం పెట్టి ఉంది. అతను తెల్లబోయి చూస్తూంటే ప్రక్క ఇంటి గుమస్తాగారి అమ్మాయి తాళాలు పట్టుకుని వచ్చి ఇచ్చి...' అక్క వెళ్లిపోయింది...ఇవిగో తాళాలు' అని వాటి నక్కడ పడేసి పారిపోయింది.

ఆ పదేళ్ళపిల్ల మాటలు అతనికి తిట్లలాగ వినిపించాయి... "ఆ చుట్టు ప్రక్కలవాళ్ళందరికీ వినిపించి" ఉంటాయి గతరాత్రి జరిగిన మాటలు. అని అనుకునేసరికి అతని రక్తం ఒక్కసారి గడ్డకట్టినట్లయింది.

తాళాలు జేబులో వేసుకుని తొందరగా అతను రైలుస్టేషన్‌కి నడిచాడు. రైలు పది నిముషాలైవెళ్లిపోయింది. నీరసంగా వెనుదిరిగి ఇంటికి వెళ్లాడు.

ఇల్లంతా శుభ్రంగా అమర్చి, శుభ్రం చేసి వెళ్లింది పార్వతి!...భార్య.. అతని గుండెలు తిరుగబడ్డాయి. తన ప్రవర్తనకి అతను సిగ్గుపడడంనుంచి బాధపడడం మొదలు పెట్టాడు. చదువుకున్నా అణకువగా తన కోర్కెలకి అనుగుణంగా వర్తిస్తూన్న ఆమెని తన చేతులతో కొట్టి పంపాడు!

ఏమైనా ఉత్తరం ఉంచి వెళ్లిందేమోనని ఇల్లంతా వెదికాడు. గదిలో టేబిల్‌మీద ఫ్లాస్కుకింద చీటి కనిపించింది...వణుకుతూన్న చేతులతో తీసి, చదువుకున్నాడు!

'స్త్రీని గౌరవంగా కాకపోయినా, నాతినీచంగానైనా చూడడం మీరు నేర్చుకొంటే, మళ్లా నేను రావడం జరుగుతుంది. తిన్నగా ఇంటికే వెళ్తాను. మా వాళ్లకి మీరనుకుంటూన్న గర్వమూ స్వోత్కర్షా లేవని మనవి. మీరంటే దైవంగా చూసుకుంటూన్న ఆ అమాయకుల నిజరూపం

చూడడానికైనా మీరక్కడికి రావచ్చును.
పార్వతి

లోకాలన్నీ తలక్రిందు లౌతున్నాయి. ఫ్లాస్కు బరువుగా ఉందని, మూత తీశారు...ఫ్లాస్కు నిండా కాఫీ ఉంది! ...పార్వతి!...

శర్మకళ్లు మొదటిసారి నిజమైన పశ్చాత్తాపం కలిగించే ఆర్ద్రతని పొందాయి. విషాదంఅతన్ని ముంచివేసింది.. బరువుగా మంచంమీద పడుకున్నాడు. ప్రపంచంలోని శాపాలన్ని అతనికి వినిపిస్తున్నాయ్ పార్వతి పటం మాత్రం ఎదురుగా నవ్వుతూ కనిపిస్తూ కొంత శాంతిని ఇస్తోంది.

* * *

నాలుగు రోజులు గడిచాయి. శర్మ నెమ్మదిగా మనస్సులో రేగుతూన్న తుఫానుకి అలవాటు పడుతున్నాడు. ఎన్నో సార్లు వెళ్లి, క్షమాపణ చెప్పి పార్వతిని తీసుకువద్దామని అనుకున్నాడు...కాని... అతని మనస్సు అంగీకరించలేదు. పార్వతి దగ్గర ఓటమిని అంగీకరించడానికి అతను వెనుదియ్యడు. కాని, ఇప్పుడు అత్తవారింటికి వెళ్తే ఇంకొక ఓటమినికూడా అంగీకరించాల్సి ఉంటుంది.

—అది ఇలాగ జరిగింది...

పార్వతి అన్న కృష్ణమూర్తి పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. నెలకు ఆరు వందల రూపాయిల జీతం.

రెండు సంవత్సరాల చిల్లర అయింది. పార్వతిని పుట్టినింటికి పంపినప్పుడు ఏదో పండగకి శర్మకూడా అక్కడికి వెళ్లాడు: రాత్రి అంతా భోజనాలు చేసి కూర్చున్నారు.

'కారు కొందా మనుకుంటున్నాను బావా' అన్నాడు కృష్ణమూర్తి.

'చాలా బాగుంది. ఏది కొంటున్నావు?' అన్నాడు శర్మ కొంచెంగా తిన్న దెబ్బ బయటికి కనిపించకుండా. కృష్ణమూర్తి ఈ విషయం తనతో చెప్పడం తన దారిద్ర్యాన్ని వెక్కిరించాలనే ఉద్దేశంతోనే నని అతననుకున్నాడు.

ఇంతటిలో తమలపాకులు తెచ్చి ఇస్తోన్న శ్యామల కిలకిల నవ్వుతూ, 'బావగారు చాలా కార్లుకొన్నారు. చెప్పండి ఏది కొంటేబాగుంటుందో!' అంది వదినా చెల్లెయవ్వనం బావగారితో పరియాచకాన్ని పురికొల్పగా.

అంతా నవ్వారు. శర్మకికోపంవచ్చింది.

'నేను పెళ్ళినాడు భూములమీద అప్పులున్నాయనీ, దావాలున్నాయనీ చెప్పలేదూ?' అన్నాడతను తీవ్రంగా.

అంతా తెల్లబోయారు. శ్యామల పరిస్థితిని గ్రహించి, 'నేను అంతగా ఉడుక్కుంటారనుకోలేదు...' అంది నెమ్మదిగా.

పరిస్థితి ఇంకా పాడయింది...వాళ్లంతాతనని హేళన చేస్తున్నారనే నిశ్చయంతో, పార్వతిని తీసుకుని మరునాడు ఉదయమే ఇంటికివచ్చాడు. శర్మ నాటి నించీ ఆగడప వీరూ ఈ గడప వారూ తొక్కలేదు.

అందుకే ఈనాడు శర్మ అత్తవారింటికి పోలేకుండా ఉన్నాడు. రోజులుమాత్రం గడుస్తూనే ఉన్నాయి.

* * *

పార్వతి వెళ్లిపోయి ఇరవై రోజులయిపోయింది. నేటికీ ఒక ఉత్తరంలేదు. కోపంకొద్దీ వెళ్లిపోయినా, వీలైనంత త్వరలో వచ్చేస్తుంది అనుకున్నాడు కాని పార్వతి ఒక్క ఉత్తరమైనా వ్రాయకుండా ఇలాగ చేస్తుందని అతననుకోలేదు.

పోనీ, వెళ్లి తీసుకువస్తే?

శర్మ ఈసారి ఈ ఆలోచనకి కొంచెం వ్యధి ఇచ్చాడు...నిజంగా తన మామగారూ, ఇతరులూ, తనంటే అలాటి నీచ భావాలు కలిగిఉండడం లేదేమో? మరదలు అన్న మాటలకి ఇంత పట్టింపు ఎందుకు? అప్పుడే ఏదో సమాధానం ఇస్తే సరిపోయేది!

అసలు, కథ ఇంతదూరం ఎందుకు నడవాలి? ఆరాత్రి తానెందుకంత పార్వతిని అల్లరి పెట్టాలి? పార్వతికి మాత్రం అంత తొందరగా కోపం ఎందుకు రావాలి?

శర్మ! ఛీ...ఎంత చికాకుగా ఉంది! ఇంట్లో ఎవ్వరూ లేకుండా, ఏకాకిగా బ్రతకడం...

పేపర్ బోయ్ పేపర్ వదేసి పోయాడు...శర్మ మాత్రం మామగారి ఇంటికి వెళ్లడమా మానడమా అనే ఆలోచనలోనే కొట్టుకుంటున్నాడు...

ఆలోచన ఎంతకీ తెగకపోతే రాత్రికి వాయిదా వేశాడు...'బయలుదేరడమే శ్రేయస్కరం; అన్నీ సరిదిద్దుతాను' అనుకున్నాడు శర్మ...

మరుక్షణం అక్కడ జరుగబోయేది తల్చుకుని, ఇంక ఆలోచన మానేశాడు శర్మ.

కాలక్షేపం కోసం పేపర్ తీశాడు. 'లక్ పజిల్స్' వారి 359వ పజిల్కి సొల్యూషన్ మొదటిపేజీలో ఉంది.

అతనికేదో తట్టింది...పరిగెట్టి వెళ్లిఅవలి గదిలో పుస్తకాలమధ్య దాచిన చిత్తుకాపీలు తీశాడు ఎంట్రీలవి.

తొందరగా తీశాడు ఒకొక్కటి, అల్ కరెక్ట్ సొల్యూషన్ కనిపించింది వాటిలో.

అన్ని ఎంట్రీలనీ విసిరికొట్టాడు...అతనికి ఏడుపు వచ్చింది...ఏభై వేలరూపాయీలు పోయాయి పార్వతి మూర్ఖత్వం చేత!

అతను జుత్తుపీక్కున్నాడు...తనదురదృష్టం!

ఒక్కసారి రాక్షసులూ, రాసులూ తన మీదపడుతూన్నట్లు బాధపడ్డాడు శర్మ. లోకంలోని ప్రతీశాపమూ తనని వెంటాడుతూన్నట్లనిపించింది అతనికి.

అతనిలోని నాడులన్నీ తీవ్రంగా పని చేయడం మొదలుపెట్టాయి. నూరు రూపాయీలకోసం ఏభైవేలని వదులుకున్నాడు!

దురదృష్టం! పదిసార్లు స్మరించుకున్నాడు...పార్వతి మీద అతనికి చాలా కోపంవచ్చింది. లోకం అంతా తల్లక్రిందులైపోతోంది.

క్రమంగా అతనికి ఉష్ణం హెచ్చడం ప్రారంభించింది. తలనొప్పి హెచ్చవసాగింది. సెలవుకాగితం ఆఫీసుకి పంపించి పడుకున్నాడు.

ఇంక అతని ఏకాకిత్వం అతన్ని బాధించసాగింది...అడుగులకి మడుగులువత్తి అనుసరించేభార్య తనని పరిత్యజించడం చాలా కష్టమనిపించింది శర్మకి. పోయిన డబ్బు ఎలాగాపోయింది-సంసారమన్నా నిలుపుకోక...

అతని ఆలోచనలు అనేక పంథాలలో నడుస్తున్నాయి.

ఒక క్షణంలో అతను పార్వతిని క్షమ కోరుకుంటానని నిర్ణయించుకుంటున్నాడు. ఇంకొక క్షణంలో ఆమె చేసిన నేరానికి శిక్ష ఆమె ముఖం చూడకపోవడమే నని అనుకుంటున్నాడు.

ఒంట్లో బాధ హెచ్చసాగింది. చూడడానికి వచ్చిన తోటి గుమాస్తా శేషగిరి డాక్టర్ని తీసుకువచ్చాడు. మందిచ్చి, డాక్టర్ మరేం ప్రమాదం లేదనీ, సహాయం కోసం భార్యకి కబురు పంపమనీ చెప్పి వెళ్లిపోయాడు.

శేషగిరి పార్వతి అన్నగారి నడిగి, అడ్రస్ తెలుసుకుని టెలిగ్రాం ఇచ్చాడు వెంటనే రమ్మని. ఈలోపున కృష్ణమూర్తి, భార్యా, వచ్చి శర్మకి సహాయం చెయ్యసాగారు. మొదట ఇదేమీ శర్మకి నచ్చలేదు. కాని, వాళ్లు చేస్తూన్న సహాయం యొక్క అవసరమూ, లోకనింద యొక్క భయమూ అతన్ని నోరెత్తనివ్వలేదు.

* * *

కొంచెం కాఫీ త్రాగి ఆలోచిస్తూ కుర్చీలో పడుకున్న శర్మ పార్వతిని చూసే సరికి అదిరి పడ్డాడు.

'వంట్లో ఎలాగ ఉందండీ?' అన్నది పార్వతి ఆత్రుతగా గదిలోకి వస్తూ.

కొంచెం ఆగి, 'ఎలా ఉంటే ఏం?... కాని, నీ కెలాగ తెల్సింది?' అన్నాడు శర్మ.

పార్వతి చెప్పింది.

'పాపం! పంతం వదిలేశావేం?...నా ఎంట్రీకి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది తెలుసా? నీ మూలంగా అంతా పాడయింది'

నీరసమూ, ప్రస్తుత పరిస్థితులూ ఏవీ అతను ఈ మాటలని ఉద్రేకంగా అనడానికి అడ్డం రాలేదు. పార్వతి ఆశ్చర్యంగా... 'నిజం ?!' అంది.

'రాక్షసివి' అన్నాడు శర్మ బాధగా కోపంగా.

సరిగ్గా అదే సమయంలో టెలిగ్రాం బంట్రోతు కేక వినిపించింది. పార్వతి నవ్వుతూ టెలిగ్రాం తీసుకుని శర్మకి ఇచ్చింది. 'లక్ ఏజిల్స్'లో 50000/- గెలిచినందుకు అభినందలు అది.

'ఈ రోజు ఏప్రియల్ ఫస్టు కాదూ? ఎవడో నా బాధని చూడడానికి దొంగ టెలిగ్రాం ఇచ్చాడు—నువ్వే నవ్వుతున్నావ్!'

(37-వ పేజీ చూడండి)



★ అమ్మలక్కలు ★

కవిరావు

★

ఊరుకు తూరుపు కోనేట్లో
ఉదకము దెచ్చే టందుకని,
అస్తమాన మయ్యేవేళ
అమ్మలక్కలట కేగారు.
పాలుపోక నా ముత్తైదుల్
గాలికబుర్లు సాగించారు.
మాటలసందున నొకవనిత
తోటియామెతో నిట్లంది.

"వదినా,వదినా!!విన్నావా, మీ
అన్నయ్యెంత సమర్థుండో?
వ్రాయగ మొదలిడి నారంటే
రవ్వలురాలిచి పోస్తారు.
ఎవ్వరుకారగానీ కున్నా
ఎంత వ్రాతగాడను కొన్నా?"-
ఇంతలోన నీళ్ళందుకొనే
పంతులు పెండ్లా మిదివింది.

"అల్లాగయితే కల్లాలా!
అందరు చదివేదాక వ్రాలా?
గొలుసుకట్టుతో మావారు
గరగర వ్రాసేకారంటే
వ్రాత తెలుసుకో వాలంటే
తాతలుదిగి రావాలింక."
ప్రక్కనుగల మరి యొకభామ
'పకపక' నగి యిట్లందుకొనెన్

"ఈయనెగొప్పనుకొంటే, యిక మా
యాయన నేమనుకోవాలి?
మాయాయన వ్రాసిన వ్రాత
తనకే తెలియదు తర్వాత."

ఇత్తరి నాబిడ చెప్పంగా
చిత్తయి పోయారందరునూ
'అదృష్టమంటే ఆమెదెలె'మ్మని
అమ్మలక్కలను కొన్నారు.

అచ్చరమంటే తెలియక మిడికే
అమ్మలక్కలీ విధిగానే,
కోతలుగోసే మగలను జూచుక
గొప్పగ లారమను కొంటారు

—

పక్షులు




గువ్వ

గువ్వ అందరికీ పరిచయమైన పక్షి. మన దేశంలో కొన్ని ప్రాంతాలలో ఎక్కువగాను, కొన్ని ప్రాంతాలలో అరుదుగాను కనిపిస్తుంది. మధ్యాహ్నపు ఎండ వేళల్లో దాక్కునేందుకు వీలుగా చెట్లు సమృద్ధిగా ఉన్న మైదాన ప్రాంతాలు, వ్యవసాయ క్షేత్రాలు దీనికి బాగా ఇష్టం. మనుషులంటే దీనికి భయం లేదు. ఇళ్లలోకి స్వేచ్ఛగా వస్తుంది. గుంపులుగా ఏర్పడి తిండి కోసం మట్టిగీరుతూ వుండటం చూడగలము. గింజలు, విత్తనాలు వీటికి ముఖ్యమైన ఆహారం. గువ్వలు ఎగరటం పావురాల మోస్తరుగానే వుంటుంది. వేగంగా, దృఢంగా ఎగురుతాయి. మగగువ్వ సాధారణంగా ఆడగువ్వ ముందు తన ప్రతాపం చూపించుకోటానికని తమా

(35-వ పేజీ చూడండి)

గద్దలు మానవ నివాసాల చుట్టుపక్కల ఎక్కువగా సంచరిస్తాయి. పట్టణాల్లో కసాయి దుకాణాలు, కూరగాయల మార్కెట్లు, పెంటకుప్పలు వున్న చోట్ల ఇది ప్రత్యక్షమౌతుంది. రేవు పట్టణాలలో ఓడల సమీపంలో కూడా గద్దల గుంపులు కనిపిస్తాయి. ఎంత ఎత్తున ఎగురుతున్నా సరే నేల మీద చచ్చిన ఎలిక లాంటి పదార్థమేది కనిపించినా తేలిగ్గా వేగంగా దిగివచ్చి ఎగరకొట్టుకొని పోతుంది. ఇది ప్రత్యేకంగా మాంసాహారి అనే చెప్పాలి. కోడి పిల్లలను బతకవ్వదు. పోషించవలసిన సొంత పిల్లలున్నప్పుడు గద్ద కోళ్ల గూడుల దగ్గిర్లో మసలటం చూడవచ్చు. సెప్టెంబరు మార్చి నెలల మధ్య గుడ్లు పెడతాయి. రెమ్మలు, ఇనపతీగెలు, గుడ్డ పీలికలు, చెత్త తీసుకువచ్చి వేదిక మోస్తరుగా గూడు కడతాయి. తాటి మొవ్వలలోనో, వంగల కొమ్మలలోనో గూడు నిర్మిస్తాయి, తడవకు రెండునుండి నాలుగు వరకూ గుడ్లు పెడతాయి.



లింకన్

రోజున ప్రపంచ దేశాలన్నిటిలోకీ అగ్రగణ్యమైన దేశం ఏదో తెలుసా? అమెరికా. ఉత్తర అమెరికా, దక్షిణమెరికా అని రెండు ఖండాలున్నాయని నువ్వు జాగ్రఫీ లో చదువుకున్నావు. అందులో ఉత్తరమెరికాలో మూడు దేశాలున్నాయి: కెనడా, అమెరిగా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో. అమెరికా సంయుక్త రాష్ట్రాలను గురించే నేనిప్పుడు చెప్పబోయేది.

అమెరికా ఖండాన్ని మొదటగా కనిపెట్టి, భూభాగాన్నంతా పరిశోధించినది ఇటలీ నావికుడు అమెరికా వెస్పూచీ అనేవాడు. అతని పేరు మీదుగానే ఆఖండానికి అమెరికా అనేపేరు వచ్చింది. ఆతరవాత యూరప్ ఖండం వాళ్లనేకులు అమెరికాకు పోయి అక్కడి అడవిజాతుల వాళ్లను ఓడించి, ఖండాన్నంతా ఆక్రమించుకుని, అక్కడే స్థిరపడి పోయారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలు ఉన్న ప్రదేశమంతా మొదట బ్రిటిష్ వాళ్ల అధీనంలో ఉండేది. కొంత కాలమయ్యాక సంయుక్త రాష్ట్రాలలో స్థిరపడి పోయిన యూరపియనులు బ్రిటన్‌తో యుద్ధంచేసి స్వాతంత్ర్యం సంపాదించుకున్నారు. 48 రాష్ట్రాలు కలిసి 'అమెరికా సంయుక్త రాష్ట్రాలు' అనే పేరుతో ఒకదేశంగా ఏర్పడ్డాయి ఈరోజున ఈ దేశం అన్ని విషయాల్లో కాకపోయినా డబ్బు, వ్యాపారం, సైన్యం, సైన్యబలం మొదలైన వాటిలో అన్ని దేశాలకంటే మిన్నగా వున్నది.

అమెరికా ఇంత గొప్పస్థితికి రావటానికి కొంతవరకూ కారణమైనవాడు అబ్రహాం లింకన్.



ఈయన 1 09 ఫిబ్రవరి 12 వతేదీన కెంటకీ రాష్ట్రంలో జన్మించాడు. తండ్రి వ్యవసాయం, వడ్రంగం చేసేవాడు. కుమారుడికి స్కూల్లో ఆట్టే చదువు చెప్పించలేదు. కాని అబ్రహాం స్వతహాగా చదువులో ఆసక్తిఉన్నవాడవటంచేత దొరికిన పుస్తకమల్లా చదివేవాడు. 20 ఏళ్లు నిండే టప్పటికి ఇంగ్లీషు భాషలోవున్న ప్రసిద్ధ గ్రంథాలన్నీ చదివాడు. 1832 లో 23 ఏళ్ల వయస్సప్పుడు రాజకీయాల్లో ప్రవేశించాడు. ఇల్లినాయిస్ రాష్ట్ర శాసన సభకు పోటీ చేసి ఓడిపోయాడు. రెండేళ్ల తరవాత మళ్ళీ పోటీచేసి ఈసారి నెగ్గాడు. అప్పుడే లాయరు చదువు కూడా చదివి ఆవృత్తిలో ప్రవేశించాడు. 1860 వ సంవత్సరంలో రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికాదేశ అధ్యక్ష పదవికి పోటీచేసి గెల్చాడు. 1861 మార్చి 4 వ తేదీనుంచి 1865 వ సంవత్సరం వరకూ అమెరికాకు అధ్యక్షుడుగా వున్నాడు. 1865 లో పెళ్లాం బిడ్డలతో ఏదో నాటకానికి వెళ్లి హాలులో కూర్చుని వుండగా ఒక శత్రువు చాటుగావచ్చి పిస్టల్ పేల్చి చంపేశాడు.

అబ్రహాం లింకన్‌ను ఈరోజున అమెరికన్లు తమ జాతీయ వీరుడుగా పరిగణిస్తారు. ఆయన జన్మదినం రోజున (నిన్న) ఉత్సవాలు చేస్తారు. ఏమిటి ఈయన చేసిన ఘనకార్యం?

నూరు సంవత్సరాలకు ముందు అమెరికాలో నీగ్రో జాతి వాళ్లు బానిసలుగా వుండే వారు. అమెరికాలో నీగ్రో బానిస వ్యాపారం బాహాటంగా సాగేది. ఆఫ్రికా ఖండం నుంచి అమాయకులైన నీగ్రోలను వేలకొలదిగా బంధించి తెచ్చి అమెరికాలో ధనవంతులైన తెల్లవాళ్లకు అమ్మేవారు. ఒక నీగ్రో కుటుంబాన్ని బంధించి తెస్తే భర్త ఒకళ్లకి, భార్య ఇంకొకళ్లకి, పిల్లలు ఇంకోళ్లకి అమ్ముడు పోయేవారు. నీగ్రో బానిస సరిగ్గా

(34-వ పేజీ చూడండి)

హకల్ బెరీ ఫిన్

మార్క్ ట్వేన్

బొమ్మరిల్లు సీరియల్

"లేరా, లే. ఏం చేస్తున్నావ్?" కళ్లు తెరిచాను. చుట్టూ చూశాను. బాగా పొద్దెక్కింది. ఇంత సేపూ గాఢ నిద్రపోయాను. మానాన్న నామీదికి వంగి నన్ను మేల్కొలుపుతున్నాడు. మొహమంతా చిట్లించుకుని ఏదో బాధ పడుతున్నట్టున్నాడు.

"ఏం చేస్తున్నావ్ ఆ తుపాకితో?" అని అడిగాడు.

రాత్రి తను చేసిన గొడవ జ్ఞాపకం లేదట్టుంది. అందుచేత అబద్ధమాడాను.

"ఎవరో రాత్రి లోపలికి జొరబడాలని చూశాడు. అందుకని తుపాకి పట్టుకుని కూర్చున్నాను."

"నన్నెందుకు లేపలేదు?"

"లేపాను. కాని నువ్వు లేవందే."

"సర్లే. ఇక లేచి నదిలో మనం వేసిన వలలో చేప లేమన్నా పడ్డాయేమో చూసిరా. నే నిప్పుడే వస్తా."

తలుపు తాళంతీసి తెరిచాడు. నేను నది ఒడ్డుకి పోయాను. నిన్నటికీ ఈవేళకీ నదిలో చాలా తేడా కనపడింది. రాత్రికి రాత్రే వరద వచ్చినట్టుంది. కెరటాలు పరవళ్లు తొక్కుతూ పరుగెడుతున్నాయి. కొయ్యదుంగలు, ముళ్లకంపలు, చెత్త చెదారం కొట్టుకొస్తున్నాయి. దూరాన్నించి ఒక చక్కటి పడవ కొట్టుకొని వస్తోంది. పదమూడు, పధ్నాలు గడుగుల పొడుగుంటుంది. బాతు యీదుకుని వస్తున్నట్టు వస్తోంది. నేను దాన్ని చూసీ చూడగానే నది కడ్డం పడ్డాను. నది కెదురీది పడవను పట్టుకున్నాను. లోపలికెక్కి పడవను ఒడ్డుకి తీసుకువచ్చాను. ఈపడవ సంపాదించినందుకు మానాన్న సంతోషిస్తాడనుకున్నాను. కాని నేను ఒడ్డుకు వచ్చేటప్పటికి మా నాన్న ఎక్కడా కనబడలేదు. ఇంకా ఇంటివద్దనే ఉండి ఉంటాడు. అందుకని దాన్ని ఒడ్డున ఒక చెట్టుకు కట్టేద్దామనుకున్నాను. ఇంతలో మెరుపులాగా ఒక ఆలోచన తట్టింది. ఈపడవ నెక్కడన్నా దాచాలి. ఇంటిదగ్గర్నుంచి పారిపోయే టప్పుడు కాలినడకన పారిపోవటం కంటే, ఈపడవమీద నదిలోనే ఏయాభై మైళ్లో దూరమో పోయి అక్కడ ముందు కర్తవ్యం ఆలోచించుకోవచ్చు, అనుకున్నాను. ఒడ్డువెంబడే పడవను కొంతదూరం తీసుకుపోయి అక్కడ పొదల మధ్య దాన్ని దాచాను. మళ్లీ మామూలు చోటికి వచ్చి మాచేపల వలను మెల్లిగా లాగటం మొదలెట్టాను. ఇంతలో మానాన్న వచ్చాడు. ఇంతసేపటి నుంచీ ఏం చేస్తున్నావని గద్దించాడు. బట్టలు తడిసిపోయాయేమని అడిగాడు. కాలుజారి నదిలో పడ్డాననీ, అందుకనే ఇంత ఆలస్యమైందనీ అన్నాను. ఇద్దరం వల లాగసాగాము. అయిదు చేపలు పడ్డాయి. అవి తీసుకుని ఇంటికి పోయాము.

భోజనం చేశాక మానాన్న విస్కీ తాగి, అలిసి

వున్నందునో యేమో సరాసరి నిద్రపోయాడు. నిద్ర పోయేముందు హెచ్చరించాడు:

"ఈసారి ఎవడన్నా లోపలికి జొరబడాలని వస్తే నన్ను లేపు. ఒక్క దెబ్బతో, మట్టి కరిపిస్తా వాణ్ణి. మర్చిపోకుండా లేపు, తెలిసిందా?"

నేను నా పలాయనాన్ని గూర్చి రకరకాల మార్గాలు ఆలోచించాను. ఏదైనా, ఒకటి మాత్రం స్థిరం చేసుకున్నాను. నేను పారిపోతే, పారిపోయిన తర్వాత చాలా కాలానికిగాని మానాన్న, అమ్మ గారు మొదలైనవాళ్ళకి తెలియకూడదు నేను పారిపోయినట్టు. అందుకని ఏం చేస్తే బావుంటుందా అని ఆలోచిస్తూ అలాగే నిద్రపోయాను.

మధ్యాహ్నం పన్నెండింటికి ఇద్దరికీ మెలకువ వచ్చింది. మళ్ళీ నదిఒడ్డుకి వెళ్లాము. నది అమిత వేగంగా ప్రవహిస్తోంది. తెప్పఒకటి కొట్టుకురావటం చూశాము. వెంటనే మానాన్న తాలూకు పడవలో పోయి ఆ తెప్పను ఒడ్డుకు చేర్చాము. అది తొమ్మిది దుంగలతో కలిపి చెయ్యబడిన తెప్ప. ఆరోజంతా ఒడ్డునే కాపలా కాస్తే అల్లాంటి తెప్పలు ఎన్ని డజన్లు సంపాయించేవాళ్లమో. కాని మానాన్న ఒక్క తెప్పతోనే సంతృప్తి పడ్డాడు. దాన్ని ఎంత దబ్బున అమ్మి, విస్కీ కొందామా అని వాడికి ఒకటే తహతహ. మూడున్నర కల్లా పూళ్లోకి ప్రయాణానికి సిద్ధమయ్యాడు. తెప్పను పడవకు కట్టుకుని ఒక్కడే నది అవతలివైపుకు వెళ్లిపోయాడు. నన్ను ఇంట్లో పెట్టి తాళంవేసి మరీపోయాడు. ఆరాత్రికి తిరిగిరాడని నిశ్చయం చేసుకున్నాను. వెంటనే గొంగళీ ఒత్తిగించి రంపంతో మిగిలిన పని కాస్తా పూర్తిచేశాను. నేను సునాయాసంగా పట్టగలంత రంధ్రం చేశాను. దాంట్లోంచి బయటకువచ్చి చూశాను. మానాన్న అప్పటికే అవతలి ఒడ్డు సమీపిస్తున్నాడు. వాడి పడవ నలుసులా కనిపించింది.

ఇంట్లోవున్న గోధుమపిండిమూటను తీసుకుపోయి నేను దాచిన పడవలో చేర్చాను. కొంత మాంసం, విస్కీకూజా, ఇంట్లోవున్న యావత్తు కాఫీ పౌడరు, పంచదార, తుపాకిమందు పడవలో చేర్చాను. బకెట్, మంచినీళ్లడబ్బా, ఒక పెనం, కాఫీ పాత్ర, గ్లాసు, నా రంపం, రెండు కంబళీలు, చేపలవల, గాలం, అగ్గిపుల్లలు ఇంకా ఏమి టేమిటో చాలా వస్తువులు తీసుకుపోయి పడవలోకి చేరేశాను. ఇంట్లో సెంటు ఖరీదున్న ఏవస్తువునీ మిగల్చ లేదనుకోండి కొల్లగొట్టేశాను. కట్టెలకుప్పదగ్గిర ఒకగొడ్డలి వుంది.

దాన్నికూడా తీసుకుందా మనుకుని చటుక్కున ఇంకో ఆలోచన తోచి మానేశాను. తుపాకీకూడా పడవలో పెట్టాను. ప్రయాణసన్నాహం పూర్తయింది.

నేను తయారుచేసిన రంధ్రం బయటనుంచున్న మనిషి కెవడికైనా బాహాటంగా కనిపిస్తుంది. అది కన బడకుండా ఒక కొయ్యచెక్క అడ్డం పెట్టి మట్టి అదీ కప్పిపెట్టాను. ఆ గోడకు అయిదారు అడుగుల దూరంలో నుంచుని చూస్తే అక్కడ కన్నం చెయ్య బడినదని కొత్తవాళ్లు కనుక్కోలేరు. పైగా ఆకన్నం ఇంటికి వెనకవైపున వుంది. అందుచేత ఎవరూ దాన్ని గమనించక పోవచ్చు.

నేను పడవదాచిన చోటుకు, ఇంటికీ మధ్య అంతా పచ్చిక మొలిచివున్నది. అందుచేత నేను ఎన్నిసార్లు తిరిగినా అడుగుజాడలు పడలేదు. నదిఒడ్డున నుంచుని చూశాను. నది నిర్జనంగా వుంది. నా పలాయ నానికి ఎక్కడా అడ్డంకి కలిగేట్టు లేదు. తుపాకి తీసు కుని అడవిలో తిరిగాను, పక్షులేమన్నా కనిపిస్తా యేమోనని. అడవిపంది ఒకటి కనబడింది. దాన్ని కొట్టి చంపి ఇంటికి లాక్కుపోయాను.

కట్టెలవద్ద ఉన్న గొడ్డలి తీసుకుని తలుపు తాళం బద్దలుగొట్టి ఊడదీశాను. పందిని లోపలికి తీసుకుపోయి గొడ్డలితో నోరు పగలగొట్టి బాగా రక్తం కారనిచ్చాను. తరవాత ఒక గోనెసంచీలో రాళ్లు నిండపోసి దాన్ని పందిఉన్నచోటునుండి తలుపువరకూ, అక్కడినించి అడవిగుండా నదిఒడ్డు వరకూ నేలమీద బరబర ఈడ్చుకు పోయాను. అక్క ణ్నించి రాళ్లబస్తాను నదిలో బాగా లోతుకు తీసుకు పోయి వదిలాను. ఇంట్లోనుంచి దేన్నో లాక్కుపోయి నదిలో పారవేసినట్టు నేలమీద గుర్తులు చూసిన ప్రతి వాడూ అనుకుంటాడు. అనుకోవాలనే ఇదంతా చేశాను. "టామ్‌సాయర్ ఈసమయంలో నాతో ఉంటే ఎంత బావుండును, ఎంత మెచ్చుకునేవాడు నా తెలివి తేటలు చూసి," అనుకున్నాను.

గొడ్డలికి బాగా నెత్తురు పట్టించి, నా వెంట్రు కలు కొన్ని పీకి దానికి అంటించాను. గొడ్డలిని ఒక మూల వేళ్లాడదీశాను. పందిని తీసుకుపోయి నదిలో పారవేశాను. ఇంతలో ఇంకో ఉపాయం తట్టింది. పడవలో దాచిన గోధుమపిండిమూట, రంపం తీసుకు వచ్చాను. మూట కొక మూల చిన్న బెజ్జం చేశాను. ఇంటికి తూర్పుగా ఒక పెద్ద సరస్సు వున్నది. ఆ సరస్సుకు అవతలి వైపునుంచి ఒక కాలవ ప్రారంభ మౌతుంది. ఆ కాలవ ఎక్కడికి పోతుందో తెలియదు కాని నదిలోమటుకు కలవదు. గోధుమమూటను సరస్సువరకూ తీసుకుపోయాను. తీసుకుపోయినంత మేర బెజ్జంలోనుంచి కొద్ది కొద్దిగా గోధుమపిండిని కారనిచ్చాను. బెజ్జం కట్టివేసి మళ్ళీ దాన్ని పడవలో దాచాను.

అప్పటికి చీకటి పడబోతున్నది. నిశ్చింతగా పడవలో కూర్చుని చంద్రోదయంకోసం ఎదురు చూస్తున్నాను. ఆకలవుతుంటే కాస్త ఏదో తిని చుట్ట కాలుస్తూ ఆలోచనలో పడ్డాను. మానాన్న ఇంటికి వచ్చి జరిగిన ఘోరం యావత్తూ తెలుసుకుంటాడు. నదివరకూఉన్న గుర్తులు చూసి నాశవంకోసం నదిలో వెదుకుతాడు. తరవాత సరస్సువరకూ ఉన్న గోధుమ పిండి గుర్తులు చూసి సరస్సు, కాలవ అంతా వెదుకు తాడు. తాళం బద్దలుగొట్టి ఎవడో నన్ను చంపి నదిలోపారేసి, ఇంట్లో సామగ్రితో సరస్సుమీదుగా పారిపోయివుంటాడని తలుస్తాడు. అంతా అలాగే అనుకుంటారు. నదిని నా శవంకోసం తప్ప మరి దేనికీ వెదకరు. నేను బతికేవున్నాను గనుక నాశవం కన బడదు. విసుగెత్తి ఊరుకుంటారు. ఇక నా ఊసెత్తరు. ఆల్‌రైట్. మరి నే నెక్కడికి పోవాలి? నా ఇష్టం; ఎక్కడికైనా పోవచ్చు. జాక్సన్‌ద్వీపం బాగానే వుంటుంది.

(జాక్సన్ ద్వీపాన్నిగూర్చి టామ్‌సాయర్ పుస్తకంలో చాలా ప్రశంసవుంది.)

నాకా ద్వీపం బాగా తెలుసు. అక్కడి కెవరూ రారు. పగలల్లా అక్కడ హాయిగా ఉంటాను. రాత్రిళ్లు ఊళ్లోకి వచ్చి నాక్కావలసిన వస్తువులు కొను క్కునో, ఏదోవిధంగా తీసుకుని మళ్ళీ పోతాను. రైటో జాక్సన్‌ద్వీపమే నాకు అన్నివిధాలా సరి పోయిన ప్రదేశం.

చాల అలిసిఉన్నందున ఎప్పుడు నిద్రపోయానో గాఢంగా నిద్రపోయాను. లేచిచూస్తే అంతా అయో మయంగావున్నది. ఎక్కడున్నానో అర్థంకాలేదు. కొంతసేపటికి అవగతమైంది. వెన్నెల ఉధృతంగా

వ్యాపించింది. ఆ వెన్నెల్లో చూస్తే నది ఎన్నో మైళ్ళ వెడల్పు ఉన్నట్లు తోచింది. చీమ చిటుకన్నా వినిపించేటంత నిశ్శబ్దంగా ఉన్నది రాత్రి.

ఇంతలో దూరంగా ఏదో అస్పష్టమైన శబ్దం నన్ను ఆకర్షించింది. జాగ్రత్తగా చెవులొగ్గి విన్నాను. తెడ్లు వేస్తున్న చప్పుడది. కళ్లు చిట్లించి తేరిపార చూశాను. నల్లటి చుక్కలాగ ఏదో కనిపించింది. అది క్రమంగా దగ్గిరికి వస్తున్నకొద్దీ పడవ ఆకారం అందులో మనిషి ఆకారం స్పష్టం కాసాగాయి. మానాన్నే అని అనుమానం లేకుండా తేలిపోయింది. కదలకుండా కూర్చున్నాను. నయమే నాపడవ ఇంకా పొదల చాటున చీకట్లోనే ఉంచబట్టి సరిపోయింది కాని లేకపోతే మానాన్న నన్ను ఇట్టే పట్టేసేవాడు. నేను పడ్డ శ్రమఅంతా వృథా అయిపోయేది.

మానాన్న ఒడ్డుకు వచ్చి పడవ దిగాడు. ఇంటి వైపుగా కొంత దూరం పోనిచ్చాను. మనిషి తాగినట్లు లేడు; శుభ్రంగా, పూర్తి తెలివిలోనే వున్నట్టున్నాడు.

ఇక ఆలస్యం చెయ్యడం మంచిది కాదనుకున్నాను. పడవను నీళ్లలోకి తోసి నది దిగువకు అతి వేగంగా నడుపుకుపోయాను. ఒడ్డువెంబడే రెండున్నర మైళ్లు పోయాను. ఇంకా ముందుకు పోతే పడవల రేవు వస్తుంది. అక్కడ జనం ఉంటారు. ఎవరు నువ్వని వాళ్లు దబాయించవచ్చు. అందుకని నదిమధ్యకు పడవను తిప్పాను. సరిగ్గా నదిమధ్యకు వచ్చాక తెడ్డుతీసేసి హాయిగా పడుకున్నాను విశ్రాంతికోసం. చుట్ట తీసి వెలిగించి ఆకాశం కేసి చూస్తున్నాను. ఒక్కమబ్బు కూడా లేదు. వెన్నెల్లో ఆరుబైట వెలకిలా పడుకుని చూస్తుంటే ఆకాశం ఎత్తుగా ఉన్నట్టు కనిపించదు; లోతుగా ఉన్నట్టుంటుంది. ఈ సంగతి నాకిదివరకెప్పుడూ తెలియదు. ఆ రోజున పడవలో ఒంటరిగా అలా పడుకుని చూస్తుంటే హఠాత్తుగా ఈ వింత కనిపెట్టాను. ఇంకో వింత ఏమిటంటే ఎక్కడో దూరంగా పడవల రేవులో మనుషులు మాట్లాడుకునే మాటలు కూడా వినిపిస్తున్నాయి. ప్రతిమాట స్పష్టంగా వినిపించటం మరీ వింతగా వుంది. ఒకడు, పగళ్లు పెద్దవై రాత్రిళ్లు చిన్నవౌతున్నాయనీ, అందుకని ఇది వేసాకాలమైవుండాలనీ అంటున్నాడు. ఇంకోడు ఇప్పుడు పగళ్లే చిన్నవిగా ఉండి రాత్రిళ్లు పెద్దవిగా ఉంటున్నాయన్నాడు. ఇద్దరూ నవ్వుకున్నారు. మళ్ళీ మొదటివాడు ఇందాకన్న మాటలే అన్నాడు. రెండోవాడు కూడా ఇందాకటి మాటలే అన్నాడు. మళ్ళీ నవ్వుకున్నారు. తరువాత మరొకణ్ణి లేపారు. వాడికికూడా అవేమాటలు చెప్పి, నవ్వుకున్నారు. కాని మూడోవాడు నవ్వలేదు. తనకు నవ్వురావటం లేదనీ, తన్నూరికే బాధపెట్టవద్దనీ అన్నాడు. ఇంతలో మరో కొత్తవాడి మాట వినిపించింది. ఇప్పుడు మూడు గంటలైవుండాలనీ, ఓ వారం రోజుల్లోగానైనా సూర్యోదయం అయితే బావుండుననీ అన్నాడు వాడు. అప్పటికి నాపడవ ప్రవాహానికి మెల్లిగా దూరమౌతూ వచ్చింది. మాటలు స్పష్టంగా వినబడటం మానేశాయి. నవ్వులు మాత్రం వినిపిస్తున్నాయి. ఇంకొంతసేపటికి అవీ వినిపించలేదు. పడవల రేవును దాటి చాలదూరం వచ్చేశాను.

అప్పుడు లేచి చూశాను. జాక్సన్ ద్వీపం కనిపించింది. రెండున్నరమైళ్ల దూరం వుంటుందని అంచనా వేశాను. అక్కడికి చేరటానికి ఆట్టే సేపు పట్టలేదు. నది వడిగా వుండటంవల్ల తెడ్డు బలంగా వెయ్యకుండానే కొద్ది నిముషాల్లో జాక్సన్ ద్వీపం చేరాను. ఇల్లినాయిస్ రాష్ట్రం ఉన్నవేపు గట్టున పడవ దిగాను. పడవను నాకు బాగా పరిచయమైన ఒక చిన్న పాయలో చెట్లకొమ్మలు వంగి గుబురుగా వుండేచోట దాచాను. నదిలో పోతున్నవాళ్లకి అది వరకే తెలిస్తే తప్ప అక్కడ పడవలాంటి వస్తువేదో వున్నదనే అనుమానం తట్టదు.

ద్వీపం మొదట నుంచుని నదికేసి, మూడుమైళ్ల ఎగువన వున్న మా ఊరుకేసి చూశాను. నదిమీద యావత్తూ నిశ్శబ్దంగా వున్నది. ఊళ్లో లైట్లవెల్తురు కొద్ది కొద్దిగా చెట్ల సందునుంచి కనిపిస్తున్నది. తూర్పున ఆకాశంలో ఒక్కరవ్వ తెల్లగా వున్నట్టు తోచింది. త్వరలోనే తెల్లవారి పోతుందనుకున్నాను. అడవిలోకి పోయి ఒక చెట్టుకింద కంబళీ కప్పుకుని స్వేచ్ఛగా నిద్రపోయాను.

(ఇంకా వుంది)

నా చదువు

సి. హెచ్. ఎల్. నారాయణ & సి. వి. రాజు

పరీక్షలు దగ్గరకి వస్తున్నాయి.

నాకు చదువంటే మహా (అ) శ్రద్ధలెండి. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి బాగా చదువుకోరా నాయనా' అని మానాన్న పోడిచి పోడిచి చెప్పేవారు. కాని నేను వింటేగా! పైగా ఫస్టుమార్కులన్నీ నావేనని కోసేస్తుండేవాడిని. మా అమ్మ మాత్రం నాకోతలు నమ్మేది. పైగా యిరుగు పొరుగులవారితో మావాడు చదువులో అఖండుడండీ! ఎప్పుడూ నూటికి 90 తక్కువ రావు. రాత్రి పగలూ విసుగూ విరామం లేకుండా తెగచదివితే ఆరోగ్యం చెడిపోతుందిరా నాయనా అని ఎంత చెప్పినా వినడండీ అని చెబుతుండేది.

ఒకరోజున నాగదిలో కూర్చుని ఆంధ్రపత్రిక చదువుకుంటున్నాను. ఎందుకైనా మంచిదని ఇంగ్లీషు పుస్తకం కూడా తెరిచే ఉంచుకున్నాను. ఇంతట్లోకి మా నాన్నగారు నాగదిలోకి వచ్చేరు. హఠాత్తుగా ఆయన్ని చూడగానే నాగుండె గుభేలు మంది. కాని ధైర్యం తెచ్చుకుని ఆంధ్ర పత్రిక అడుక్కి తోసేసి యింగ్లీషు పుస్తకం శ్రద్ధగా పఠిస్తున్నట్టు నటించసాగాను. కాని మించిపోయింది. ఆయన ఆంధ్ర పత్రిక చూడటమేమిటి 'హారి పిడుగా యిదిరా నీ చదువు' అని గర్జించటమేమిటి ఒక్కసారే జరిగేయి. కాని నేనేమన్నా తక్కువ తిన్నానా. వెంటనే 'ఇది మీకాలం చదువులనుకున్నారేంటి నాన్నారూ! మా ప్రశ్నపత్రాలన్నీ జనరల్ నాలెడ్జి (General Knowledge) మీద ఆధారపడి ఉంటాయి. ఇటువంటి పత్రికలవల్లనే ప్రపంచ జ్ఞానం అభివృద్ధిచెందుతుందండి' అని ఒక చిన్న లెక్చరు దంచి ఆ గండం తప్పించుకొన్నాను.

పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి కాబట్టి స్నేహితుడు రంగారావుని రాత్రిళ్ళు చదువుకునేందుకు రమ్మన్నాను. తెల్లారితే యింగ్లీషు పరీక్ష. నిద్రాదేవత ఆహ్వానాన్ని తిరస్కరించడానికి ఫ్లాస్కునిండా వేడివేడి 'టీ' రడీ చేసుకున్నాను. ఒక్క అరఘంట చదివేటప్పటికే (ఎప్పుడైనా అలవాటుంటే కదూ!) నాబుఱ్ఱ వేడెక్కింది. కళ్ళు చింత నిప్పుల్లాగ ఎఱ్ఱబడ్డాయ్. నిద్ర కూరుకు వచ్చేయసాగింది. కాని హఠాత్తుగా ఎఱ్ఱని ఫ్లాస్కుతో టీ కనిపించగానే ధైర్యం తెచ్చుకుని ముఖం కడుక్కుని మా రావ్‌గాడికి ఒక్క చుక్కైనా మిగలకుండా ఫ్లాస్కు ఖాళీ చేసేశాను. మరొక్క పావుగంట చదివేటప్పటికి తస్సదియ్యా! నాలుగు కప్పులటీ బలమూ ఏమైపోయిందోగాని కుర్చీలోనే పెద్ద గురకతో నిద్రపోయాను.

తెల్లవారగట్ల ఐదున్నరకి గడియారం కొట్టిన అలారం నన్ను మేల్కొలిపింది. మా రావుగా డింకా నిద్రపోతున్నాడు. ఇంతట్లోకి తెల్లవారు ఝామున ఆవుముఖమో పునిస్త్రీ ముఖమో చూస్తే జయం కలుగుతుందని ఎవరో అన్నట్లు జ్ఞాపకం వచ్చింది. మాయింట్లో ఆవు లేకపోతే పోయిరి ఒక గేదె అన్నా లేదు. అంచేత మా అమ్మ ముఖంచూస్తే పేసుమార్కులన్నా రాకపోతాయా, అన్న ధైర్యంతో మాఅమ్మ పడుకున్నగదికి బయలుదేరేను.

(34-వ పేజీ చూడండి)

పెద్దలమాట

వెంకాయికి ఇంకా నాలుగేళ్లయినా నిండలేదు కాని నాలుగు మూలలూ తడువుతూండడం మాత్రం ఎల్లాగో అలవడిపోయింది. దానికి అక్కర్లేని దంటూ లేదు. ఏమూలాల కన్నంవున్నా వేలుపెట్టి చూస్తుంది. అల్లా కన్నాల్లో వేలు పెట్టకూడదే అని వాళ్ళఅమ్మనోరూ నెత్తీ మొత్తుకుని చెప్పింది ఎన్నో సార్లు. పెడితే ఏం? అని గద్దించేది వెంకాయి. "ఏదైనా అంటపాడిస్తే?" అని అమ్మ అడిగితే "దానితోక లటుక్కున పట్టుకుని కటుక్కున కోసేస్తానంతే" అనేది మహా డాంబికంగా. విసుగెత్తి వాళ్ళమ్మ "సరి, ఏదైనా అంటపాడిస్తే అప్పుడు అణుగుతుందిలే ఈ గొప్ప అంతా" అని తన పని తను చూసుకునేది. ఈ 'గొప్ప' అణగడం మాట ఎట్లావున్నా అదొకటంటూ తనలో వుందని తెలుసుకున్న తరువాత వెంకాయికి ఆ గొప్పని ఇంకా ఎక్కువ చేసుకోవాలని బుద్ధిపుట్టింది.

అప్పటినుంచి మూలలు తడవడమే కాదు ప్రతివస్తువూ తీసిపరీక్షిస్తూండేది. వంటింట అలమారులో అమ్మ ఏమేమి దాచేది పసికడుతూండేది. డబ్బాల మూతలు అన్నీ తీసి వాటిలోని కందిపప్పు, పంచదార భక్షిస్తూండేది. ఒక్కొక్కప్పుడు ఏదైనా డబ్బాతీస్తే వాటిలోంచి బొద్దింకలు ఎగిరి మొహంమీద పడేసరికి ఆడబ్బా ఆమట్టున క్రిందవదిలేసి పరుగెత్తేది. వాళ్లమ్మ ఆ చప్పుడు విని వచ్చి వెంకాయిని పట్టుకుని నాలుగు చివాట్లు పెడుతూండేది. బెల్లం, పంచదారలు తిన్న నోటికి నాలుగు చీవాట్లు తినడంచేదా! వెంకాయిమాత్రం తనపని తాను చేసుకు పోతూండేది వాళ్లమ్మ ఒక్కొక్కసారి ఏదైనా జంతికలు, వేపుడుబియ్యం చేస్తే వాటిని ఎక్కడా అందకుండా ఎత్తుగా అలమార్లో పెట్టేది. కాని వెంకాయికి అదొక అడ్డా! నెమ్మదిగా అలమారు తలుపులుమీాంచి ఎక్కిని లుచుని ఎలాగో గుప్పిట్లతో జంతికలుతీసుకునేది. కాని తీరా దిగివద్దాం అనుకునేసరికి, చేతుల్లో జంతికలు వుంటే దేంతో పట్టుకు ఎలా దిగుతుంది? అట్టేసేపు వుంటే అమ్మ వచ్చి పట్టుకుంటుంది. పోనీ తిరిగి జంతికలు డబ్బాలో పడేసేదాం తప్పించుకుని బయటపడడమే చాలు అని ప్రయత్నించపోతే ఏదో అందీ అందని డబ్బా మూతిలోంచి తియ్యడం అంటే తియ్యగలిగింది కాని మళ్ళీ పెట్టెయ్యడం సాధ్యపడింది కాదు. అందుచేత ఇక అవి అక్కడే తినేసి దిగాలని అనుకునేది. అమ్మ ఎక్కడ వచ్చేస్తుందో అన్న భయంతో గబగబ నోట్లో పోసుకుని నమలకుండానే మింగెయ్యడంలో గొంతుకదిగక ఉక్కిరి బిక్కిరి అయేసరికి క్రిందకి ఉరికేసి వెర్రికేకలు వేసేది. ఆ కేకలు విని వాళ్ల అమ్మ విషయం గ్రహించి వెంటనే కాసిన్ని మంచినీళ్లు గొంతుకులో పోసి, గుండె నిమిరి సర్దేది. ఉక్కిరి బిక్కిరి అవడంలో ప్రమాదం రాకుండా సర్దుకుపోయిందన్న సంతోషంలో వాళ్ల అమ్మ వెంకాయిని ఏమీ తిట్టి, కొట్టేదికాదు. అది తనకు జయంక్రింద జమకట్టుకునేది వెంకాయి. ఇంతవరకూ శిక్ష అనుభవించకుండా తప్పించుకోగలుగుతూండడంవల్ల దాని బుద్ధి ఇంకా ఎక్కువవడం ప్రారంభం అయింది.

ఓసారి వాళ్ల ఇంటికి

శ్రీ కర్రా ప్రభాకర్‌రావు



రాక గౌను మరింత చిరిగిపోయింది. వాళ్లమ్మకి మరి అలవాటేగా ఇటువంటి చిక్కులన్నీ సర్దుతూ వుండడం! ఆ గొలుసు కాస్త వెనక్కితిప్పి గౌను బైటికితీసింది. అప్పుడూ జయం వెంకాయిదే. కొత్త గౌను కొనమని అమ్మని ఎన్నాళ్లనుంచో పోరుతూంటే అమ్మ లెక్కచెయ్యలేదు. ఇప్పుడు తనంతటతానే కొత్త గౌను కొని యిచ్చింది దీనితో వెంకాయి ఇక ఆకాశంలోనే విహరించడం ప్రారంభించింది. కాని గాలిలో ఎంత కాలం ఉండగలుగుతారేం; ఏదో ఓరోజున క్రిందపడతారుకదా!

మరికొన్నాళ్లు గడిచాక ఇంకో రోజున వాళ్ల యింటికి వాళ్ల తాతయ్యవచ్చాడు. వెంకాయితో ఆయన పొద్దున్నఅంతా చాలా సరదాగా కాలంగడిపాడు. చేసేది ఎంత అల్లరిఅయినా, కొత్తగా వచ్చినవాళ్లకిమాత్రం అది సరదాగానే వుంటుందిగా; పైగా వాళ్లు ఏనగోపాతుగూరునించి సైకిలుమీద వచ్చాడు. వీధిఅరుగుకు సైకిలు చేరేసి లోపలికివెళ్లాడో లేదో వెంకాయి ప్రత్యక్షమయింది సైకిలుకి ఓసారి దాన్నిఅంతా ముట్టుకుని చూసింది. మెత్తగావున్నవన్నీ నొక్కింది. గట్టిగావున్నవన్నీ కొబ్బరికాయని నాశెంచేసినట్టు చేతివేళ్ల ముడుపులతో కొట్టిచూసింది. సరే సైకిలు వెనకచక్రం స్టాండుమీద వేసివుందేమో పెడలు పట్టుకుని గిరగిరా త్రిప్పడం మొదలుపెట్టింది. చక్రం గిరగిరా తిరుగుతూంటే తనేదో పెద్దవిమానాన్ని నడుపుతూన్నట్లు మురిసిపోయింది. ఎదురుగుండా ఓగుర్రబ్బండి వస్తూంటే "తప్పుకో, తప్పుకో!" అంటూ బెల్లుకొట్టింది ఓచేత్తో రెండోచేత్తో చక్రం తిప్పుతూనే. ఆ బెల్లువిని వాళ్ల అమ్మ ఇంట్లోంచి పరుగెత్తుకు వచ్చింది, వీధిలోకి. ఇంకేముంది. వెంకాయి గౌను వెనకచక్రంలోపడి నల్గి గొలుసు పళ్లలో చిక్కుకుపోయింది. వెంకాయి ఎంతపీకినా

ఇంకా ఆ సరా ఇస్తారు, అల్లరి చేయడానికి. ఆయనతో చెలగాటాలు ఆడుతూన్నంత సేపూ ఆయన్ని చాలా తీవ్రంగా పరిశీలించి ఆయన దగ్గిర ఏమేమి వున్నవి, వాటితో ఆయన ఏమేమి చేస్తున్నదీ పరిశీలించింది.



ఆయన భోజనం చెయ్యడానికి కూర్చున్నాడు. వెంటనే వెంకాయి ఆయన బట్టలు పెట్టుకున్న చోటుకు వెళ్లింది. అక్కడ ఒక పెద్ద పుస్తకం దానిమీద ఓ కళ్ళజోడు, దాని ప్రక్కనే ఒక చిన్నదంతం పెట్టి వున్నాయి. ముందు పుస్తకం తెరిచింది. దాంట్లో బొమ్మలు ఏమీ లేకపోయేసరికి విసిరిపారేసింది. కళ్ళజోడు రెండుమూడుసార్లు తీసి పెట్టుకుని ప్రక్కన పెట్టేసింది. దృష్టి అంతా బుల్లి దంతప్పెట్టె మీద పడింది. ఎంతో శ్రమపడి తెరవాలని ప్రయత్నించింది. రాలేదు. నాలుగు మూలలా తడిమింది నొక్కేమీటు ఏదైనా వుందేమో అని. ఏంలాభం లేకపోయింది. పళ్ళు బిగపెట్టి కొరికి తియ్యపోయింది. మూత కొంచం కదిలింది. మరీ బిగించి పళ్ళతో లాగింది. మూత ఊడింది కాని మరుక్షణంలో అమ్మోయి, బాబోయి, మండుతోందేవ్ అంటూ కళ్ళు నలుపుకుంటూ, 'హాచ్చి, హాచ్చి' అని అదేపనిగా తుమ్ముతూ నేలమీద దొర్లడం ప్రారంభించింది. ఇంతట్లోకే వాళ్ల అమ్మ వచ్చింది, "అమ్మా! ఇంకెప్పుడూ ఏమీ తడవనే. నువ్వు చెప్పినట్లు వింటానే. కళ్ళు కడగవే" అని ఏడుస్తూ బ్రతిమాలుకుంది. దానితో వెంకాయి మళ్ళీ ఆ వేళనుంచి భూమిమీదికి దిగింది. ఇప్పుడస్తమానం చేతులు కట్టుకునే వుంటుంది. *

నా చదువు

(30-వ పేజీ తరువాయి)

హాతోస్మి! ఆ దృశ్యం చూడగానే నా పై ప్రాణాలు పైనే పోయాయి. ఎదురుగుండా చీపిరి కట్ట, పేడనీళ్ళు, ముగ్గు డబ్బాలతో మా బామ్మ (బోడిగుండుతో సహా) ప్రత్యక్షం! పొద్దున్నే బోడి బామ్మను సందర్శించిన ఫలితంగా (లేక నా చదువే అంతనుకోండి) పరీక్షల్లో బండిచక్రాలు వచ్చేయని వేరే చెప్పాలా? నామార్కులు చూడగానే మానాన్న నరశింహావతారం దాల్చి వీపు విమానం మోత మ్రోగించారు.

దానితో నేను నా స్వప్నలోక విహారం చాలించి కుర్చీలోంచి క్రిందపడ్డా. అరె! ఆశ్చర్యం, మా నాన్నగారు నిజంగానే పేక బెత్తంతో నా ఎదురుగుండా నిలబడ్డారు. 'హారి బడుద్ధాయీ ఎనిమిదిన్నర కాకుండానే నిద్ర పోతున్నావురా' మీ రావు చూడు ఎలా చదువుకుంటున్నాడో' అని బెత్తంతో ఒక్కచురక తగిలించారు. పోనీలే ఒకదెబ్బ తింటే తిన్నాను పొద్దున్నే అమ్మ ముఖం చూడాలని (కలలోలాగ బోడిబామ్మ వగైరాలు ఎదురు రాకుండా) నిశ్చయించుకున్నాను. ★

లింకన్

(25-వ పేజీ తరువాయి)

పనిచెయ్యకపోతే యజమాని వాణ్ణి ఇంకొకళ్ళకి అమ్మేవాడు. లేకపోతే చంపేసేవాడు. నీగ్రోలచేత జంతువులుకూడ చేయరాని వెట్టి చాకిరి చేయించుకునే వాళ్లు. ముఖ్యంగా అమెరికాలోని దక్షిణ రాష్ట్రాలలో నీగ్రో వ్యాపారం ఎక్కువగా జరిగేది.

అబ్రహాం లింకన్ దారుణమైన ఈ పరిస్థితిచూసి చలించిపోయాడు. మానవజాతికి, నాగరికతకు తలవంపులుతెచ్చే ఈబానిస వ్యాపారాన్ని ఎప్పటికైనా రూపు మాపాలని కలలు గనేవాడు.

ఆ రోజుల్లో అమెరికాలోని ఉత్తర రాష్ట్రాల వారికీ దక్షిణ రాష్ట్రాల వారికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఉత్తర రాష్ట్రాల వారు బానిస వ్యాపారం రద్దు చేయాలనే వాళ్లు. రద్దు చెయ్యకూడదని దక్షిణాది వాళ్లనే వారు. అటువంటి సమయంలో అబ్రహాం లింకన్ అమెరికా అధ్యక్షుడుగా ఎన్నుకోబడ్డాడు. నీగ్రో జాతిని బానిస తనంనుండి విముక్తంచేసే అవకాశం వచ్చిందిగదా అని లింకన్ సంతోషపడ్డాడు. కాని అతడు అధ్యక్షుడు అయీ అవటంతోటే దక్షిణ రాష్ట్రాలవారు "మాకు ఈ అధ్యక్షుడు వద్దు. అతడు నీగ్రో వ్యాపారాన్ని రద్దు చేద్దామనుకుంటున్నాడు. మాకది ఇష్టంలేదు. అందుచేత మాకూ మీకు సంబంధం లేదు, అని ఎదురుతిరిగి ఉత్తర రాష్ట్రాలమీద యుద్ధం ప్రారంభించారు. "అమెరికా రాష్ట్రాలన్నీ ఏకంగా వుంటేనే ఈదేశం అభివృద్ధి పొందుతుంది. అందుచేత మీరు విడిపోవటానికి వీల్లేదు," అని లింకన్ పట్టుపట్టాడు. 1861 లో ఉత్తర దక్షిణ రాష్ట్రాలకు అంతర్యుద్ధం జరిగింది. నాలుగేళ్లపాటు సాగింది. 1865లో ఉత్తర రాష్ట్రాల వారు గెల్చారు. యుద్ధం ముగిసింది. లింకన్ నీగ్రో వ్యాపారాన్ని న్యాయ విరుద్ధంగా శాసనకట్టి రద్దు

చేశాడు. ఓడిపోయిన దక్షిణాది వారు విధిలేక ఆరద్దు శాసనాన్ని ఒప్పుకున్నారు. మళ్ళీ అమెరికా యావత్తూ ఒకే దేశమైంది. అప్పటి నుంచీ నీగ్రోలు కూడా స్వతంత్ర పౌరులయ్యారు. వారికికూడా ఎన్నికల్లో ఓటుచేసే అధికారం, ఇతర పౌరహక్కులు లభించాయి. వారి బానిసతనం పోయింది.

నాలుగేళ్ల పాటే అమెరికాకు అధ్యక్షుడుగా ఉన్నా చరిత్రను నాలుగువందల ఏళ్లుముందుకు తీసుకుపోయాడు లింకన్. అతని తరవాత అమెరికా దేశం అతి త్వరితంగా అభివృద్ధి చెంది 1900 సంవత్సరానికల్లా ప్రపంచంలోని గొప్ప దేశాల్లో ఒకటైంది. తమ దేశానికింత ఘనతను చేకూర్చి నందువల్లనే అబ్రహాం లింకన్‌ను అమెరికన్లు మహా పురుషుడుగా గౌరవిస్తూ వుంటారు.

నీ అన్నయ్య,
—ఎన్నార్.

పెళ్లి చూపులు

(9-వ పేజీ తరువాయి)

డాండీ? అన్నాను. అందుకూ ఈ చివాట్లు—

సీతయ్య : ఏ అమ్మాయ్‌తో నోయ్ సత్యం?...ఏమిటి శివయ్య బావా యిది?

శివయ్య : మొన్న ఒక పిల్లను చూడటానికెళ్లాం బావా! వాళ్లకు పిల్లవాడు నచ్చాడు. మనకూ పిల్ల నచ్చింది. మనం అడక్కుండానే ఆయనే పిల్లవాడి చదువు ఖర్చులన్నీ భరిస్తానన్నాడు. "నాకు కూతురు వొకటే కొడుకొకటే కాదు. నా ఆస్తిలో సగం భాగం అమ్మాయి పేర పెడతా"నన్నాడు. ఈ రోజుల్లో అంతకంటే ఇంకేం కావాలి బావా? నువ్వు చెప్పు నాకు తెలియకడుగుతాను. ఈయన గారికి సంగీతం పాడే భార్య కావాలిట సంగీతం — పుసిక్కన అడిగాడు.

సీతయ్య : ఆ పిల్లది వల్లభాపురం కాదు గదా?

మంగమ్మ : అవునన్నయ్యా ముక్కామల వారి పిల్ల.

సీతయ్య : కొంప మునిగింది. పసుపు కుంకం పెట్టొచ్చారా అమ్మాయ్?

సత్యం : ఏమిటి మావయ్యా నా కర్థం గావటల్లేదు. ఇంకా లేదులే ఏమిటి అసలు సంగతి?

సీతయ్య : అమ్మయ్య! ప్రాణం కుదుటబడ్డది...అమ్మాయ్ కాసిని మంచి నీళ్లు తెచ్చిపెట్టమ్మ?

శివయ్య : ఏమిటి బావా?

సీతయ్య : పసుపు కుంకం పెట్టలేదు గనక సరిపోయింది. ఆ సంబంధం మానుకోండి. వెధవ డబ్బు — డబ్బుకోసం ఆశపడి పిల్లవాడి బతుకును బండలు చెయ్యకండి.

మంగమ్మ : అసలు సంగతేమిటన్నయ్యా?

సీతయ్య : ఏమున్నదమ్మ అసలు సంగతి మరి పూరికినే ఇస్తానంటున్నాడా, అంతంత కట్నాలు? లేకపోతే డబ్బు ఒక్కవయి యిస్తున్నాడనుకొన్నావా? ఎరేయ్ సత్యం...

ఆరు నూరైనా నూరు ఆరైనా సరే, నువ్వు మాత్రం ఆ పిల్లను చేసుకోవొద్దు.

సత్యం : ఎందుకని? నాకు చదువు గూడా చెప్పిస్తానన్నాడే ఆయన..

సీతయ్య : ఒక్కమాలిన చదువు పోనిస్తూ. ఐనా చదువు చెప్పిస్తాడుగదా అని మూగి పిల్లను చేసుకొంటావుట్రా?

శివయ్య, మంగమ్మ : ఆ పిల్ల మూగిదా?

సత్యం : అబద్ధం శుద్ధాపద్ధం..

సీతయ్య : ఇంత కాలానికి సీతయ్య అబద్ధాల కోరయినాడు.. మీతో అబద్ధాలు చెబితే నాకేం వొరుగుతుందిరా? ఆయన చాలాకాలంనుండీ కూతురుకు సంబంధాలు వెదుకుతున్నాడు. ఎక్కడా దొరకలేదు. అందుకే ఆస్తిలో సగం వాటా యిస్తానంటున్నడి. అంతేగానీ మన అబ్బాయి తెలివితేటలూ గాదు డబ్బు ఎక్కువయ్యీ గాదు. ఆ డబ్బుతో కూతురు మూగితనం కప్పిపెట్టాలని—భగవంతుని సాక్షిగా ఆ పిల్ల మూగిపిల్లరా.. ★

పక్షులు

(24-వ పేజీ తరువాయి)

పైగా ఎగుర్తుంది. రెక్కలు టపటప కొట్టుకుంటూ నిలువుగా 50 అడుగుల ఎత్తునగాలిలోకి లేచి, వలయాకృతిగా మెల్లిగా నేలకుదిగటం చూస్తుంటే మహాసొగ్గావుంటుంది. ఇది కూ కూ అని కూస్తుంది. ఆడగువ్వలు సంవత్సరం పొడుగునా గుడ్లు పెడతాయి. ఇళ్లలో సాధారణంగా గూళ్లు కట్టవు. తడవకు రెండేసిగుడ్లు పెడతాయి.

అనుమానం
(10-వ పేజీ తరువాయి)

(10-వ పేజీ తరువాయి)

అంగలో రామాన్ని కలుసుకొని "డబ్బెక్కడిది?" అన్నాడు.

"ప్రకాశందగ్గర తీసుకొన్నాను."

గోపీకి అనుమానం వేసింది. "ఎందుకు? నిజంగానా?"

"అవును. జాగ్రఫీ పుస్తకానికి డబ్బులు అడిగితే నాన్నగారు ఇవ్వనన్నారు. దొంగిలించుకొన్న డబ్బుతో కొనుక్కోమన్నారు. నే దొంగిలించలేదంటే నమ్మలేదు" రామం చెపుతో నవ్వాడు.

గోపీ మనసేం బాగా లేదు. కాబట్టి ఆపైన మాట్లాడలేదు.

2

శనివారమే కాబట్టి మధ్యాన్నం తీరిగ్గా కూచుని ఆలోచిస్తున్నాడు గోపీ. "నేడు గుడు ఆడుతున్నారు. వస్తావురోయ్!" అంటూ పరుగెత్తుకొనివచ్చాడు ప్రకాశం.

ఆలోచనలతో వున్న గోపీ "రాలేనురా" అన్నాడు.

"నాకంతా తెల్సులేరా?" తల ఎగురవేసి అన్నాడు ప్రకాశం.

"నీమొహం"

"కాదు. రామం నోటు దొంగిలించాడు కదూ?"

గోపి అదిరిపడ్డాడు. "ఎలా తెలిసింది నీకు?" అన్నాడు.

"నాకంతా తెల్సులేరా...రామం జేబులో డబ్బుంది. వాడు శేఖరంతో వెళ్ళిపోయాడు మాజట్టు విడిచి..."

"నువు వాడికి అప్పు ఇచ్చావా?" ఆత్రంగా అడిగాడు గోపి.

"నేనా?" అప్పుఇవ్వడమా?" నవ్వాడు ప్రకాశం.

"నువు అప్పు ఇచ్చావని నాదగ్గర అన్నాడే?"

"లేదు. శేఖరంతో ఎటు వెళ్లాడో చూస్తాంపద."

ఇద్దరూ లేచి శేఖరంఇంటి కొచ్చారు. కిటికీద్వారా చూడమన్నాడు ప్రకాశం. గోపీ చూశాడు. జాగ్రఫీనోట్సు రాస్తున్న అన్నయ్యని బాగా చూశాడు. తలాడించుకొని "ఇక్కడ లేడురా ప్రకాశం..పద.." అన్నాడు.

"ఎందు కుంటాడూ?... శేఖర్‌తో మజాగా హోటల్ కెళ్లి..."

గోపీ తిరుగా ఇంటికొచ్చి కూర్చున్నాడు. కూర్చుంటే ఏంవుందని నాన్నగారి ఆఫీసుగది వలువూలలా వెతుకుతుంటే అమ్మ కేకేసింది. "మళ్లీ నువేం చేస్తున్నావురా ఆగదిలో?"

"నోటు వెతుకుతున్నాను."

"చాల్లే, పోయింది వస్తుంది!" అమ్మ తిరుగా కేకేసింది రమ్మని. జానకిని పంపించింది అమ్మ. జానకికి పడిశం లేని రోజుండదు. అది తుమ్ముకుంటూ వచ్చింది.

"శనిగ్రహం - ఎప్పుడూ తుమ్ములేమిటి?" అని గొణుక్కున్నాడు గోపి. జానకికి పాము చెవులు, అప్పుడే విని "నీకు రావూ తుమ్ములు? శనిగ్రహమట్రా నేను...ఓ అమ్మా...వీడు ఆఫీసు కాగితాలంతా గెలుకుతున్నాడే?" అని ఓ గావుకేక పెట్టింది.

అమ్మ రానేవచ్చింది. గోపి వుడికిపోతూ నిలబడ్డాడు.

"ఇదేం పిల్లలో...నా ప్రాణానికి..." అంటూ ఆఫీసుగది తాళంవేసి తాళం తీసుకొని వెళ్లింది అమ్మ.

గోపీ ముఖం చిట్లించుకొని మిద్దెపైకి వెళ్లాడు.

"గోపీ...రామం వున్నాడా: ఏం మాయదారి బిడ్డలమ్మా" వంటగదిలోనుంచే మళ్లీ ఓకేక వేసింది అమ్మ.

గోపీ పలకలేదు. అమ్మే అవతల కొచ్చింది.

"రామం ఏడీ? బియ్యండబ్బాలో రూపాయ వేశాను. అవుపడలేదు"

గోపీమనసు చివుక్కుమంది "ఎప్పటినుంచీ అవుపడలేదు?"

"ఇందాక చూశాను. ఏమిటమ్మా ఈ చోరీలు? ఆ దొంగ వెధవేడీ?"

"వూరికే తిట్టకే! గంటక్రితం చూశావా?"

"మహా అభిమానంగల వెధవ్వి. ఐదు నిముషాలక్రితం చూశాను"

"రామం వెలుపలికి వెళ్లిగంటఅయిందే?"

"అయితే ఏం? ఎప్పుడు వస్తాడో? నా కళ్లల్లో కారం చల్లుతాడు."

"వట్టిమాట. రామం లేనేలేడు గంటగా ఇంట్లో"

"ఛీ...వూరుకో..." అమ్మ ఒక్క అరుపు అరిచింది.

"ఏం పోయిందే?" అంటూ రానే వచ్చాడు రామం.

"వచ్చావ్? బియ్యండబ్బాలో రూపాయ చూశావా?"

"ఆఁ...గంటక్రింద చూశాను"

"వట్టి అబద్ధాలు...గంటక్రితమట..." చెయి ఎత్తింది అమ్మ.

రామం ముఖం ఎఱ్ఱపడ్డది "ఏది పోయినా నేనేనా?"

"అవును, నువే తీశావు. మీనాన్న రానీ..." అంటూ కొట్టింది అమ్మ చెయి పట్టుకొని.

"ఎందుకమ్మా విచారించకుండా కొడతావు. తీయలేదంటుంటే?"

"వూరుకో గోపీ, నీకూడా రెండు పడుతుంది. చూచినవాడు తియ్యకుండా పోతాడా? మంచివాళ్ల కడుపులో ఇటువంటివాళ్లు..."

"తీశాను...వదులు అమ్మా..." రామం ఏడుస్తూ అన్నాడు.

"అలా దారికిరా...చూశావురా గోపీ" అమ్మ రామం చెయ్యి వదిలింది.

"నే తీయలే. ఎందుకలా అంటారు నాన్నా... నన్ను దొంగ అని నే తీసేటప్పుడు చూశారా?" రామం ఏడుస్తూ అడిగాడు.

అమ్మ కొద్దిగా తెల్లబోయి "వెధవా? నాలికలు రెండా నీకు?" అన్నది.

"దెబ్బలు తప్పుతుందని అన్నాను. నేనేం ప్రకాశంలాగ దొంగనా?"

"ప్రకాశానికి మించిన పగటిచుక్కవి. రానీ...మీ నాన్న..." అమ్మ తల విదిలించి వెళ్లిపోయింది.

గోపీ జాలిగా అన్న వేపు చూచేడు. "అన్నయ్యా! నువు తీశావా?"

"లేదురా...మన నిర్మల (చుక్క) తోడు."

"అయితే ఇందాక నీ జేబులో డబ్బెక్కడిది?"

"నాన్నగారిచ్చారు. తిట్టి డబ్బుయిచ్చారు జాగ్రఫీ పుస్తకానికి - నిన్ను తెలుపుచ్చాలని ప్రకాశందగ్గర అప్పతీశానని అన్నాను."

"బియ్యం డబ్బాలో రూపాయి?"

"జానకి బియ్యం డబ్బాయూత తీస్తుంటే గంట్రకితం ఏమో చూశానురా...అంతే.."

"తెల్లవారి టేబిల్ పై నోటుకూడా చూశావా?"

"చూశాను..."

గోపీ ఆలోచిస్తుంటే రామానికి అంత దుఃఖంలో నవ్వువచ్చింది.

"రేపు నువుగానీ, జానకిగానీ తీస్తేకూడా నా పైనే పడుతుంది. అంతే...నాకిప్పుడు తెలుస్తోందిరా గోపీ...నీకున్నంత గోపం నాకు లేకపోబట్టి..." రామం ఏడుస్తూ అన్నాడు.

"కాదురా రామం...ఏడవ్వాకు...పద...లోనికి పోదాం."

3

రాత్రి భోజనానికి కూర్చుంటూ నాన్నగారు అడిగారు "ఆదూ! ఏమైనా తెలిసిందా?"

"ఆఁ. వడ్డీ! బియ్యంలో పడేసిన రూపాయీ పోయింది" నాన్నగారు కండ్లు పెద్దవి చేశారు "ఏమిటీ?"

అమ్మ మాట్లాడలేదు.

"రామంగాణ్ణి అడిగావా?"

"అడిగాను అందర్నీ...నే బియ్యలేదంటే నే చూడలేదన్నారు" నాన్నగారు అన్నం కలుపుకొంటూ చేతికి గట్టిగా తగిలితే చూచి రూపాయ ఎత్తి "ఇదిగో..."అన్నాడు నవ్వుతూ.

అమ్మ ఆశ్చర్యపోయింది "ఏమిటే? అయ్యో! రామాన్ని అన్నానే?"

జానకి అది చూచి సంతోషంతో ఉబ్బిపోయింది. ఆ విషయం తమ్ముళ్లిద్దరికీ చెపుదామని పరుగెత్తుకొని వస్తుంటే ఎదురుగా బొమ్మని తీసుకొని గోపీ సగర్వంగా పరుగెత్తుకొనివచ్చి ఇద్దరూ ఢీకొన్నారు. అయితే ఆ రెండు ప్రాణాలు భలే సంతోషంగా వున్నాయి కొబట్టి ఎవరికి వారు సర్దుకొన్నారు. "గోపీ, రూపాయి దొరికిందిరా" అంది జానకి.

"నోటుకూడా దొరికిందే" అన్నాడు గోపీ.

"ఎక్కడ?" అంది జానకి భలే సంతోషంతో.

రామం లలితని ఓదారుస్తూ ఎత్తుకొని వచ్చాడు. గోపీ నేరుగా వెళ్లి నాన్నగారి దగ్గర నిలిచాడు. నాన్నగారి కంచందగ్గర పెట్టిన రూపాయి చూచి రామం నవ్వుకొన్నాడు.

"నాన్నారూ, మీ నోటు లలిత బొమ్మ ఓణీ వేసుకొంది"

"నా పాప...నా వోణీ.." రామం చేతుల్లోనుంచీ జారి నాన్నగారి దగ్గరికి వచ్చింది లలిత, నాలుగేళ్లది

నాన్నగారు ఆశ్చర్యంతో చూశారు.

"మిద్దెపై బొమ్మలాట లాడుతున్నాది లలిత. ఎందుకో బొమ్మవైపు చూస్తే వోణీ చూడమని ఇచ్చింది లలిత" అన్నాడు గోపి.

"అయ్యో! రామం మంచివాడు" అన్నారు ఏకకంఠంతో అమ్మ, నాన్న. రామం తలాడించాడు. ★

ధనంచేసిన దేవత

(24-వ పేజీ తరువాయి)

అతని గొంతుకలో నిరాశ స్పష్టంగా అనిపిస్తూంది.

'నవ్వేమీ లేదు...ఆ టెలిగ్రాం నిజమైనదే అని సంతోషిస్తున్నాను—మీరు ఆతురాలా ఏభైవేలూ గెల్చారు!'

శర్మ తెల్లబోయాడు.

పార్వతి చెప్తూంది...'ఔను—మీరు గెల్చారు. ఆ ఎంట్రీలు నేను తపాలపెట్టలేదు. శారద కిచ్చి వాళ్ళ బ్బాయి చేత డబ్బూ, అవీ పంపాను ఆ రోజునే. రశీదులు కావాలా?'

శర్మ ఆనందానికి మేరలేదు. ఆమె రెండు చేతులూ గట్టిగా పట్టుకుని దగ్గరికి తీసుకుంటూ, 'నువ్వలా ఎందుకు చేశావు?' అన్నాడు, అనుమానం తీరక మంచివార్తలని నమ్మడమే కష్టం!

'మీరు ఆ డబ్బు రెండోసారి కూడా పోతే విచారిస్తారని అలాగ చేశాను అవసరమైతే శ్యామల దగ్గర తీసుకుని మీకు పందా ఇద్దామనుకున్నాను.'

'అయితే నేను కాల్చిన కవరు?'

'అందులో ఏమీ లేదు!'

శర్మ ఆమె కళ్లల్లో ధనలక్ష్మిని చూస్తున్నట్లు చూస్తూ, గాద్గదికంగా 'ఇంత స్వార్థత్యాగం చేసిన నీకు ఎలాగ క్షమాపణ చెప్పడం?......' అన్నాడు. ఆతను చాలా సిగ్గుపడుతున్నాడు. నవ్వుతూ, వస్తూన్న సంతోషాన్ని అణచుకుంటూ ఊరుకోండి...రేపు మీ వంట్లో బాగుంటే మావాళ్లని రమ్మని రాయండి - పాపం, సంతోషిస్తారు' అందిపార్వతి.

'నువ్వు నా దేవతవి!' అన్నాడు శర్మ ఆమెని హృదయానికి దగ్గరగా తీసుకుంటూ. ★

తాయారమ్మ కళాసేవ

శ్రీమతి ఉషారాణి బి. ఎ.

తాయారమ్మ ఒక బీద కుటుంబంలో పుట్టింది. చాలామంది అన్నదమ్ము లుండడంచేతా పెళ్లి కావలసిన నలుగు రక్క లుండడం చేతా తాయారమ్మకి చదువు నేర్పించలేదు. తన 12 వ యేటనే తాయారమ్మకి తల్లితండ్రులమీద ఒక విధమైన ద్వేషం ఏర్పడింది. తోడి పిల్లలందరూ చక్కగా పట్టులంగాలు వేసుకుని కార్లలో తిరుగుతుంటే, తన వాళ్లు తనకి తగిన న్యాయం చేయలేదనీ, తను వారి పెంపుడు పిల్లననీ అనుకొనేది.

రాజమండ్రినుంచి ఒకరోజు ఆమె బాబాయి శివకామేశ్వరయ్య వాళ్లవూరు వస్తే, చదువుకుంటాననే నెపంతో అతనితో ప్రయాణం కట్టింది. డబ్బు కక్కుర్తితో బాధపడుతున్న తల్లితండ్రులకు గాని, సంసారబాధ్యత లేని బాబాయికి గాని ఇది కష్టం కలిగించలేదు. రాజమండ్రిలో బాబాయి ఉంచుకొంటున్న భోగంది, త్రివేణి దగ్గిర తాయారమ్మకి అదో రకమైన నడవడి అలవాటు కాసాగింది. స్కూలికి వెళ్లినా నాట్యంమీదా, సంగీతంమీదా, నాటకాలమీదా ఆమె దృష్టి పరిగెత్తసాగింది. అతిగారాబంగా చూచుకొంటున్న కామేశ్వరయ్యకి ఇవన్నీ ముందు ముందు కష్టాలని కలిగిస్తాయేమోనని తోచలేదు. తాను వచ్చిన పెంకుటింటికీ, ఈ లలిత కళల ముత్యాలభవనానికీ తాయారమ్మ ఎంతో తేడా చూసింది. అదృష్టమంతా యిందులోనే వుందనుకుని మెల్లిగా ఈ వాతావరణానికి అలవాటు పడ్డది.

తాయారుకి 18 వ ఏటనే పెళ్లి చేయాలని తల్లీ తండ్రీ ఎంత ప్రయత్నించినా మంచి సంబంధం దొరకలేదు. తాను సుఖమైన జీవితం గడపాలంటే మొగుణ్ని మంచివాడినిగా ఏరుకోవడంలో వుందనీ, స్త్రీ స్వాతంత్ర్యం, సౌఖ్యం ఆ మహానుభావుడు అణగి మణగి పడుండడంలోనే వుందనీ త్రివేణి తాయారుకి నీతులు బోధించింది.

తాయారు కోటేశ్వరరావును చేసుకుంటానని ఒప్పుకొనేటప్పుడు, పెళ్లిఅంటే ఏమిటో, దాని బాధ్యతలంటే పదార్థంలాంటిది. జీవితం అనే బాటమీద ఏ ముళ్లూ గుచ్చుకోకండా. మల్లెపూలమీద నడచినట్లు, నడవాలని అతని ఉద్దేశం. అందుకనే అతనిలో ఆత్మగౌరవం, బాధ్యతలు పైన వేసుకోవడం చాలా తక్కువ. ఒక ఏమిటో ఆమెకు సరిగా తెలియవు. మొగుడి బలవంతంమీద తాయారు తనపేరు శారదగా మార్చుకుంది. కోటేశ్వరరావు నాలుగోఫారందాకా చదివాడు. అత్త సోమరిపోతు. కష్టపడి డబ్బు సంపాదిద్దామని కాని, సంఘానికి తలొగ్గే ఆత్మ గౌరవంగాని అతనిలో లేవు. అవన్నీ తన కున్నాయని పెళ్లాంమీద అధికారం చేసేవాడు మొదట్లో. కాని అదంతా ఒట్టిదని శారద త్వరలోనే గ్రహించింది.

నిరుద్యోగంతో మద్రాసువంటి మహాపట్టణంలో కాపురం చేయడం ఇద్దరికీ కష్టమని తోచింది. తన స్నేహితురాలి ప్రోత్సాహంతో శారద సినిమాలో చేర్తానని భర్తతో అంది. మొదట్లో కొంచెం ఎదిర్చినా, భార్య కళాసేవ చేస్తానంటే తను అడ్డుపడడం స్త్రీ స్వాతంత్ర్యానికి భంగం అనుకున్నాడు. శారదకి నృత్యం సంగీతం బాగా వచ్చినా రూపం తక్కువ. అందుకనే ఆమెకి ఎక్కువ బుక్కింగులు రాలేదు. తీరా సినిమాలో అడుగుపెట్టిన తరవాత తను పెద్ద తార కాలేదని శారదా, ఫలానా సినిమాతార భర్త అని తనని నలుగురూ గుర్తించటం లేదని కోటేశ్వరరావూ లోలోన కుమిలిపోయేవారు.

"ఏమే, శారదా నువ్వు సినిమాల్లోకి దిగావుటగా ? అయినా నీ మొగుడు ఎట్లా ఒప్పుకున్నాడమ్మా?" అని ఎవరన్నా అంటే, "ఆ, దాంట్లో తప్పేముంది ? సినిమాల్లో వేసిన వాళ్లందరూ చెడిపోతారా యేం" చెడిపోయే వాళ్లు ఎప్పుడైనా చెడిపోతారు. అయినా ఆడవాళ్లు ఆఫీసుల్లో మొగవాళ్ళతో ఉద్యోగాలు చెయ్యటంలేదూ? ఇదీ అంతే. ఆ ఉద్యోగాలు కేవలం ధనార్జన కోసరం చేస్తున్నవి. నేను కళాసేవ చేస్తున్నాను. మర్చిపోకండి,"అనేది.

కోటేశ్వరరావు ఎప్పుడూ మనస్సు కష్టపెట్టుకొనే స్వభావం గలవాడు కాదు. అతనికి, జీవితం అంటే ఒక తియ్యటి



మంత్రి హాలహార్వి సీతారామరెడ్డిగారికుమార్తె సౌ|| జయలక్ష్మి, బి. హెచ్. కేశవరెడ్డిగార్ల వివాహం ఇటీవల మద్రాసులో జరిగింది.

రోజున అతడు శారద దగ్గరకొచ్చి యిలా అన్నాడు:

"ఏమో శారదా, చూడు, ఆ బసవయ్య గారు నిన్ను యివాళ ఏడుగంటలకి రమ్మన్నారు. ఏదో వేషం యిస్తారుట"

శారద ఏమీ మాట్లాడలేదు. ఈ విధంగానే శారద నాతడు విచ్చలవిడిగా ప్రతి వాళ్ళ దగ్గరకీ వెళ్లనిచ్చేవాడు. కచ్చ నోట్ల కట్టలు చూసుకుని తృప్తిపడేవాడు.

కొన్నాళ్ళకి కోటేశ్వరరావు, శారదా ఒక పెద్ద మేడకట్టారు. రోజు సాయంత్రం అవగానే అతడు వీధులమ్మడి బయలుదేర్నవాడు, ఎవరైనా కొరున్నవాళ్లు, డబ్బున్నవాళ్లు కనిపిస్తారేమోనని. వాళ్ళకంత ఐశ్వర్యం ఎక్కడినించి వచ్చిందని ఎవరూ ప్రశ్నించడానికి సాహసించలేదు. సినిమాలో నటిస్తోంది ఆమాత్రం మేడ కట్టలేరాయేం అనుకునేవారు"

కోటేశ్వరరావు ఆప్తబంధువులూ, అతని మేలుగోరే స్నేహితులూ, "ఏరా కోటేశం నీ పెళ్లాం మరీ ఏ సినిమాథియేటర్లో చూచినా, ఏ హోటల్లో చూచినా కనుపిస్తోవుంటుంది. సినిమాలో నటిస్తున్నంత మాత్రాన మంచిసంస్కారంగల కుటుంబంనుండి వచ్చిన పిల్ల అలా తిరుగొచ్చా," అనేవారు బాధతో.

దానికి కోటేశ్వరరావు జవాబు యిది. "ఆవిడ చదువుకుంది. కావలసినంత సంస్కారముంది. మంచి కుటుంబంలోంచి వచ్చింది సినిమాల్లో నటిస్తోంది. జాగ్రత్త. ఆమె కన్యగాదు. వివాహితురాలు. ఇది 20-వ శతాబ్దం. మీరందరూ స్త్రీ స్వాతంత్ర్యం కావాలంటారు. భార్యలకి ఆమాత్రం స్వాతంత్ర్యం యివ్వకపోతే ఇంక మన సంస్కారమంతా ఎందుకు, వృథా కాక. ఆడవాళ్లు ఉద్యోగాలు చేయటంలేదూ అలాగే? నా భార్యకూడ సినిమాల్లో వేస్తోంది. ఏం నలుగురుమగాళ్లతో వేస్తే తప్పా? అదంతా కళారాధన. ఆమెకు కళలను పోషించడం అంటే ఎంతో సరదా. డబ్బుకోసరం కాదు సుమండీ ఈపని చేస్తుంటా. ఆమె కళారాధన చేయటానికి నేనామెకు సంపూర్ణ స్వాతంత్ర్యం యిచ్చాను. మనసార ప్రేమించడం అంటే ఏమిటి, అనందానికి అడ్డురాకపోవడమే. నే నిప్పుడు చేస్తున్నది అపనే. ఆమె మహా పతివ్రత. నిష్కళంక. ఆమె కళాసేవ చేస్తున్న ఒక దేవకన్య. నే నామెను గాఢంగా ప్రేమించాను."

ఇటువంటి భర్త దొరికినందుకు శారదమ్మని అదృష్టవంతురాలనాలా? దురదృష్టవంతురాలనాలా? ★



యం. కె. యం. ప్రొడక్షన్స్‌వారి 'మరదలు పెళ్లి' లో సూర్యకుమారి.

సినిమా:

ప్రపంచంలోని అత్యుత్తమచిత్రాలు

ప్రాక్పశ్చిమ వైషమ్యాలు రాజకీయ వాగ్వాదాలతో నిమిత్తం లేకుండా చలనచిత్ర పరిశ్రమను వృద్ధిపరచుకున్న సర్వదేశాలూ అంతర్జాతీయ చలనచిత్ర ప్రదర్శనోత్సవంలో పాల్గొని తమ తమ ఉత్తమచిత్రాలను ప్రతినిధులనూ భారతదేశానికి పంపాయి. యూరప్‌లో కూడా ఇట్టి ప్రదర్శనలు జరిగాయి కాని, ఎన్నడూ ఇన్ని కమ్యూనిస్టుదేశాలు, పాశ్చాత్యదేశాలు ఇంత ఉత్సాహంగా పాల్గొనలేదని చెప్పాలి. ఇటువంటి అపూర్వావకాశాన్ని కలిగించిన భారత ప్రభుత్వం కృషిని అన్ని దేశాల ప్రతినిధులూ ప్రశంసించారు. బొంబాయిలో పదిహేనురోజుల అనంతరం మద్రాసులో 8 వ తేదీని ప్రదర్శనం ప్రారంభమయింది. ప్రారంభోత్సవ సమయంలో ప్రధాన న్యాయమూర్తి శ్రీ పాకాల రాజమన్నార్ గారు చలనచిత్రాలలో కళాదృష్టి ప్రాధాన్యతను వివరించారు. ఇతర కళలలోవలెనే చలనచిత్ర కళలో కూడా కేవల కల్పనాశిల్పానికీ, వాస్తవిక దృక్పథానికీ మొగ్గుతున్న విరుద్ధయత్నాల గురించి వారు చెప్పారు.

భారతప్రభుత్వం ఇట్టి అపూర్వావకాశాన్ని కల్పించినా మద్రాసులో థియేటర్లు వినియోగపరుచుకో లేకపోయినాయి. ఇందుకు బాధ్యత నిర్వాహకులూ, థియేటర్ల యజమానులూ సమానంగా భరించక తప్పదు. సినీ టెక్నీషియన్స్ ఎసోసియేషన్ వారి కృషి మాత్రం ప్రశంసనీయం. వారి ఓపెన్ఎయిర్ థియేటర్ ఏర్పాటు నిర్దుష్టంగా ఉంది.

ప్రపంచంలోని ఉత్తమ చిత్రాలను చూపుతున్న ఈ సందర్భంలో దక్షిణదేశంలో చలనచిత్ర పరిశ్రమకు సంబంధించినవారికీ, పత్రికలకూ సౌకర్యం ఏర్పాటు చెయ్యాలనే అవసరాన్ని నిర్వా



ఆమె యౌవనం అడవిగాచిన వెన్నెల. —వినోదావారి 'శాంతి'లో 'మంజరి'గా సావిత్రి.



హకులు గుర్తించపోవడం శోచనీయం. అయితే సినీ టెక్నిషియన్స్ ఎసోసియేషన్ వారు కష్టనష్టాలకు భరించి అందరికీ అతి చౌకటిక్కెట్లు అమ్మి అవకాశం కల్పించడంవల్ల ఈలోటు అంతగా కనపడ్డం లేదు.

నిర్వాహకులకు కలిగిన చిక్కులవల్లనో, లేక థియేటర్లు సహకరించనందువల్లనో గాని బొంబాయిలో ప్రదర్శించబడిన చిత్రాలలో కొన్ని ముఖ్యమైనవి మద్రాసులో ప్రదర్శించబడలేదు.

థియేటర్లు అన్నీ బస్సులకీ ట్రామ్ వేకీ సమీపంలో లేకపోయినా ప్రేక్షకుల కెక్కడా కొదువలేదు. భాష తెలియకపో

శుభోదయా వారి 'ఆదర్శం'లో రేవతి, ఆత్రేయ.



యం. కె. యం. వారి 'మరదలు పెళ్లి'లో ముక్కామల, సూర్యకుమారి.




విశ్వామిత్రుడూ కాదు, మేనకా కాదు, శకుంతల కాదు.
విజయవారి 'పెళ్లి చేసిచూడు'లో ఎన్. టి. రామారావు, జి. వరలక్ష్మి, సెల్యులాయిడ్ బొమ్మ.

యినా విదేశీచిత్రాలను చూడాలనే ఆకాంక్ష మద్రాసు ప్రజలలో కనపడింది. క్రికెట్ టెస్ట్ మాచ్ వల్ల కూడా థియేటర్ల రాబడికి భంగం కలుగలేదు. సినిమా పరిశ్రమకు సంబంధించినవారచేకులు వచ్చారు

ప్రదర్శించబడినచిత్రాలలో (శనివారం రాత్రివరకూ) అందరినీ ఆకర్షించిన రష్యన్ డాక్యుమెంటరీ చిత్రాలు, ఇటాలియన్ చిత్రాలు, జపనీస్ చిత్రం (యుకివారిహూ).

ఏ కథాచిత్రం కంటె కూడా అధికంగా ఆకర్షించే రష్యన్ డాక్యుమెంటరీలను చూసి కథాచిత్రాల నిర్మాతలుకూడా నేర్చుకోవలసిన దెంతైనా ఉంది. వీని తరవాత చెప్పుకోవలసినవి ఇటాలియన్, జపనీస్ చిత్రాలు. హాలీవుడ్ నిర్మాతలకున్నన్ని సౌకర్యాలు, అంత మార్కెట్ లేకపోయినా, ఇటాలియన్లు కళకెక్కువ ప్రాధాన్యమిచ్చి అత్యుత్తమ చిత్రాలను నిర్మిస్తున్నారు. అలాగే జపనీస్ చిత్రం (యుకి



భారతలక్ష్మీవారి 'ప్రియురాలు'లో చంద్రశేఖర్, లక్ష్మీకాంత.



యువావారి 'టింగ్ రంగా'లో పాములవాళ్లు నల్లరామూర్తి, సీతారామయ్య.

వారిసూ)లో కూడా కథావస్తువు అత్యంత ఆకర్షణీయమైనది. ఈ చిత్రాల ప్రదర్శన ప్రభావం మనదేశపు చిత్రాలలో త్వరలోనే ద్యోతకం కావచ్చును.

ప్రదర్శనకోసం వచ్చిన ప్రతినిధులు సినీ టెక్నిషియన్స్ ఎసోసియేషన్ వారి సింపోజియంలో పాల్గొన్నారు. అమెరికన్ రష్యన్ ప్రతినిధి వర్గాలవారు పత్రికా సమావేశాలు జరిపారు. ఈ సందర్భంలో ప్రఖ్యాత హాలీవుడ్ డైరెక్టర్ ఫ్రాంక్ కాప్రా అమెరికన్ చలనచిత్ర పరిశ్రమను గురించి కొన్ని అంశాలు చెప్పారు. అక్కడ ప్రభుత్వపు సెన్సార్ లేదట. అయితే ఏ ప్రాంతంలో ప్రాంతీయ ప్రభుత్వాలు ఎట్టి శాసనాలు చేశాయో, ఏ యే దేశాలలో ఎట్టి నియమాలు అమలులో ఉన్నాయో వానిని గమనించి నిర్మాతలే

వెయ్యి అబద్ధాలు చెప్పి పెళ్లిళ్లు చెయ్యాలనే జిల్లాబోర్డు ఎక్స్ ప్రెసిడెంట్ వియ్యాన్నికి ఎరికిలో ఉన్న సంబంధాల్ని పాలేళ్లు ఏకరువుపెడుతున్నారు.





అంజలీ వారి 'పరదేశి'లో వృద్ధ దంపతులుగా అంజలి, నాగేశ్వరరావు.



తండ్రిహత్యకు ప్రతీకారం చెయ్యడం కోసం మారువేషం ధరించిన కరుణకుమార్ — వినోదా వారి 'శాంతి'లో రామచంద్రకాశ్యప.

స్వయంగా సెన్సార్ చేసుకుంటారు. ఈ సెన్సారింగ్ కోసం ఒక సంఘాన్ని ఏర్పాటుచేసుకున్నారు.

చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన వారందరూ మోషన్ పిక్చర్ రిలీఫ్ ఫండ్ అనేది కూడా స్థాపించుకున్నారట. నిర్మాతల మొదలు కూలీలవరకూ ఈ పరిశ్రమలో పనిచేసిన వారందరూ వారివారి జీతాలలో నూరింట 1 వంతు ఈ నిధికి ఇస్తారు. పరిశ్రమనుంచి వృద్ధాప్యంవల్ల కాని, తదితర కారణాలవల్లకాని విరమించుకున్న వారికి ఈనిధి ఆర్థికసహాయ మిస్తుంది.

సినీ టెక్నిషియన్స్ ఎసోసియేషన్‌లో ప్రతినిధు లందరికీ సన్మాన మివ్వబడింది. ఈ సందర్భంలో రష్యన్ ప్రతినిధి వర్గ నాయకుడు డిప్యూటీ మంత్రి యాన్. సెమె నోవ్ భారతదేశ పరిశ్రమతో రష్యన్ పరి శ్రమ సహకరించడానికి సంసిద్ధంగా

యువావారి 'టింగ్ రంగా'లో వింత ఆశ్రమంలో శ్రీరామమూర్తి, ఎస్. వరలక్ష్మి, సరళ, కనకం.





భారతలక్ష్మీవారి 'ప్రియురాలు'లో కృష్ణకుమారి, వెంకటేశ్వరరావు.

ఉందని చెప్పారు. భారతదేశంనుంచి చలనచిత్ర పరిశ్రమకు సంబంధించినవారిని తరుచు రష్యా తీసుకువెళ్ళడానికి ఏర్పాట్లు జరిగాయి. రష్యానుంచి టెక్నీషియన్లను భారతదేశం పంపి భారతీయ పరిశ్రమాభివృద్ధికి సహాయం చెయ్యడానికి రష్యా సిద్ధంగా ఉన్నట్లు, ముఖ్యంగా రష్యన్ల ప్రత్యేక [illegible] విధానాన్ని నేర్పుతారట. అమెరికన్ల [illegible] రష్యన్ల [illegible] [illegible] [illegible] సహాయకారిగా ఉంటుంది. రష్యన్ చిత్రాలను భారతదేశానికి ఎగుమతిచేసి, భారతీయ చిత్రాలను రష్యాకు దిగుమతిచేసుకోడానికి కృషి జరుగుతోంది.

ఇంతేకాక భారత పరిశ్రమకు తోడ్పడి భారతదేశానికి సంబంధించిన డాక్యుమెంటరీలను తీయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయనికూడా [illegible] చెప్పారు. అప్పుడే అమెరికన్, బ్రిటిష్ చిత్ర నిర్మాతలు భారత పరిశ్రమతో కలిసి చిత్రనిర్మాణానికి పూనుకున్నారు. రష్యన్లు కూడా రంగంలోకి దిగితే, ఇంక మనదేశ చిత్ర పరిశ్రమ [illegible] అభివృద్ధి చెందగలదని ఆశించవచ్చు. ★



జనవరి 11 న విడుదలైన [illegible]లో

కోటేశ్వరరావు, మల్లేశ్వరరావు.

ఒకటో తారీకు

(4-వ పేజీ తరువాయి)

విప్పుతూ. రాముడు అక్కణ్నుంచిలేచి లోపలికి వెళ్ళింది; లోపల్నుంచి విసనకర్ర చప్పుడు వినబడుతున్నది. కాఫీతాగి కాలేజీకి బైలుదేరాను. రాముడు దగ్గరగావచ్చి చొక్కాగుండీ తిప్పుతూ, "తొందరగ వస్తారా?" అన్నది, సిగ్గుపడుతూ.

"ఏం విశేషం?" అన్నాను, మామూలు ధోరణిలో; అయితే విశేషాలు వినటానికి సిద్ధంగాలేను. రాముడు నా గుండెల్లో ఒక్కక్షణం ముఖం దాచుకుని లోపలికి పరుగెత్తుకుని వెళ్ళిపోయింది, కాఫీ కప్పు తీసుకుని. నాగుండెలు కుదటబడ్డై.

వెధవది, ఆరోజు శనివారమై పోయింది. వచ్చిన జీతం డబ్బులు జాగ్రత్తగా సొరుగులో పెట్టి వెనక్కి తిరిగిచూశాను. రాముడు కాలిబొటన వేలివంక చూసుకుంటూ నిలబడి ఉన్నది; నా ప్రాణాలు ఎగిరిపోయినై. నేను మాట్లాడ్లేదు.

రాముడు వచ్చి నా రెండుభుజాలు పట్టుకున్నది, ప్రక్కకు చూస్తూ నేను ముఖం మీదపడ్డ ముంగురులు సరిచేస్తున్నాను.

"మరే—" అన్నది, ఫుటుక్కున.

ఈ 'మరే' ఎక్కడికి దారితీస్తుందో నాకు తెలుసు. నేను రాముడిచేతులు విడిపించుకోబోయినాను. రాముడు వదల్లేదు; నసుగుతున్నది.

"ఉండు, కాస్తపని ఉన్నది" అన్నాను, మళ్ళీ ప్రయత్నిస్తూ.

"ఫోండి" అన్నది రాముడు, నన్ను వదిలి కోపం అభినయిస్తున్నది

నిజంగా కోపం వచ్చినామాను? ఆ రోజు ఒకటో తారీకు; అందులో శనివారం!

నేను గుమ్మం దాటబోతుండగా, "ఏమండీ" అన్నది, ఏదో చెప్పబోతూ. ఏం చెబుతుందో, నాకు తెలీకపోతేగా!

నేను అక్కడే ఆగి వెనక్కి తిరిగాను. సంగతేమిటో చెప్పొచ్చు నా—నన్ను చూసి తలకాయ వంచుకుని నిలబడ్డది.

"ఏమిటే-?" అన్నాను, విసుక్కుంటూ.

"పానీలెంకి, మీ కంత విసుగైతే?" అన్నది, మూతిముడుచుకుని; ఇది పాశుపతాస్త్రం!

నేను మాట్లాడకుండా నిలబడ్డాను; డబ్బులుపెట్టిం తర్వాత సొరుక్కి తాళం వెయ్యలేదని గుర్తొచ్చింది.

రాముడు మెల్లిగా అడుగువేసుకుంటూ నా దగ్గిరికివచ్చి, ఏదో చెప్పటానికి పెదిమెలు కదిల్చింది. పాపం, అనుమానిస్తున్నది—అడగటానికి. ఇదీ ఒకందుకు మంచిదేలే—

"మరే" అన్నది, మళ్లీ; నా గుండెలు ఝుల్లుమన్నై.

నేను మాట్లాడ్లేదు.

రహస్యం చెప్పదల్చుకున్నట్టు నోరు దెరిచి, మళ్ళీ పెదిమెలు బిగించింది.

నాకు నవ్వు వచ్చింది—దాని అవపక్కున నవ్వాను. అమాయికంగా నా పాట నవ్వింది, మెల్లిగా. నేను ఇ బోయినాను.

"నెలఅయిపోయింది" అన్నది; నా గుండెల్లో రాయిపడ్డది.

'పైనెల్లో చీరె తప్పకుండా కొని పెడ్తాలే' అన్నాను సింపటిచూటు

"తర్వాత చూద్దాంలే" అన్నాను, తప్పించుకోటానికి.

"కాదు—"అన్నది, సిగ్గుపడ్తూ, చేత్తో సౌంజ్ఞచేసింది. చెవిదగ్గర నోరుపెట్టి, రహస్యంగా

"పా...పా...యి" అన్నది.

తస్సదియ్యా—దీనికా పొద్దుట్నుంచీ, దీని పెళ్ళికూతురు సిగ్గుతెరలు? హృదయం గంతులేసింది.

రాముడి బుగ్గలు కొరకబోయినాను; కిలకిల నవ్వుకుంటూ లోపలికి పరుగెత్తుకుని వెళ్లిపోయింది.

నేను సొరుగులోనుంచి పైకం తీసుకుని బజారుకు పరుగెత్తాను. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., Madras



'ధ్యానం'

—చిత్రకారుడు శ్రీ ఆర్. వెంకట్రావుగారు
(స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఎండ్ క్రాఫ్ట్స విద్యార్థి.)

Regd. No. M 4479

